
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 12

గురువారం 4-4-2024



విశాఖలో పరుగుల సంద్రం

కోల్‌కతా 272/7. ఢిల్లీపై 106 పరుగులతో గెలుపు

-12లో



బీజేపీ ఆటలు సాగనివ్వం

ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి యత్నాలు: రాహుల్

-6లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

నేటి నుంచి జేఈఈ మెయిన్స్



జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్) రెండో విడత గురువారం నుంచి దేశవ్యాప్తంగా మొదలుకానుంది. దీని కోసం ఎన్‌టీఏ అన్ని ఏర్పాట్లు చేసింది.

- వివరాలు 14లో

ఆరు గ్యారంటీలపై చర్చకు సిద్ధమా?



ఆరు గ్యారంటీలపై మంత్రులు చర్చకు సిద్ధంగా ఉన్నారా అని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఎన్నికల హామీలను అమలు చేయని కాంగ్రెస్ నిజస్వరూపం ప్రజలకు తెలిసిందని అన్నారు.

- వివరాలు 3లో

తైవాన్‌లో తీవ్ర భూకంపం



ద్వీప దేశం తైవాన్‌లో శక్తివంతమైన భూకంపం సంభవించింది. బుధవారం ఉదయం 8 గంటలకు చోటుచేసుకున్న భూప్రకంపనల వల్ల పలు భవనాలు ధ్వంసమయ్యాయి. 9 మంది మరణించారు. మరో 934 మంది క్షతగాత్రులుగా మారారు.

- వివరాలు 6లో

కొత్త రుణాలు కావాలా..

పాత అప్పు కట్టండి

రైతులకు తేల్చి చెప్తున్న బ్యాంకులు ● మౌఖిక ఒత్తిళ్లు.. లీగల్ నోటీసులు సైతం జారీ

- రుణమాఫీ జరగక, అప్పు తిరిగి చెల్లించకపోవడంతో పేరుకుపోయిన బకాయిలు
- ముందుకు కదలని రుణమాఫీ ప్రక్రియ... కనీసం మార్గదర్శకాలు కూడా ఖరారు కాని వైనం
- ఎన్నికల కోడ్ ఆటంకంతో ఇప్పట్లో సాధ్యమయ్యే అవకాశం లేదంటున్న వ్యవసాయశాఖ
- రూ. 2 లక్షల వరకు రుణ మాఫీకి రూ.30 వేల కోట్లు అవసరమని సర్కారు అంచనా
- ఏప్రిల్‌లోనే బ్యాంకుల పంట రుణాల ప్రక్రియ షురూ
- ఈ కారణంగానే అప్పులు తిరిగి చెల్లించాలని, రెన్యువల్ చేసుకోవాలని కోరుతున్న బ్యాంకులు
- బ్యాంకులు చెప్పిన విధంగా చెల్లించాలంటున్న వ్యవసాయ శాఖ
- రైతుబంధు మొత్తాన్ని జమ చేసుకున్న కొన్ని బ్యాంకులు... దిక్కుతోచని స్థితిలో రైతాంగం



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు మహబూబాబాద్ జిల్లా బయ్యారానికి చెందిన తగిర వెంకట్‌రెడ్డి. కొన్నేళ్ల క్రితం ఈయన ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో పంట రుణం తీసుకున్నాడు. రుణమాఫీ అవుతుందనే ఆశతో తిరిగి కట్టలేదు. ప్రస్తుతం అప్పు, వడ్డీతో కలిపి మొత్తం రూ.2.16 లక్షలు అయ్యింది. గత నెల బ్యాంకర్లు అప్పు చెల్లించాలంటూ లీగల్ నోటీసులు పంపించారు. దీంతో భయపడిన వెంకట్‌రెడ్డి బ్యాంకును సంప్రదించగా వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేసుకోవాలని సూచించారు. విధిలేని పరిస్థితుల్లో ఆ మేరకు రూ.1.47 లక్షలు చెల్లించాడు.



ఇతను సూర్యాపేట జిల్లా మోతే మండలానికి చెందిన రైతు ఉపేందర్. అక్కడి గ్రామీణ బ్యాంక్‌లో రూ.90 వేల లోన్ తీసుకున్నాడు. రుణమాఫీ జరుగుతుందనే ఆశ, మరోవైపు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తిరిగి చెల్లించలేదు. దీంతో రెండేళ్ల నాలుగు నెలల కాలానికి రూ.30 వేల వడ్డీ చెల్లించాలని బ్యాంకర్లు కోరారు. ప్రభుత్వం ఫిబ్రవరిలో వేసిన రైతుబంధు మొత్తంతో పాటు గతంలో ఖాతాలో ఉన్న నగదును కూడా స్తంభింప (ఫ్రీజ్) జేశారు. ప్రభుత్వ హామీతో తమకు సంబంధం లేదని, వడ్డీ చెల్లించాల్సిందేనని బ్యాంక్ మేనేజర్ తేల్చిచెప్పడంతో రూపాయిన్నర లెక్కన వడ్డీ చెల్లించాడు.

- వివరాలు 10లో



సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులో రియాక్టర్ పేలడంతో ధ్వంసమైన ఎస్‌బీ ఆర్గానిక్ పరిశ్రమ



సంగారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రసాయన పరిశ్రమలో

పేలిన రియాక్టర్

- ఘోర ప్రమాదంలో పరిశ్రమ యజమాని సహా ఐదుగురు మృత్యువాత
- 30 మందికి పైగా కార్మికులకు గాయాలు.. ఏడుగురి పరిస్థితి విషమం
- మృతులు వివిధ రాష్ట్రాలకు చెందిన వారీగా గుర్తింపు
- సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్‌లో ఘటన
- గవర్నర్, సీఎం సహా ప్రముఖుల దిగ్భ్రాంతి... ఘటనా స్థలానికి మంత్రులు, అధికారులు

10లో



ధర్మాన్ని గెలిపించండి

విశ్వసనీయత, మోసం.. రెండింటిలో మీరు దేనివైపో ఆలోచించండి

పూతలపట్టు సభలో ప్రజలకు ఏపీ సీఎం జగన్ పిలుపు

"చంద్రబాబు ఇప్పుడు మరీ దిగజారిపోయాడు. మూడు రోజులుగా అవ్వాతాతలు పడుతున్న బాధలన్నీ మీకు కనిపిస్తున్నాయి. ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే సూర్యుడు ఉదయిస్తున్నాడో లేదోగానీ, వలంటీర్లు మాత్రం చిరునవ్వుతో వచ్చి తలుపుతట్టి సెలవుదినమైనా, పండుగ దినమైనా అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు చూస్తూ మనవళ్లుగా, మనవరాళ్లుగా పింఛన్ అందించే వారు. ఇది గిట్టని చంద్రబాబు పథకం ప్రకారం ఎలక్షన్ కమిషన్‌కు నిమ్మగడ్డ రమేష్ అనే తన మనిషి చేత లేఖలు రాయించి, ప్రెజర్ పెట్టించి వలంటీర్ వ్యవస్థకు అడ్డు వేయించారు. ఈ రోజు ఆ నడవలేని వయసులో అవ్వాతాతలు పెన్షన్ అందుకునేందుకు పడుతున్న అగచాట్లు చూస్తున్నప్పుడు చంద్రబాబు నాయుడు మనిషా లేక శాడిస్టా అని అడుగుతున్నాను.

- సీఎం వైఎస్ జగన్

5లో

పూతలపట్టు వద్ద ఏపీ సీఎం జగన్‌ను ఆప్యాయంగా ముద్దాడుతున్న చిన్నారి

ఇందిరమ్మ స్థానం

మన ఖాతాలోకే...

మెదక్ లోక్‌సభ నియోజకవర్గ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రతిష్టాత్మకంగా తీసుకుందాం... కలిసికట్టుగా పనిచేసి పూర్వ వైభవం తెద్దామని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్. చిత్రంలో రాజనర్సింహ, మైనంపల్లి

సాక్షి, హైదరాబాద్: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంటు స్థానం ఈసారి కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకే రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని నేతలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు. అందరూ కలిసికట్టుగా పనిచేయడం ద్వారా మెదక్ స్థానంలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని స్పష్టం చేశారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మెదక్ లోక్‌సభ పరిధిలోని నేతలతో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖతోపాటు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, పార్టీ నేతలు కాటా శ్రీనివాస్‌గౌడ్, ఆవుల రాజిరెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణ, ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు. సమీక్షలో భాగంగా రేవంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని

మిగతా 2వ పేజీలో ▶

9 అడుగుల్లో బోరు.. కరెంటు లేకున్నా 20 ఏళ్లుగా నీరు

- ఆదిలాబాద్ జిల్లాలో ఓ రైతు చేనులో ఆగని జలధార..
- 2005లో వేసిన బోరు.. మండే ఎండల్లోనూ నిరంతరాయంగా ప్రవాహం

14లో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

నా వ్యక్తిత్వ హననానికి

రేవంత్‌రెడ్డి యత్నం

- కొండా సురేఖ మెదడులేని విమర్శలు చేస్తోంది: మాజీ మంత్రి కేటీఆర్
- చట్ట వ్యతిరేక వ్యవహారాలు, ఫోన్ ట్యాపింగ్‌తో నాకు సంబంధం లేదు
- చనిపోయిన రైతుల వివరాలు సీఎంకు పంపిస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: 'నాకు ఎలాంటి చట్ట వ్యతిరేక వ్యవహారాలతో, ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధం లేదు. ఫోన్ ట్యాపింగ్ అంటూ లీకు వీరుడు రేవంత్‌రెడ్డి నా వ్యక్తిత్వ హననానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. ఆయనకు మీడియా సమావేశం పెట్టి ఆధారాలు బయట పెట్టే దమ్ము లేదు. పోలీసు రిమాండులో ఉన్న వారి ఫోన్ల నుంచి కూడా లీకులు వస్తున్నాయి. నేను ఎవరో హీరోయిన్లను బెదిరించినట్లు మంత్రి కొండా సురేఖ మెదడు లేని విమర్శలు చేస్తోంది. ఇలాంటి దిక్కుమాలిన పనులు చేయాల్సిన కర్మనాకేంటి? ఎవరి ఫోన్లు ట్యాపింగ్ చేయాల్సిన, బెదిరించాల్సిన అవసరం మాకు లేదు. అడ్డగోలుగా చెత్త మాటలు మాట్లాడితే మంత్రి అయినా ముఖ్యమంత్రి అయినా తాటతీస్తాం.. న్యాయపరంగా ఎదుర్కొంటాం..'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో బుధవారం పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి

మిగతా 3వ పేజీలో ▶

నీటి ఎద్దడి నివారణ ఎలా?


- పట్టణాల్లో నీటి సమస్యపై ప్రభుత్వం తర్జనభర్జన
- తాగునీటి సమస్య లేకుండా చూడాలని కలెక్టర్లు, మున్సిపల్ అధికారులకు ఆదేశాలు

- వివరాలు 2లో

ఇదంజగత్



కృష్ణా జలాలు తీసుకుంది చాలు!



- తెలంగాణకు కృష్ణాబోర్డు ఆదేశం
- శ్రీశైలం, సాగర్ నుంచి నీళ్లు తీసుకోవడాన్ని తక్షణమే ఆపాలని స్పష్టీకరణ
- ఏపీ ఫిర్యాదు మేరకు చర్యలు
- కృష్ణా బోర్డు వైఖరిపై తెలంగాణ అసంతృప్తి
- వివాదంపై కేంద్రానికి లేఖ రాయనున్న బోర్డు

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల వినియోగం విషయంలో తెలంగాణ రాష్ట్రానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి నీళ్లను తీసుకోవడాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని తెలంగాణ రాష్ట్రాన్ని కృష్ణా నదీయాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) ఆదేశించింది. ఈ మేరకు కృష్ణా బోర్డు సభ్యులు డాక్టర్ ఆర్ ఎన్ శంఖువా తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖకు ఈ నెల 2న లేఖ రాశారు. కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ జరిపిన కేటాయింపులకు మించి 7.391 టీఎంసీలను తెలంగాణ వాడుకుందని ఫిర్యాదు చేస్తూ

మిగతా 2వ పేజీలో ▶

బీజేపీ ఎందుకు సుమోటోగా తీసుకోవడం లేదు?



- ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్నది ఎంతటి పెద్దవారైనా వదిలిపెట్టం
- తప్పుచేసిన వారిని జైలుకు పంపుతాం
- నీటిపారుదల, విద్యుత్‌శాఖల్లో అవినీతిపై నిగ్గు తేలుస్తాం
- మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ఇండియన్ టెలికం యాక్ట్‌పై కేంద్రానికి పూర్తి అధికారం ఉంది. ఫోన్ ట్యాపింగ్ కేసును సుమోటోగా స్వీకరించొచ్చు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ కేసును ఎందుకు సుమోటోగా తీసుకోవడం లేదు? ఆ పార్టీ నేతలు అవగాహన రాహిత్యంతో ప్రత్యక్షంగా కాంగ్రెస్‌పై అడ్డగోలు ఆరోపణలు చేస్తూ..పరోక్షంగా బీఆర్ఎస్‌కు సహకరిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న వారు ఎంతటి పెద్దమనుషులైనా వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఈ విషయంలో చట్టం తనపని తాను చేసుకుని పోతోంది'అని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు

మిగతా 3వ పేజీలో ▶

జిల్లా కేటగిరీ పోస్టులకు 1:3 నిష్పత్తి!



- ఉద్యోగ నియామక పరీక్షల్లో టీఎస్‌పీఎస్సీ వ్యూహం
- ఒకటికంటే ఎక్కువ ఉద్యోగాలు వచ్చినా..పూర్తిస్థాయి భర్తీకి అవకాశం
- జోనల్, మల్టీ జోనల్ పోస్టులకు మాత్రం 1:2 నిష్పత్తిలో ఎంపిక

సాక్షి, హైదరాబాద్: నోటిఫికేషన్‌లో నిర్దేశించిన పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేసేలా తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చర్యలు చేపట్టినట్టు తెలిసింది. ఇందులో భాగంగా అత్యధిక సంఖ్యలో కొలువులున్న జిల్లాస్థాయి ఉద్యోగ కేటగిరీలో ప్రాథమిక అర్హుల జాబితా ఎంపికకు 1:3 నిష్పత్తిని అనుసరించనుంది. జిల్లాస్థాయి కేటగిరీ ఉద్యోగాల్లో గ్రూప్–4 ఉద్యోగాలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. దాదాపు 9 వేల ఉద్యోగాలుండగా... వీటి భర్తీకి 1:3 నిష్పత్తి ఫార్ములానే అమలు చేయనున్నారు. దీంతో పాటు జిల్లాస్థాయిలోకి వచ్చే ఇతర పోస్టులకూ ఇదే ఫార్ములా అమలు చేయనున్నట్టు

మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...

రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి

యూఎస్ క్లైమేట్ సైన్స్ కంపెనీ ప్రతినిధుల భేటీలో మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రైతుల ఉత్పత్తులను పెంచేందుకు, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేలా ఏ పరిశోధనలనైనా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో యూఎస్ క్లైమేట్ సైన్స్ కంపెనీ ప్రత్యేక ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. కంపెనీ నిర్వహించే పరిశోధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ పరిశోధనల ద్వారా రైతులకు కలిగే లాభాలపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. వరిపంటలో విడుదలయ్యే కర్బన ఉద్గారాలను తగ్గించడానికి ఎలాంటి విధానాలు పాటిస్తారు వంటి అంశాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల గోల్‌మాల్‌లో మరో కేసు నమోదు

బంజారాహిల్స్ (హైదరాబాద్): తమకు రావాల్సిన సీఎం రిలీఫ్ ఫండ్‌ను చీటింగ్ చేసి కాజేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ ఓ బాధితుడు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మాజీ మంత్రి హరీశ్‌రావు కార్యాలయ మాజీ కంప్యూటర్ ఆపరేటర్ జోగుల నరేశ్‌కుమార్, కొర్లపాటి వంశీ, బాలగోని వెంకటేశ్‌గౌడ్, ఓంకార్, స్వరూప తదితరులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. రహమత్‌నగర్‌లో నివసించే భరత్‌కుమార్ తన తల్లి లక్ష్మి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మాజీమంత్రి హరీశ్‌రావు కార్యాలయంలో గతంలో పనిచేసిన నరేశ్ అనే వ్యక్తి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల గోల్‌మాల్‌కు పాల్పడినట్లుగా ఇటీవల తాను పత్రికల్లో చూశానని, దీంతో సంబంధిత కార్యాలయంలో విచారించగా తన తల్లి పేరు మీద రూ.60 వేల చెక్కు మంజూరైనట్లుగా చెప్పారన్నారు. ఈ చెక్కును జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–5లోని ఎస్‌బీఐలో ఫోర్జరీ డాక్యుమెంట్లతో డ్రా చేసినట్లుగా గుర్తించామన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీసీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు కేటాయించాలి

బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: జనాభా దామాషా ప్రకారం 60 శాతానికిపైగా ఉన్న బీసీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు కేటాయించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేని కారణంతో రాజకీయ పార్టీలు బీసీలకు సీట్లిచ్చే విషయంలో అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లి కేంద్ర కార్యాలయంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా నివాళులర్పించారు. బీసీలంతా పార్టీలకతీతంగా మెజారిటీ స్థానా ల్లో బీసీ అభ్యర్థులకే ఓటు వేసి కనీసం 8 మంది బీసీ ఎంపీలను తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో అడుగుపెట్టేలా ఉద్యమిస్తామన్నారు.

హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణకు బెయిల్

ఆయన సోదరుడు శివనవీన్‌కు కూడా..

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణకు నాంపల్లి ఏసీబీ కోర్టులో ఊరట లభించింది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు అనుమతించింది. శివబాలకృష్ణతోపాటు ఆయన సోదరుడు శివనవీన్‌కు కూడా బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్షతో పాటు ఇద్దరు పూచీకత్తు ఇవ్వాలని పిటిషనర్లను ఆదేశించింది. అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని శివబాలకృష్ణ, శివనవీన్‌ను కోర్టు ఆదేశించింది. తనను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలులో ఉంచి దాదాపు రెండు నెలలు దాటిందని, విచారణకు కూడా పూర్తిగా సహకరిస్తున్నానని...ఈ నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలంటూ ఆయన మూడోసారి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. పిటిషనర్, ఏసీబీ తరఫు న్యాయవాదుల వాదనలు విన్న న్యాయమూర్తి..శివబాలకృష్ణ, శివనవీన్‌కు బెయిల్ మంజూరు చేశారు.

మాదిగలకు 2 ఎంపీ సీట్లు కేటాయించాలి: వంగపల్లి

ముషీరాబాద్ (హైదరాబాద్): పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయ్యేలోపు 2 ఎంపీ టికెట్లను మాదిగలకు కేటాయించాలని, లేదంటే కాంగ్రెస్ నేతల ఇళ్ల ముందు మాదిగలు చావుడప్పు మోగిస్తారని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ హెచ్చరించారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి నియోజకవర్గం నుంచి చిన్నారెడ్డిని ప్రకటించి ఆ తర్వాత మేఘారెడ్డికి ఇచ్చారని తెలిపారు. పటాన్‌చెరువు నియోజకవర్గం నుంచి నీలం మధును మార్చి వేరే అభ్యర్థికి ఇచ్చారని, ప్రకటించిన అభ్యర్థులను మార్చి రెండు స్థానాల్లో మాదిగ అభ్యర్థులకు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో 75 శాతానికి పైగా ఉన్న మాదిగలను విస్మరించి 2 ఎంపీలను మాలలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు.

నీటి ఎద్దడి నివారణ ఎలా?

పట్టణాల్లో నీటి సమస్యపై ప్రభుత్వం తర్జన భర్జన

తాగునీటి సమస్య లేకుండా చూడాలని కలెక్టర్లు, మునిసిపల్ అధికారులకు ఆదేశాలు	పర్యవేక్షణకు జిల్లాల వారీగా ఐఏఎస్‌ల నియామకం	రెండునెలలపాటు అధికారులెవరూ సెలవులు పెట్టొద్దని ఆదేశాలు	హైదరాబాద్, శివారు ప్రాంతాలకు నీటి సమస్య లేదని అంచనా



సాక్షి, హైదరాబాద్: 'కరీంనగర్ చొప్పదండి మునిసిపాలిటీలో గత కొద్ది రోజులుగా నీటి సమస్య తీవ్రమైంది. పట్టణంలోని కొన్ని వార్డులకు తాగునీటిని అందించలేక మునిసిపల్ అధికారులు సతమతమవుతున్నారు. ఐదు కిలోమీటర్ల దూరంలో గాయత్రి పంప్ హౌజ్ , పక్కనుంచే ఎస్ఆర్ఎస్‌పీ కాలువలు పోతున్నా ఈ మునిసిపాలిటీకి సరైన నీటి సదుపాయం లేదు. మిషన్ భగీరథ పథకం ద్వారా వచ్చే నీరు కూడా రావడం లేదు.

'జగిత్యాల జిల్లా రాయికల్ మునిసిపాలిటీలోని కొన్ని వార్డుల్లో తాగునీటి సమస్య ఎక్కువైంది. ఎస్ఆర్ఎస్‌పీ నీరు ఉన్నప్పటికీ మూడు వార్డులకు సరిపడా నీళ్లను మునిసిపాలిటీ వాళ్లు అందించలేకపోతున్నారు. దీంతో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వార్డులోనే ఓ బావి తవ్వించి ఆ నీటిని మిషన్‌భగీరథ కోసం కట్టిన ట్యాంకుల్లోకి పంపించి ఇళ్లకు సరఫరా చేస్తున్నారు'

'కరీంనగర్ కార్పొరేషన్‌లో గతంలో ప్రతిరోజూ ఇంటింటికీ తాగునీటిని అందించగా, తగ్గుతున్న దిగువ మానేరు నీటిమట్టంతో ఇప్పుడు రోజు విడిచి రోజు నీటి సరఫరా జరపడమే కష్టంగా మారిందని మునిసిపల్ అధికారులు ఆందోళన చెందుతున్నారు. కాగజ్‌నగర్ మునిసిపాలిటీలో కరెంటు సమస్య కారణంగా అధికారులు ఇంటింటికీ తాగునీరు అందించలేకపోతున్నారు'

మంగళవారం సీడీఎంఏ కార్యాలయంలో మునిసిపాలిటీల్లో తాగునీటి సమస్యపై జరిగిన అధికారుల సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన అంశాల్లో కొన్ని ఇవి. జలాశయాల్లో సరిపడినంతగా నీటి నిల్వలు లేకపోవడం, పెరిగిన సూర్యతాపానికి జలాశయాల్లోని నీరు కూడా క్రమంగా తగ్గుతుందనే భయంతో పాటు భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రాష్ట్రంలో నీటి సమస్య ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. ఈ నేపథ్యంలో సీడీఎంఏ దివ్య 140 పట్టణాల్లో తాగునీటి ఎద్దడి ఎదురవకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

జిల్లాల వారీగా ఐఏఎస్ అధికారుల నియామకం

రాష్ట్రంలో మునిసిపాలిటీలతో పాటు గ్రామాల్లో నీటి నిర్వహణపై దృష్టి పెట్టిన ప్రభుత్వం నీటి అవసరాలు, నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారులను నియమించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులను జారీ చేశారు. హైదరాబాద్ మినహా ఉమ్మడి తొమ్మిది జిల్లాలను విభజించి, పది మంది ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జులుగా నియమించారు. రానున్న రెండు నెలల పాటు అధికారులెవరూ సెలవులు పెట్టకూడదంటూ ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలకు ప్రత్యేక ఐఏఎస్ అధికారులు వీరే...

ఆదిలాబాద్, నిర్మల్ – ప్రశాంత్ జీవన్ పాటిల్ , కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల – కృష్ణ ఆదిత్య , కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లకు – ఆర్ వి కర్ణన్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట – అనిత రామచంద్రన్, నిజామాబాద్, కామారెడ్డి – శరత్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్– మల్కాజ్‌గిరి – విజయేంద్ర , మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్ కర్నూల్ – శృతి ఓజా, వరంగల్, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ – గోపి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట – భారతి కొలిగేరి , ఖమ్మం భద్రాద్రి, కొత్తగూడెం– సురేంద్రమోహన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

ట్యాంకర్ల డిమాండ్ అక్కడే

హైదరాబాద్ నగరానికి పశ్చిమాన ఉన్న మణికొండ, గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లోనే ట్యాంకర్ల డిమాండ్ ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. 644 ట్యాంకర్లు అందుబాటులో ఉండగా, మంగళవారం 6,593 ట్రిప్పుల్లో నీటి సరఫరా చేశాయి. భూగర్భ జలాలు తగ్గడం వల్లనే ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోందని వాటర్‌బోర్డు చెబుతోంది.

హైదరాబాద్ ప్రజలకు ఇబ్బంది లేదనే అంచనా

హైదరాబాద్, శివారు ప్రాంతాలకు అవసరమైన తాగునీటిని కృష్ణా, గోదావరి నదుల నుంచి తరలిస్తున్నారు. నాగార్జునసాగర్, ఎల్లంపల్లి, మంజీరా, సింగూరు జలాశయాలతో పాటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి కూడా హైదరాబాద్ వాటర్‌బోర్డు తీసుకుంటోంది. జలాశయాల నుంచి ప్రతిరోజూ 2,559 మిలియన్ లీటర్ల (ఎంఎల్‌డీ) నీటిని హైదరాబాద్ నగర వాసుల కోసం వినియోగిస్తున్నారు. ఇందులో జీహెచ్‌ఎంసీ కోర్‌సిటీకి (హైదరాబాద్ జిల్లా) 1082.62 ఎంఎల్‌డీ, శివారు సర్కిల్స్ (50 డివిజన్లు)కు 1,049. 58 ఎంఎల్‌డీ, ఓఆర్ఆర్ పరిధిలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు 277.21 ఎంఎల్‌డీ, మిషన్ భగీరథకు 149.47 ఎంఎల్‌డీ నీటిని వినియోగిస్తున్నారు. సింగూరు, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లలో అవసరమైన మేర నీరు అందుబాటులో ఉందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. గతేడాది 2,270 ఎంఎల్‌డీ నీటిని హైదరాబాద్‌కు సరఫరా చేయగా, ప్రస్తుతం 2,409.53 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నట్లు వెల్లడించింది. గతేడాది కంటే 139.53 ఎల్ఎండీ అదనంగా సరఫరా చేస్తున్నట్లు తెలిపింది.

తీసుకుంది చాలు!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ నెల 1న ఏపీ రాసిన లేఖకు స్పందించి ఆయన ఈ లేఖ రాయడం గమనార్హం. ఉభయ జలాశయాల్లో నిల్వలు అడుగంటిపోవడంతో మిగిలిన కొద్దిపాటి జలాలను తాగునీటి అవసరాలకు వాడుకొనే విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య వివాదం ముదిరింది.

కృష్ణాబోర్డుపై తెలంగాణ గరం..

శ్రీశైలం, సాగర్ జలాశయాల నుంచి కేటాయింపులకు మించి 7.391 టీఎంసీలను తెలంగాణ వాడుకున్నట్టు ఏపీ చేసిన ఆరోపణలతో ఏకీభవిస్తూ కృష్ణాబోర్డు తెలంగాణను కట్టడి చేసేందుకు తాజాగా చర్యలు చేపట్టింది. మరోవైపు ఈ వ్యవహారంలో కృష్ణాబోర్డు తీరు పట్ల తెలంగాణ రాష్ట్రం తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. త్వరలో రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా కృష్ణాబోర్డుకు తమ నిరసనను తెలుపుతూ లేఖ రాయనున్నట్టు తెలిసింది. కృష్ణా ట్రిబ్యునల్–1 అవార్డు ప్రకారం శ్రీశైలం, సాగర్ నుంచి తాగునీటి అవసరాల కోసం వాడుకున్న జలాల్లో 20శాతాన్ని మాత్రమే లెక్కించాల్సి ఉండగా, 100 శాతం జలాలను కృష్ణాబోర్డు లెక్కించడాన్ని చాలాకాలంగా తెలంగాణ తప్పుబట్టుతోంది. ఈ వాదనలను ఇప్పటికే కృష్ణాబోర్డు తిరస్కరించింది. 2022–23లో తమ రాష్ట్రానికి కేటాయించిన జలాల్లో 18.701 టీఎంసీలను వాడుకోకుండా నాగార్జునసాగర్‌లో నిల్వ చేసుకున్నామని, ఆ నీళ్లను ప్రస్తుత నీటి సంవత్సరం 2023–24లో సైతం తమ రాష్ట్రానికి పునః కేటాయింపులు(క్యారీ ఓవర్) జరపాలని తెలంగాణ చేసిన మరో డిమాండ్‌ను సైతం కృష్ణాబోర్డు తిరస్కరించింది. ఈ రెండు డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని రెండు రాష్ట్రాల నీటి వినియోగం లెక్కలను పునఃసమీక్షిస్తే తెలంగాణకు రావాల్సిన నీళ్లు ఇంకా మిగిలి ఉంటాయని, ఏపీ కేటాయింపులకు మించి వాడుకున్నట్టు తేలుతుందని తెలంగాణ వాదిస్తోంది. ప్రస్తుత పరిస్థితిలో కనీసం 18.7 టీఎంసీల జలాలు ఇంకా తమకు రావాల్సి ఉందని తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు లెక్క తేల్చినట్టు సమాచారం. 2022–23లో సైతం ఏపీ కేటాయింపులకు మించి 51.745 టీఎంసీలను వాడుకుందని తెలంగాణ ఆరోపిస్తోంది.

నేటి త్రిసభ్య కమిటీ భేటీకి రాలేం

ఏపీ విజ్ఞప్తి మేరకు గురువారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణాబోర్డు.. త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించతలపెట్టగా, ఈ సమావేశానికి రాలేమని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు తెలియజేశాయి. సమావేశాన్ని వాయిదా వేయాలని కోరినట్టు తెలిసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిపోయిన నేపథ్యంలో రానున్న కాలంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని కృష్ణాబోర్డు భావిస్తోంది. త్రిసభ్య కమిటీ కన్వీనర్‌గా కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పూరే, సభ్యులుగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటిపారుదల శాఖల ఈఎన్‌సీలు ఉంటారు.

ఆ 8 టీఎంసీలు తెలంగాణకు కావాలి

నాగార్జునసాగర్‌లో నీటిమట్టం 512.5 అడుగులకు పడిపోగా నిల్వలు 136.95 టీఎంసీలకు తగ్గిపోయాయి. నాగార్జునసాగర్ కనీస నిల్వమట్టం(డెడ్ స్టోరేజీ) 505 అడుగులు కాగా, బుధవారం నాటికి జలాశయంలో కనీస నిల్వమట్టానికి ఎగువన వాడుకోవడానికి వీలుగా 13.617 టీఎంసీలు మాత్రమే లభ్యతగా ఉన్నాయి. ఏపీ చేసిన విజ్ఞప్తి మేరకు ఆ రాష్ట్ర తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి కుడి ప్రధాన కాల్వకు ఈ నెల 8 నుంచి 5 టీఎంసీల జలాలను విడుదల చేసినా, మిగిలిన 8.61 టీఎంసీలను హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు కేటాయించడానికి వీలుంటుందని తెలంగాణ నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

కేంద్రం దృష్టికి కృష్ణా జలాల పంచాయితీ

శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో మిగిలి ఉన్న కొద్దిపాటి నిల్వల వినియోగం విషయంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య తలెత్తిన వివాదాన్ని కేంద్ర జలశక్తి శాఖ దృష్టికి తీసుకెళ్లాలని తాజాగా కృష్ణాబోర్డు నిర్ణయించింది. ఈ విషయంలో తదుపరి కార్యాచరణను సూచించాలని విజ్ఞప్తి చేస్తూ జలశక్తి శాఖకు కృష్ణాబోర్డు లేఖ రాయనున్నట్టు తెలిసింది.

సంజయ్ అరెస్టు వద్దు: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎంపీ బండి సంజయ్‌ను అరెస్టు చేయవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను జూన్ 11కు వాయిదా వేస్తూ, ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని అధికారులకు స్పష్టం చేసింది. సంజయ్ సహా ఇతర పిటిషనర్లకు 41ఏ నోటీసులు జారీ చేసిన తర్వాత విచారణ చేపట్టాలని చెప్పింది. 'చెంగిచర్ల' ఘటనలో తనపై తప్పుడు కేసు పెట్టారని.. ఉప్పల్, మేడిపల్లిలో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో సంజయ్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు మరో ఐదుగురు క్వాష్ పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. వాదనల అనంతరం న్యాయమూర్తి.. సంజయ్, ఇతర పిటిషనర్లను అరెస్టు చేయవద్దని ఆదేశించారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ చెంగిచర్లలో హోలీ వేడుకల సందర్భంగా రోహింగ్యాలకు, ఎస్టీలకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బాధితులను పరామర్శించేందుకు బండి సంజయ్ అక్కడికి వెళ్లారు. అయితే ఆయనను పోలీసులు అడ్డుకోవడంతో వారికి, బీజేపీ కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఉప్పల్, మేడిపల్లి పోలీస్ స్టేషన్లలో బండితో పాటు మరికొందరిపై ప్రజా ఆస్తుల నష్ట నివారణ చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇందిరమ్మ స్థానం.. మన ఖాతాలోకే రావాలి

▶ మొదటి పేజీ తరువాయి

అయిపోయిందని, బీజేపీని కూడా ప్రజలు ఆదరించే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రచారాస్త్రాలుగా చేసుకుని ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని కోరారు. మెదక్ పార్లమెంటుపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పని చేయాలనీ, నేతలు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకోవడం ద్వారా పార్టీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

బుద్వేల్ భూమి కోసం భారీ లాబీయింగ్

దాని ఫలితంగానే రాజేంద్రనగర్ ఎమ్మార్వోకు సాధారణ మెమో

- దీన్ని ఆధారంగా చేసుకుని శివానందరెడ్డి అసైన్డ్ భూములు కొన్నారు
- హైదరాబాద్ సీసీఎస్ డీసీపీ శ్వేత వెల్లడి



శివానందరెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగర శివార్లలోని బుద్వేల్‌లో ఉన్న 26 ఎకరాల భూమిని కాజేయడానికి వెస్సెల్లా గ్రూప్ సీఈఓ, మాజీ పోలీసు అధికారి మాండ్ర శివానంద రెడ్డి లాబీయింగ్ చేసినట్లు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) డీసీపీ ఎన్.శ్వేత బుధవారం తెలిపారు. దాని ఫలితంగానే అప్పట్లో ఎమ్మార్వోకు సాధారణ మెమో జారీ అయిందని, దీని ద్వారానే ఆ భూముల కన్వర్షన్ జరిగిందని వివరించారు. తన అనుచరులతో కలిసి శివానందరెడ్డి చేసిన కుట్ర, అసైన్డ్ భూములు ఖరీదు చేయడం వంటి ఆరోపణలపై సీసీఎస్‌లో మొత్తం నాలుగు కేసులు నమోదయ్యాయని చెప్పారు. వీటిపై విచారించేందుకు సోమవారం అల్లూరు వెళ్లగా... శివానందరెడ్డి పారిపోయారని డీసీపీ వివరించారు. ఈ కేసులు, వాటి పూర్వాపరాలపై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.

రియల్టర్ల కన్ను..అసైనీలకు దగా

ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 1994లో బుద్వేల్‌లోని సర్వే నం.282 నుంచి 299 వరకు ఉన్న 281 ఎకరాల భూములను 66 మందికి అసైన్ చేసింది. వీరికి రాజేంద్రనగర్ మండల అధికారులు అసైనీ పాస్ పుస్తకాలను సైతం జారీ చేశారు. ఆ తర్వాత మరో 82 మంది అక్కడ మిగిలి ఉన్న భూమిని ఆక్రమించారు. 2000లో అసైనీలు తమ భూములను ఎస్‌కే డెవలపర్స్ సంస్థకు లీజుకు ఇచ్చారు. ఇది నిబంధనలకు విరుద్ధం కావడంతో రెవెన్యూ అధికారులు అసైన్‌మెంట్ పట్టాలు రద్దు చేశారు. చేవెళ్ల ఆర్డీఓ ఆ భూమిని నిబంధనల ప్రకారం హెచ్‌ఎండీఏ, పర్యాటక శాఖలకు అప్పగించారు. దీన్ని సవాల్ చేస్తూ అసైనీలు గుంటి నర్సింహులు తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపి కేసు పరిష్కరించాలంటూ చేవెళ్ల ఆర్డీఓను కోర్టు ఆదేశించింది. దీంతో అసైనీలు ఆర్డీఓకు వివరణ ఇచ్చినా.. దాన్ని ఆయన తిరస్కరించారు. ఆర్డీఓ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ 2002లో అసైనీలు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా.. అదే భూమిని అభివృద్ధి చేసి, తమకు ప్లాట్లు ఇవ్వాలంటూ అసైనీలు ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపై సర్కారు ఎలాంటి నిర్ణయం తీసుకోక ముందే దీన్ని క్యాష్ చేసుకోవడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు టీజే ప్రకాష్, కోనేరు గాంధీ, దశరథ రామారావు రంగంలోకి దిగారు. అసైనీలతో పాటు ఇతరులను సంప్రదించారు. అసైనీలకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చేలా తాము ప్రభుత్వ అధికారులతో పాటు రాజకీయ నాయకులను మ్యానేజ్ చేస్తామని నమ్మబలికారు. ఇది నమ్మిన అసైనీలు వీరితో అగ్రిమెంట్లు, ఎంఓయూలు చేసుకున్నారు. వాటిని చూపించిన ఈ ముగ్గురూ ఆ స్థలం అమ్ముతామంటూ కొందరి నుంచి డబ్బు వసూలు చేసి మోసం చేశారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు సీసీఎస్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి. ప్రకాష్, గాంధీ, రామారావు 2021లో రియల్ ఎస్టేట్ బ్రోకర్ దయానంద్‌ను సంప్రదించి అసైనీలు ప్లాట్లు పొందేలా సహకరించాలని కోరారు. ఇతడి ద్వారానే టీజే ప్రకాష్ మాజీ పోలీసు అధికారి, వెస్సెల్లా గ్రూపు సీఈఓ మాండ్ర శివానందరెడ్డిని సంప్రదించారు.

కన్వర్షన్ కోసం ముమ్మర యత్నం

అసైన్డ్ ల్యాండ్ కన్వర్షన్ కోసం శివానందరెడ్డి తదితరులు 2022–23 మధ్య కాలంలో లాబీయింగ్ చేశారు. దీని ఫలితంగా అసైనీలు, ఆక్రమణదారులకు కన్వేయన్స్ డీడ్స్ ద్వారా అభివృద్ధి చేసిన ప్లాట్లు కేటాయించాలంటూ రాజేంద్రనగర్ ఎమ్మార్వోకు ఓ సాధారణ మెమో జారీ అయింది. దీంతో గతేడాది ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య కన్వేయన్స్ డీడ్స్ జరిగాయి. వీటి ఆధారంగా అసైనీలు, ఆక్రమణదారులు ఆ భూమిని ఏ అండ్ యూ ఇన్‌ఫ్రా పార్క్, వెస్సెల్లా గ్రీన్ కంపెనీలకు చెందిన శివానంద రెడ్డి, ఆయన భార్య ఉమాదేవి, కుమారుడు కినిష్కలతో పాటు ప్రశాంత్‌రెడ్డిలకు రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా శివానందరెడ్డి తదితరులు అసైనీలను భయపెట్టి, ప్రభుత్వ ఉత్తర్వులు, మంత్రివర్గం ఆమోదం లేకుండా అసైన్డ్ భూములు లాక్కోవడానికి కుట్ర పన్నారు.

రియల్టర్లకు శివానందరెడ్డి ఎర

బుద్వేల్ భూమి పూర్వాపరాలు తెలిసిన ఆయన తన పలుకుబడి వినియోగించి సమస్య పరిష్కరిస్తానని చెప్పారు. ఆ 26 ఎకరాల భూమి తానే తీసుకుంటానని, చదరపు గజానికి రూ.12 వేల చొప్పున ఇస్తానని ఎర వేశాడు. 2021–22 మధ్య కాలంలో అసైనీలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు చెక్కుల రూపంలో చెల్లించారు.

కట్నం డబ్బు సమకూరక..

పెళ్లి పీటలెక్కాల్సిన యువతి ఆత్మహత్య



శైలజ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పెళ్లి పీటలెక్కాల్సిన యువతి.. సకాలంలో వరకట్నం డబ్బులు సమకూరలేదన్న బాధతో ఆత్మహత్యకు పాల్పడింది. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనమిది. తంగళ్లపల్లికి చెందిన అత్తారి లక్ష్మి–గిరి దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు శైలజ(19) సంతానం. ఏడేళ్ల క్రితమే భర్త గిరి అనారోగ్యంతో మృతి చెందాడు. ఇటీవల కూతురు శైలజకు కొడిమ్యాల మండలం దమ్మాయిపేటకు చెందిన యువకుడితో పెళ్లి సంబంధం కుదిరింది. రూ.4 లక్షలు వరకట్నం ఇచ్చేందుకు అంగీకరించారు. అనుకున్న సమయానికి డబ్బు చేతికి అందకపోవడంతో తల్లి పడుతున్న కష్టాలను చూడలేక శైలజ మనోవేదనకు గురైంది. ఈక్రమంలోనే బుధవారం ఉదయం ఇంట్లో చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి లక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెల్లారితే పెళ్లి.. అంతలోనే మరణం

పెళ్లిపీటలెక్కే వేళ నవవరుడు మృత్యు ఒడిలోకి..



నవీన్ యాదవ్ (ఫైల్)

రామన్నపేట: కాసేపట్లో పెళ్లి జరగాల్సిన ఇంట... నవ వరుడి ఆకస్మిక మరణంతో విషాదం చోటు చేసుకుంది. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. కక్కిరేణి గ్రామానికి చెందిన కన్నెబోయిన యాదయ్య, అంజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు నవీన్ యాదవ్ (24) అలియాస్ గురుకి ఇటీవలే బంధువుల అమ్మాయితో వివాహం ఖాయం కాగా.. గురువారం పెళ్లి జరగాల్సి ఉంది. కుటుంబ సభ్యులు, బంధువులు పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యారు. బుధవారం ఉదయం ఎప్పట్లాగే నవీన్ తమ వ్యవసాయబావి వద్ద కోళ్లఫారంలో కోళ్లకు దాణా పెట్టేందుకు వెళ్లాడు. పెండ్లి కొడుకును చేసే సమయం అవుతున్నా నవీన్‌యాదవ్ ఇంటికి రాకపోవడంతో అతడి సోదరుడు కోళ్లఫారం వద్దకు వెళ్లాడు. అక్కడ నవీన్‌యాదవ్ విగతజీవిగా పడి ఉన్నాడు. నవీన్ మృతికి కారణాలు తెలియరాలేదు. అతని అంత్యక్రియలు బుధవారం సాయంత్రం పూర్తి చేశారు.

నీళ్లట్యాంకులో పడి 30కి పైగా కోతుల మృతి

అదే నీటి సరఫరాతో ఆందోళన



మున్సిపాలిటీ ట్రాక్టర్‌లో వేసిన కోతుల కళేబరాలు

నాగార్జునసాగర్: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ (నందికొండ మున్సిపాలిటీ)లోని హిల్‌కాలనీలో ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే ట్యాంకులో 30కి పైగా పడి కోతులు మృతి చెందాయి. ఈ విషయం బుధవారం వెలుగు చూసింది. కోతులు మూడు రోజుల క్రితమే మృతి చెందినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ నీటినే మంగళవారం వరకు సరఫరా చేయడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ట్యాంకు నుంచి 1వ వార్డులో విజయవిహార్ పక్క ఇళ్లకు నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకు పైన ఏర్పాటు చేసిన రేకులు గాలికి లేచిపోవడంతో.. కోతులు తాగునీటి కోసం వెళ్లి అందులో పడి మృతి చెందినట్లు తెలుస్తోంది. ట్యాంకులోని కళేబరాలను మున్సిపాలిటీ సిబ్బంది బయటకు తీస్తున్న సమయంలో అక్కడికి వచ్చిన కోతులు వారి వెంటపడ్డాయి. దీంతో మున్సిపల్ సిబ్బంది వాటిని దూరంగా తరిమి ట్యాంకులోని కళేబరాలను బయటకు తీశారు.

కేజీబీవీలో ఫుడ్ పాయిజన్!

20 మంది విద్యార్థినులకు అస్వస్థత.. నిర్మల్ జిల్లాలో ఘటన



నిర్మల్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

నర్సాపూర్(జి): నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం ఆహారం విషతుల్యమై 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఏడుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని నిర్మల్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మిగతా 13 మంది విద్యార్థినులకు స్థానికంగానే ఆర్బీఎస్కే వైద్య సిబ్బంది చికిత్స అందించారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత విద్యార్థినులు ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో ఫుడ్ పాయిజన్ అయిందని భావించి వెంటనే ఆస్పత్రులకు తీసుకెళ్లారు. డీఈవో రవీందర్‌రెడ్డి, కేజీబీవీల సెక్టోరియల్ అధికారి శ్రీదేవి విద్యార్థులను పరామర్శించారు. ఫుడ్ పాయిజన్ ఎందుకైందనేది ఇంకా తేలలేదు.

ఏనుగు దాడిలో రైతు మృతి

- ప్రాణహిత నది దాటి కొమురంభీం జిల్లాలోకి ప్రవేశించి...
- చింతలమానెపల్లి మండలం బూరెపల్లిలో ఘటన



పంట భూముల వద్ద ఏనుగు. ఇన్‌సెట్‌లో రైతు శంకర్ (ఫైల్)

చింతలమానెపల్లి (సిర్పూర్): ఏనుగు దాడిలో ఓ రైతు మృత్యువాత పడ్డాడు. మహారాష్ట్రలోని అటవీప్రాంతం నుంచి బుధవారం తెల్లవారుజామున ప్రాణహిత నది దాటి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం బూరెపల్లి సమీపంలోని వ్యవసాయ భూముల్లోకి చొరబడింది. అక్కడే ఉన్న ఓ రైతుపై దాడి చేయగా, తీవ్రంగా గాయపడిన రైతు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం బూరెపల్లిసమీపంలోని ప్రాణహిత నదిలో ఏనుగును గ్రామస్తులు కొంతమంది గమనించారు. ప్రాణహిత నది నుంచి బూరెపల్లి వ్యవసాయ భూముల వైపు వెళ్లింది. ఆ సమయంలోనే గ్రామ శివారులోని మిరపతోటలో అల్లూరి శంకర్(55) భార్య సుగుణబాయి, మరికొందరితో కలిసి పనులు చేసుకుంటున్నాడు. ఏనుగు రాకను గమనించిన సుగుణబాయి భర్తతోపాటు కూలీలను అప్రమత్తం చేస్తూ పరుగెత్తింది. తోట నుంచి వెళ్లలేకపోయిన శంకర్ అక్కడే ఓ చోట దాక్కున్నాడు. నేరుగా అక్కడికే వచ్చిన ఏనుగు శంకర్‌ను తొండంతో పైకి లేపి విసిరింది. ఎగిరి కింద పడిన అతడిని మళ్లీ కాలితో తొక్కడంతో గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఏనుగు అక్కడి నుంచి బాబాపూర్ వైపు వెళ్లడంతో కుటుంబసభ్యులు శంకర్ మృతదేహం వద్దకు వెళ్లారు. శంకర్‌కు నలుగురు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.10వేలు అందించారు.

చిక్కని ఏనుగు: కౌటాల సీఐ సాదిక్ పాషా, ఖర్జెల్లి రేంజ్ అధికారి చంద్రమౌళి ఆధ్వర్యంలో బృందాలు ఏనుగును అనుసరించాయి. గంగాపూర్ నుంచి ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కాలువల మీదుగా ఖర్జెల్లి వైపు వెళ్లినట్లు గుర్తించారు. ఖర్జెల్లి గ్రామస్తులు ఏనుగు గ్రామం వైపు రాకుండా మంటలు పెట్టారు. రాత్రి కావడంతో ఏనుగు వెళుతున్న మార్గాల్లోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. రాకపోకలు నిలిపివేశారు. రాత్రి పది గంటల వరకు రుద్రాపూర్ సమీపంలో ఏనుగు ఉన్నట్లు గుర్తించారు.


రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా : మంత్రి కొండా సురేఖ

ఏనుగు దాడిలో అల్లూరి శంకర్ మృతి చెందడం పట్ల మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ మొత్తాన్ని వెంటనే అందజేస్తామన్నారు.

క్లుప్తంగా...

కేసీఆర్ పొలాలను సందర్శించడం విడ్డూరం

టీపీసీసీ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: గతంలో రైతులను పట్టించుకోని మాజీ సీఎం కేసీఆర్ ఇప్పుడు పంట పొలాలను సందర్శించడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హరీశ్‌రావు, కేటీ ఆర్ ఎన్ని చేసినా కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. ఇవన్నీ పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకేనని, తెలంగాణలో కేసీఆర్ లాంటి ప్రతిపక్షనాయకుడు ఉండటం దురదృష్టకరమని మండిపడ్డారు.

దమ్ముంటే నాకు నోటీసులివ్వు

ఫోన్ ట్యాపింగ్ కేసులో తమ పార్టీకి చెందిన పలువురు నేతలకు బీఆర్ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ నోటీసులివ్వడంపై కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు దమ్ముంటే తనకు నోటీసులివ్వాలని, తాను సరైన సమాధానం పంపిస్తానన్నారు.

బీజేపీ మెప్పు పొందడానికే మందకృష్ణ విమర్శలు

టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ ప్రీతం



సాక్షి, హైదరాబాద్: మతతత్వ బీజేపీ పార్టీ మెప్పు పొందడానికే సీఎం రేవంత్‌రెడ్డిపై మంద కృష్ణ మాదిగ విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ ప్రీతం ధ్వజమెత్తారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం చేయలేదని, మంద కృష్ణ మాదిగ కుట్రలను తిప్పికొట్టే విధంగా మాదిగ శ్రేణులు అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ప్రెస్ మీట్‌లు పెట్టాలని సూచించారు. ఆయన మాటలను మాదిగలు నమ్మరని, ఎస్సీల రిజర్వేషన్ జరగాలంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ప్రీతం స్పష్టం చేశారు.

బీజేవైఎం రాష్ట్ర కమిటీ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మహేశ్‌నమానీ, రాజశేఖర్‌శర్మ, జెట్టి కుమార్ యాదవ్, చిత్తరంజన్ రెడ్డి, ఎస్.సంతోష్‌కుమార్, తరుణ్‌రెడ్డి, లడ్డూ యాదవ్, కె.సింధురెడ్డి నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా ఎస్.పవన్‌రెడ్డి, కె.గణేశ్, బి.సురేశ్‌గౌడ్, కోశాధికారిగా యోగరాజ్, సహ కోశాధికారిగా పాడు నీలకంఠలను నియమించినట్లు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీలో 8 మంది కార్యదర్శులు, ముగ్గురిని నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్లుగా, ఇద్దరు జాయింట్ సెక్రటరీలు, ఇంకా స్టేట్ ఉమెన్స్ సెల్, పీఆర్‌వో సెల్, తదితర సెల్‌లకు బాధ్యులను నియమించినట్లు వెల్లడించారు.

మందకృష్ణ ఆరోపణలు అర్థరహితం

మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ



సాక్షి, హైదరాబాద్: దళితులందరూ కాంగ్రెస్ వెంటే ఉన్నారని, కాంగ్రెస్‌పై మందకృష్ణ మాదిగ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ స్వప్రయోజనాల కోసం మందకృష్ణ మాదిగ పార్టీలు మారుతున్నాడన్నారు. బీజేపీ మతతత్వ పార్టీ అని తెలిసినా కూడా మద్దతు ఇస్తున్నాడని, ఆ పార్టీలో దళితులు, ముస్లింలు లేరని స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో బిల్లు పెట్టని బీజేపీ ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

సీబీఐ విచారణతోనే వాస్తవాలు బయటపడతాయి: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపిస్తేనే న్యాయం జరుగుతుందని, అందువల్ల సీఎం రేవంత్‌రెడ్డి ఈ కేసును సీబీఐకు అప్పగించాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ట్యాపింగ్ కేసులో సూత్రధారులు, అసలు దోషులు వెలుగులోకి వచ్చేలా రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం ఆయన మీడియాతో మట్లాడుతూ.. ఈ విషయంపై త్వరలోనే బీజేపీ తరఫున రాష్ట్ర గవర్నర్‌ను కలిసి కేంద్ర ప్రభుత్వం ద్వారా పూర్తి దర్యాప్తు జరిపించాలని కోరతామని చెప్పారు.

జై శ్రీరామ్‌ను వివాదాస్పదం చేయొద్దు : వీహెచ్‌పీ

సాక్షి, హైదరాబాద్: రాజకీయ నేతలు జై శ్రీరామ్ నినాదాన్ని వివాదంగా మార్చడం మానుకోవాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) హితవు పలికింది. ఇటీవల ఒక సమావేశంలో 'జై శ్రీరామ్ నినాదం కూడు పెట్టదు.. ఉద్యోగం ఇవ్వదు..'అని కేటీఆర్ వ్యాఖ్యానించడం హిందువుల మనోభావాలను దెబ్బ తీయటమేనని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ముఖ్యమంత్రి గుంపు మేస్త్రీ.. ప్రధానమంత్రి తాపీ మేస్త్రీ..

రేవంత్, మోదీ ఒకరికొకరు సహకరించుకుంటున్నారు

- అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌కు మోదీ.. ఇప్పుడు మోదీకి రేవంత్ సహకరిస్తున్నడు
- తెలంగాణకు ఏం చేశారని బీజేపీకి ఓటెయ్యాలి
- రాముడికి మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం: బీఆర్ఎస్ శ్రేణుల సమావేశంలో కేటీఆర్

వికారాబాద్: ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి ఇద్దరూ తెలంగాణకు సమాధి కట్టేందుకు కలిసి పనిచేస్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. ''అసెంబ్లీ ఎన్నికల సమయంలో మోదీ రేవంత్‌కు సహకారం అందించిండు.. .ఇప్పుడు రేవంత్ మోదీకి సహకరిస్తున్నడు''అని ఆరోపించారు. బుధవారం వికారాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఓ గుంపు మేస్త్రీ.. ప్రధాన మంత్రి ఓ తాపీ మేస్త్రీ అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ''ప్రధానిగా మోదీ పదేళ్ల పాలన వెలగబెట్టిండు.. పేదలకే కాదు దేశానికి కూడా చేసిందేమీ లేదు.. అందుకే ఇప్పుడు ఎన్నికలు రాగానే రాముని పేరుతో ఓట్లడుగుతుండు. రాముడు మన క్కూడా దేవుడే.. రాముడికి మనం కూడా మొక్కుదాం.. కానీ బీజేపీని పండబెట్టి తొక్కుదాం''అని పిలుపునిచ్చారు. పెట్రోల్, డీజిల్‌తో సహా అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెంచేసిన మోదీకి ఎందుకు ఓటువేయాలని ప్రశ్నించారు. మోదీ మన ప్రియమైన ప్రధాని కాదు.. ఆయన ఓ పిరమైన ప్రధాని అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ఏం చేశారని బీజేపీకి ఓట్లేయాలి.. పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇచ్చారని ఓట్లేయాలా...? రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా...? రూ. 15 లక్షలు పేదల అకౌంట్లో వేశారా..? అని నిలదీశారు. బీజేపీ నాయకులు చెబుతున్నట్లు మోదీ హవా ఉంటే పక్క పార్టీల నుంచి ఎందుకు క్యాండెట్లను తెచ్చుకుంటున్నారని కేటీఆర్ ప్రశ్నించారు.

పదేళ్ల నిజానికి, అబద్ధాలకు పోటీ ఇది

కాంగ్రెస్ పార్టీ ఓ దిక్కుమాలిన పార్టీ.. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చింద్రు.. పదేళ్ల నిజానికి వందేళ్ల అబద్ధాలకు మధ్య జరుగుతున్న పోటీ ఇది అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను మోసం చేసి వెళ్లిపోయిన వారికి గుణపాఠం చెప్పాలని కోరారు. ''బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల లిస్టు చూడండి అందరూ మన పార్టీ నుండి పోయిన వారేనని''అన్నారు. ''సీఎం రేవంత్‌రెడ్డి సిగ్గులేకుండా పరిపాలన నాచేతిలో లేదు.. ఎన్నికల కమీషన్ చేతిలో ఉంది అంటున్నాడు. రేవంత్ ఇంకా ప్రతిపక్ష నాయకుడిలానే మాట్లాడుతున్నడు.. ఓడిపోతామని తెలిసే మల్కాజ్‌గిరి, చేవెళ్లలో డమ్మి అభ్యర్థులను పెట్టిండు.. కత్తెర జెబులో పెట్టుకుని తిరిగేందుకు రేవంత్ ఏమైనా బోటి కొట్టెటోడా..?''అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి ఇద్దరూ విశ్వాస ఘాతకులే అని కేటీఆర్ విమర్శించారు. కష్ట కాలంలో పోటీకి సిద్ధమైన బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కార్యకర్తలను కోరారు.



తెలంగాణ భవన్‌లో ఇఫ్తార్ విందు

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ భవన్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పాల్గొన్నారు. పార్టీ నేతలు మహమూద్ అలీ, ఫారుక్ హుస్సేన్‌లకు కేటీఆర్ ఖర్జూరం తినిపించి ఇఫ్తార్ విందును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేత పద్మారావుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, హైదరాబాద్

నా వ్యక్తిత్వ హననానికి రేవంత్ యత్నం..

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడారు.

2004 నుంచే విచారణ జరిపించాలి

'2011లో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు, అప్పుడు ఎంపీలుగా ఉన్న రాజగోపాల్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు తమ ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నాడని ఆరోపించారు. అందువల్ల విచారణ పరిధి పెంచి 2014 నుంచే కాదు 2004 నుంచి ట్యాపింగ్ అంశంపై విచారణ జరిపించాలి. పోలీసు అధికారులు మహేందర్‌రెడ్డి, శివధర్‌రెడ్డి, రవిగుప్తా తదితరులు 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ కీలక పోస్టుల్లో పనిచేశారు. కేసీఆర్ మాత్రమే బాధ్యులు అని లీకులు ఇస్తున్నవారు ఆ అధికారులను ఎందుకు విచారణకు పిలవడం లేదు. గతంలో నా ఫోన్ మీదా నిఘా ఉన్నట్లు ఆపిల్ సంస్థ నుంచి మెసేజ్ వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ అంటూ యూట్యూబ్‌లు, పనికి మాలిన చానళ్లకు రిమాండు రిపోర్టు పేరిట లీకులు ఇస్తున్నారు..'అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం

'రుణమాఫీపై వెకిలిగా నవ్వుతున్న రేవంత్‌రెడ్డి మొగోడు అయితే రైతులకు ఊరటనివ్వాలి. కాళేశ్వరం, గొర్రెలు..బర్రెల స్కీంలో అవినీతి, ఫోన్ ట్యాపింగ్ అంటూ రోజుకో అంశం తెరమీదకు తెస్తూ ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నాడు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై స్పీకర్ చర్యలు తీసుకోని పక్షంలో ఇద్దరి పదవులు ఊడగొట్టేందుకు హైకోర్టు, సుప్రీంకోర్టు దాకా వెళ్లి న్యాయ పోరాటం చేస్తాం. రాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడిన 218 మంది రైతుల వివరాలను వెంటనే సీఎం రేవంత్‌రెడ్డికి పంపిస్తాం. గతంలో ప్రకటించినట్టుగా ఒక్కో రైతు కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

నీటి నిర్వహణ చేత కావడం లేదు

'రాష్ట్రంలో సాగు, తాగునీటి సమస్య తీవ్రస్థాయికి చేరుకోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో ధర్నాలు చేస్తున్నారు. ఢిల్లీకి ధన వనరులు తరలిస్తున్న రేవంత్‌రెడ్డికి జలరాశులు తరలింపునకు ఓపిక లేదు. బీఆర్ఎస్ పాలనలో రూ.38 వేల కోట్లతో మిషన్ భగీరథ పూర్తి చేయడంతో పాటు హైదరాబాద్ నగరానికి వచ్చే 50 ఏళ్ల పాటు తాగునీటి కొరత రాకుండా చేశాం. రాష్ట్రంలో 14 శాతం అధిక వర్షపాతం నమోదైనా నీటి నిర్వహణ చేత కావడం లేదు. హైదరాబాద్‌కు తాగునీటిని అందించే నాగార్జునసాగర్, హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, ఎల్లంపల్లిలో నీళ్లు ఉన్నా ప్రజలు ట్యాంకర్లు బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. తాగునీటి కోసం ఢిల్లీని దేబిరించాల్సిన పరిస్థితిని రేవంత్ ప్రభుత్వం కల్పించింది.

బోనస్ ఇవ్వాల్సి వస్తుందని..

కాళేశ్వరం నీళ్లను దాచి పెట్టడంతో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. మేడిగడ్డకు మరమ్మతులు చేసి ఉంటే సాగు, తాగునీటి కష్టాలు ఉండేవి కావు. పంటలు పండితే బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే కుట్రతోనే పంటలను ప్రభుత్వం ఎండబెట్టింది. కాంగ్రెస్‌కు హైదరాబాద్ నగర ఓటర్లు ఓటు వేయలేదనే కక్షతోనే నీటి సరఫరా చేయడం లేదు. తాగునీటి సమస్యపై అవసరమైతే జలమండలి ఎదుట ధర్నా చేస్తాం. ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌పై కాకుండా వాటర్ ట్యాపింగ్‌పై దృష్టి పెట్టాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మాగంటి గోపీనాథ్, కేపీ వివేకానంద, పార్టీ నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండా సురేఖకు కేటీఆర్ లీగల్ నోటీసులు

- యెన్నం, కేకే మహేందర్‌రెడ్డికి కూడా..

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనకు సంబంధం లేకున్నా తన పేరును పదే పదే కుట్రపూరితంగా ప్రస్తావిస్తున్నారంటూ మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు, మీడియా సంస్థలు, యూట్యూబ్ చానళ్లకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు లీగల్ నోటీసులు పంపారు. వారం రోజుల్లో తనకు క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా వేస్తామని బుధవారం నాటి నోటీసుల్లో స్పష్టం చేశారు. తన ప్రతిష్టకు భంగం కలిగించేలా మాట్లాడుతున్న వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని, తనకు సంబంధం లేని అంశంలో తన పేరును, తమ పార్టీ పేరును ప్రస్తావిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో సీఎం అయినా వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు. సురేఖతో పాటు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి తదితరులు వారంలోపు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఒక్కరోజులోనే కేటీఆర్‌లో ఎంత మార్పు!

'ఎక్స్'వేదికగా ఎంపీ బండి సంజయ్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: 'ఒక్క రాత్రిలోనే ఎంత మార్పు! జైశ్రీరాం నినాదం మీకు ఆహారం కానీ ఉద్యోగం కానీ ఇవ్వదు అనడం నుంచి అందరం రాముడిని ప్రార్థిద్దాం అంటూ మారింది'అని కేటీఆర్‌ను ఉద్దేశించి 'ఎక్స్'లో బీజేపీ జాతీయ కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. శ్రీరామచంద్రుడు, రామభక్తుల పవర్ అంటే ఇది అని ట్వీట్ చేశారు. శ్రీభక్తరామదాసును ఖైదు చేసిన తానీషాకు కలలో శ్రీరాముడు కనిపించి రామముద్రలు దొరికినట్లుగా.. కేసీఆర్ కుమారుడికి రాత్రికి రాత్రి జ్ఞానోదయమైనట్లు ఉందని సంజయ్ పేర్కొన్నారు. రాముడికి మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం అంటూ కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునివ్వడంపై సంజయ్ పైవిధంగా స్పందించారు.

నిందితుల చేతిలో 'పోలీసుల' భవిత!

- అక్రమ ట్యాపింగ్ కేసులో విచిత్ర పరిస్థితి
- ఇప్పటిదాకా చెప్పింది ప్రభాకర్‌రావు పేరే
- భవిష్యత్తులో ఉన్నతాధికారులకూ వ్యవహారం తెలుసంటే విచారణ తప్పని వైనం
- ప్రధాన ఇంటెలిజెన్స్‌లో భాగంగానే ఎస్ఐబీ
- 'వసూళ్ల విభాగాలు' కమిషనర్ల అధీనంలోనే..



సాక్షి, హైదరాబాద్: సాధారణంగా క్రిమినల్ కేసుల దర్యాప్తులో నిందితుల భవిష్యత్తు పోలీసుల చేతుల్లో ఉంటుంది. ఎవరెవరిని నిందితులుగా చేర్చాలి? వారిపై ఏఏ సెక్షన్ల కింద అభియోగాలు మోపాలి? అనేది కేసుల దర్యాప్తు ఆధారంగా వీళ్లే నిర్ణయిస్తారు. అయితే స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) లోని స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) కేంద్రంగా జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కొందరు పోలీసు ఉన్నతాధికారుల భవిత ఈ కేసులో నిందితులుగా ఉన్న పోలీసుల చేతిలో ఉండటం ఆసక్తి కలిగిస్తోంది. వీళ్లు చెప్పే అంశాలపై డీజీపీ, అదనపు డీజీ స్థాయి అధికారులకు నోటీసులు ఇవ్వాలా? వద్దా? అనేది ఆధారపడి ఉందని అంటున్నారు. ఇలావుండగా ట్యాపింగ్ కేసులో అరెస్టు అయిన హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావును ఈ నెల 10 వరకు పోలీసు కస్టడీకి ఇస్తూ నాంపల్లి కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు పోలీసు కస్టడీ పూర్తయి, జ్యుడీషియల్ రిమాండ్‌కు వెళ్లిన అదనపు ఎస్పీ నాయిని భుజంగరావును అదనపు కస్టడీకి కోరుతూ పంజగుట్ట పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.

ప్రభాకర్‌రావు దగ్గరే ఆగిన కేసు

ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన అంశాలు, నిందితులుగా ఉన్న పోలీసు అధికారుల వాంగ్మూలాలను బట్టి ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మొత్తం ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు నేతృత్వంలో సాగింది. దర్యాప్తు అధికారులు కూడా ప్రస్తుతానికి ఇంతవరకే పరిమితం అవుతున్నారు. అయితే ఎస్ఐబీకి ఓఎస్డీ హోదాలో ప్రభాకర్‌రావే నేతృత్వం వహించినప్పటికీ.. ఈ విభాగం కూడా ప్రధాన ఇంటెలిజెన్స్‌లో అంతర్భాగమే. దీనికి అదనపు డీజీపీ లేదా ఐజీ స్థాయి అధికారులు బాస్‌లుగా ఉంటారు. విదేశాలనుంచి ఎలాంటి నిఘా ఉపకరణాలు ఖరీదు చేయాలన్నా కచ్చితంగా నిఘా విభాగాధిపతితో పాటు డీజీపీ అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు అరెస్టు అయిన పోలీసులతో పాటు అరెస్టు కాబోయే వారు, విదేశాల్లో ఉన్న ప్రభాకర్‌రావు పట్టుబడిన తర్వాత.. ఉన్నతాధికారులకు తెలిసే ఈ వ్యవహారం జరిగిందని వారు చెప్తే వారికీ నోటీసులు ఇవ్వక తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రత్యేక విభాగాలు కమిషనర్ల అధీనంలో

టార్గెట్ చేసిన ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు తదితరులపై సాంకేతిక నిఘా ఉంచడం, వారి ఫోన్లు ట్యాప్ చేయడం ఎస్ఐబీ అధీనంలో ఎస్ఓటీ చేసింది. అయితే వారిని పట్టుకోవడం, నగదు స్వాధీనం చేసుకోవడం, వసూళ్లకు పాల్పడటం ఫీల్డ్ ఆపరేషన్లు మాత్రం రాజధానిలోని మూడు కమిషనరేట్లలో ఉన్న ప్రత్యేక విభాగాలు చేశాయి. దీంతో ఇప్పటివరకు జరిగిన అక్రమ ఆపరేషన్లు ఆ విభాగాలకు నేతృత్వం వహించిన కమిషనర్లకు తెలియకుండానే జరిగాయా? అనే సందేహాలు కలుగుతున్నాయి. ఈ విషయాలపై నిందితులు ఏదైనా చెబితే ఆయా ఉన్నతాధికారులకూ నోటీసులు ఇచ్చి విచారించడం అనివార్యంగా మారుతుంది. దీనిపై ఓ రిటైర్డ్ అధికారి 'సాక్షి'తో మాట్లాడుతూ... 'ఆయా ఉన్నతాధికారులు కేసులో నిందితులు కాకపోయినా, వారి పర్యవేక్షణ లోపం కచ్చితంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో వాళ్లు క్రిమినల్ చర్యలకు కాకపోయినా..డిపార్ట్‌మెంటల్ యాక్షన్‌కు అర్హులే'అని అన్నారు.

సిట్ అదుపులో వేణుగోపాల్‌రావు

- పోలీసులు ఇచ్చిన నోటీసుల ఆధారంగా బంజారాహిల్స్ ఠాణాకు వచ్చిన ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ వేణుగోపాల్‌రావును బుధవారం సిట్ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఎస్ఐబీలోని ఎస్ఓటీలో కీలకంగా వ్యవహరించిన నలుగురు అధికారుల్లో ఓఎస్డీ హోదాలో పని చేసిన ఈయన కూడా ఒకరు. అదనపు ఎస్పీగా పదవీ విరమణ చేసిన అనంతరం ప్రభాకర్‌రావు సూచనల మేరకు ఓఎస్డీగా పని చేశారు.

ఆరు గ్యారంటీలపై చర్చకు సిద్ధమా?

మంత్రులకు హరీశ్‌రావు సవాల్

- బీఆర్ఎస్‌ను వీడిన నేతలు పోటీలో 4వ స్థానంలో ఉంటారు
- బీఆర్ఎస్ శ్రేణుల సమావేశంలో మాజీ మంత్రి వ్యాఖ్యలు



మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సాక్షి యాదాద్రి: ఆరు గ్యారంటీలపై మంత్రులు చర్చకు సిద్ధంగా ఉన్నారా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఎన్నికల హామీలను అమలు చేయని కాంగ్రెస్ నిజస్వరూపం ప్రజలకు తెలిసిందని, ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బుధవారం భువనగిరిలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో హరీశ్ మాట్లాడారు. ప్రభుత్వంలోని పెద్దలు పాలనను పక్కనబెట్టి బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ కండువాలు కప్పే పనిలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్, కడియం కావ్య, రంజిత్‌రెడ్డి, పట్నం సునీత నాలుగో స్థానంలో ఉంటారని జోస్యం చెప్పారు. పార్టీ మారుతున్న స్వార్థపరులను ఓడించాలని కార్యకర్తలు కసితో ఉన్నారని హరీశ్‌రావు చెప్పారు.

రాహుల్ సంతకాన్నే ఫోర్జరీ చేసిన ఘనుడీయన

భువనగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాహుల్ గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘనుడని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల కోడ్ అడ్డం పెట్టుకుని హామీలను అమలు చేయకపోగా అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు రూ.4 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని రేవంత్‌రెడ్డి, ప్రియాంకా గాంధీ ఈ భువనగిరిలోనే హామీ ఇచ్చారని, కానీ అలాంటి హామీనే ఇవ్వలేదని అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి చెప్పారని ఆరోపించారు. కాంగ్రెస్ వైఫల్యాలతో పాటు కాంగ్రెస్‌కు ఓటేస్తే నష్టపోతామన్న విషయం అర్థమయ్యేలా ప్రజలకు వివరించాలని కార్యకర్తలను కోరారు. దేవుడిని అడ్డంపెట్టుకుని బీజేపీ ఓట్లు అడుగుతోందనీ, దేవుడి పేరుతో ఎన్నాళ్లు రాజకీయాలు చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణ ఉన్నంతకాలం బీఆర్ఎస్ ఉంటుందనీ, బీఆర్ఎస్ కార్యకర్తలు అక్రమ కేసుల గురించి దిగులు చెందవద్దని, కేసుల పరిష్కారానికి తెలంగాణ భవన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నామని హరీశ్ భరోసానిచ్చారు. కార్యకర్తలంతా కలిసి నలభై రోజులు కష్టపడితే భువనగిరిలో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ గెలుస్తారని జోస్యం చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల గురించి మీరా మాట్లాడేది?

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసంలో 'పెద్దపల్లి సెగ్మెంట్ ప్రజాప్రతినిధుల'భేటీ



సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేయలేదని బీఆర్ఎస్ నేతలు అడగడం సరైంది కాదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. 'అప్పుల కుప్పను మా చేతికి ఇచ్చి వెళ్లిపోయారు. మేం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని పరిస్థితులు చక్కదిద్దుకుంటూ వీలైనంత మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుపరుస్తున్నాము. ఎవరైనా కొత్తగా పార్టీ పెట్టి మేమిచ్చిన హామీల అమలు గురించి ప్రశ్నిస్తే బాగుంటుంది. పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేని బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సమంజసం కాదు. అన్నింటిని ప్రజలు గమనిస్తున్నారు.'అని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం బేగంపేటలోని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసంలో పెద్దపల్లి లోక్‌సభ పరిధిలోని ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాజ్‌ఠాకూర్, విజయరమణారావు భేటీ అయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలతో కలిసి పెద్దపల్లి లోక్‌సభ ఇన్‌చార్జ్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తాము డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చామని గుర్తు చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే వర్షాలు కురవలేదని చెప్పారు. అయినా అప్పుడు బీఆర్ఎస్ నేతలు వరు ణదేవుడిని ఎందుకు అడగలేదని తాము ప్రశ్నించడం లేదన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్రంలో తాగు, సాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సర్వేల ఆధారంగా గెలుపు గుర్రాలకే ఏఐసీసీ లోక్‌సభ టికెట్లు ఇస్తుందని, పెద్దపల్లిలో కూడా అదే కోవలో టికెట్ వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి వంశీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మాట్లాడుతూ తమ కుటుంబం ఈ ప్రాంతానికి, పార్టీకి చేసిన సేవకు గుర్తింపుగానే టికెట్ లభించిందని, తన తండ్రి కాకా చేసిన సేవలు ఎలాంటివో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలకు తెలుసునని చెప్పారు. వంశీని ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో తమకు వచ్చిన మెజారిటీ కంటే లోక్‌సభ ఎన్నికల్లో వంశీని ఎక్కువ మెజారిటీతో గెలిపించుకుంటామని, మంత్రి శ్రీధర్‌బాబు నాయకత్వంలో కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేస్తామని వెల్లడించారు.

బీఆర్ఎస్ ఉనికి కోసమే అబద్ధపు ప్రచారాలు

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేట: బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోసమే ఆ పార్టీ అధినేత కేసీఆర్ అబద్ధాలు ప్రచారాలు చేస్తున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే వర్షాలు ముఖం చాటేశాయని, కరువు మొదలైందన్నారు. కరువు నుంచి బయటపడేందుకు తమ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. బుధవారం సూర్యాపేటలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. కృష్ణా జలాల్లో వాటా తగ్గడానికి కేసీఆర్ వైఖరే కారణమన్నారు. కృష్ణాబోర్డు సమావేశాలకు వెళ్లకపోవడంతో ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోతిరెడ్డిపాడు ఎత్తును పెంచుకున్నారని, దీంతో నాగార్జున్‌సాగర్‌లోకి ఈ వానాకాలం వరద రాలేదని తెలిపారు. పదేళ్లలో బీజేపీ ఏం చేయలేదని, మతపరంగా దేశాన్ని విచ్ఛిన్నం చేసే రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో 7,149 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, మద్దతు ధరకంటే తక్కువ ధరకు ధాన్యాన్ని ఎవరైనా కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ హెచ్చరించారు. రాజకీయ ప్రత్యర్థులు, బిజినెస్ మ్యాన్‌లు, సినిమా వర్గాల మీద ఫోన్ ట్యాపింగ్‌కు కేసీఆర్ ప్రభుత్వం పాల్పడిందని, ప్రజలకు వారు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

బీజేపీ ఎందుకు సుమోటోగా తీసుకోవడం లేదు?

▶ మొదటి పేజీ తరువాయి


స్పష్టం చేశారు. తుక్కుగూడలో ఈ నెల 6న కాంగ్రెస్ నిర్వహించ తలపెట్టిన జనజాతర మహాసభ ఏర్పాట్లను బుధవారం వారు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పూర్తి వివరాలు వారి మాటల్లోనే...బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా వ్యవహరించింది. మా ఫోన్లు కూడా ట్యాప్ చేసింది. వీటిని అడ్డం పెట్టుకొని అక్రమ వసూళ్లకు పాల్పడింది. ఈ ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్నవారు ఎంతటి వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారిని అరెస్టు చేసి జైలుకు పంపడం ఖాయం. ప్రాజెక్టులు, విద్యుత్ కొనుగోళ్ల పేరుతో తిన్న కమీషన్లు కక్కిస్తాం. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని వారు కొల్లగొట్టిన ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, వక్ఫ్, సీలింగ్ భూములను వెనక్కి తీసుకుంటాం. ఆర్థిక దోపిడికి పాల్పడిన వారికి జైలుకు పంపిస్తాం. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో.. మీరు మా తాట తీయడం కాదు.. ప్రజలే మీ తాట తీస్తారు అని హెచ్చరించారు.

కర్రుకాల్చి వాత పెట్టినా సిగ్గురాలే

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది..కరువొచ్చిందని బీఆర్ఎస్ నేతలు పదేపదే ప్రచారం చేస్తున్నారు. కరువుకు కాంగ్రెస్‌కు సంబంధం ఏమిటి? కాంగ్రెస్ డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చింది. నాటి నుంచి నేటి వరకు వర్షపు చినుకు కురవలేదు. వర్షాకాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది. ఈ ఏడాది 56 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని సెప్టెంబర్ 5న త్రిసభ్య కమిటీ ప్రకటించింది. ఉన్న నీటి నిల్వలను జాగ్రత్తగా వాడుకోవాలని కేఆర్ఎంబీ కమిటీ ముందే హెచ్చరించింది. అయినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. బీఆర్ఎస్ పాలనలో కరువొస్తే.. కాంగ్రెస్‌కు అంటగట్టే ప్రయత్నం చేస్తుంది. ప్రజలు తెలివైనవారు. ఎవరు ఏమిటో వారికి తెలుసు. ఇప్పటికే ఒకసారి కర్రుకాల్చి వాతపెట్టారు. అయినా సిగ్గురాలే. మళ్లీ వారికి వాతపెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

జనజాతరకు భారీగా తరలిరావాలి

అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇదే తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను ప్రకటించింది. ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చింది. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది. ఇదే స్ఫూర్తితో ఇదే వేదికపై నుంచి ఈ నెల 6న కాంగ్రెస్ జాతీయ గ్యారంటీలను ప్రకటించనుంది. ఏఐసీసీ ముఖ్యనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ముఖ్య అతిథులుగా హాజరుకానుండటంతో కాంగ్రెస్ పార్టీ ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. 5 లక్షల మందికి తగ్గకుండా సభకు తరలించాలని నిర్ణయించింది. సభలో మహిళలకు పెద్దపీట వేయబోతున్నాం. వారికి ప్రత్యేక క్యాబిన్లు ఏర్పాటు చేస్తున్నాం. సభను విజయవంతం చేసేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసుకున్నాం'అని మంత్రులు వివరించారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేను తెలివైనవాడినని చెప్పగలను.
ఎందుకంటే నాకేమీ తెలీదని నాకు తెలుసు.
– సోక్రటీస్

సాక్షి
గురువారం, 4 ఏప్రిల్ 2024

నిప్పుల కొలిమి

ఎవరో తరుముకొచ్చినట్టు ఈసారి చాలాముందుగానే ఎండాకాలం వచ్చిపడింది. ఫిబ్రవరి నుంచే సెగలూ పొగలూ ఎగజిమ్మిన సూరీడు అంతకంతకూ తన ప్రతాపాన్ని పెంచుతూ పోతున్నాడు. రోజూ నమోదవుతున్న ఉష్ణోగ్రతలను చూస్తుంటే భారత వాతావరణ విభాగం(ఐఎండీ) హెచ్చరించినట్టు నిరుటికన్నా వేసవితాపం మరింత అధికంగా వుంటుందని అర్థమవుతోంది. ఇంచుమించు రోజూ 39–41 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలుంటున్నాయి. వాస్తవానికి పదేళ్లుగా దేశంలో ఎండల తీవ్రత పెరిగింది. పాత రికార్డులు బద్దలవుతున్నాయి. నిరుడు మార్చి ఎండ తీవ్రత 1901 నాటి రికార్డును అధిగమించిందని ఐఎండీ తెలిపింది. ఆ తర్వాత వరసగా ఏప్రిల్, మే, జూన్ నెలలు వేటికవే అత్యధిక ఉష్ణోగ్రతల్లో కొత్త పోకడలను నమోదు చేశాయి. రానున్న రోజుల్లో ఈ తీవ్రత మరింత పెరుగుతుందే తప్ప తగ్గదని వాతావరణ శాస్త్రజ్ఞులు చెప్తున్న జోస్యాలు భయపెడుతున్నాయి. దీనికి తోడు ఈసారి వానలు సైతం అంతంతమాత్రం కావటంతో జలాశయాలు నిండుకున్నాయి. భూగర్భ జలాలు లోలోతులకు పోతున్నాయి. నిరుడు ఎల్‌నినో ప్రభావం కారణంగా దక్షిణాసియా ప్రాంత దేశాలన్నీ తక్కువ వర్షపాతాన్ని నమోదు చేశాయి. రివాజుగా జూన్ నెల మొదట్లో కేరళను తాకాల్సిన రుతుపవనాలు ఏడు రోజులు ఆలస్యంగా వచ్చాయి. ఆ తర్వాత సెప్టెంబర్ వరకూ మెరుగ్గానే వర్షాలు పడ్డాయి. కొన్నిచోట్ల భారీ వర్షాలు పడటంతో వరదలు కూడా ముంచుకొచ్చాయి. మొత్తానికి దాదాపు 94 శాతం వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత అక్టోబర్ మొదలుకొని మార్చి వరకూ వర్షాల మాట అటుంచి కనీసం మబ్బుల జాడైనా కనబడలేదు. ఇది చాలదన్నట్టు ఫిబ్రవరి నుంచే ఎండల తీవ్రత పెరగటంతో జలాశయాల్లో నీరు అంతంతమాత్రంగానే వుంది.

ఈ మూడు నెలలూ సాధారణంగా అయితే నాలుగు నుంచి ఎనిమిది రోజులు మాత్రమే వడగాడ్పులు తీవ్రంగా వీచాలి. కానీ ఇది పది నుంచి 20 రోజుల వరకూ ఉండొచ్చని ఐఎండీ చెబుతోంది. ముఖ్యంగా గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశాల్లో ఉష్ణోగ్రతలూ, వడగాడ్పుల తీవ్రత అధికంగా వుండొచ్చని వాతావరణ విభాగం హెచ్చరిస్తోంది. మండే ఎండలు, తీవ్ర వడగాడ్పులు, కుండపోత వర్షాలు, ముంచెత్తే వరదలు ఎవరూ ఆపగలిగేవి కాదు. కానీ ప్రపంచ దేశాలు సమష్టిగా నిర్ణయాలు తీసుకుని, సమర్థంగా అమలు చేయగలిగే కార్యాచరణను రూపొందిస్తే వీటి తీవ్రతను తగ్గించటానికి ఆస్కారం వుంటుంది. ప్రపంచ వాతావరణ సంస్థలు(డబ్ల్యూఎంఓ) మొన్న మార్చి 19న విడుదల చేసిన ప్రపంచ వాతావరణ నివేదిక ఏమంత ఆశాజనకంగా లేదు. నిరుటికన్నా 2024 మరింత ప్రమాదకరంగా వుండగలదని హెచ్చరించింది. కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, క్లోరోఫ్లోరో కార్బన్లు వంటి గ్రీన్ హౌస్ వాయువులు వాతావరణంలో పరిమితులకు మించి పెరిగిపోవటం వల్ల ఉష్ణోగ్రతలు అధికమై సముద్ర ఉపరితల జలాలను వేడెక్కిస్తున్నాయని ఆ నివేదిక తెలిపింది. ఆఖరికి అంటార్కిటిక్, ఆర్కిటిక్ ప్రాంతాల్లో భారీ మంచు పలకలు కరగటం నిరుడు బాగా ఎక్కువైందని వివరించింది. ఆర్థికవృద్ధి పేరుతో ప్రభుత్వాలు పర్యావరణానికి నష్టం చేకూర్చే విధానాలు అవలంబించటమే ప్రస్తుత పరిస్థితికి కారణం. భారత, బంగ్లాదేశ్‌లలో పర్యావరణ విధ్వంసం వల్ల నిరుడు ఏప్రిల్ నెలలో వడగాడ్పుల తీవ్రత 30 రెట్లు పెరిగిందని వాతావరణ శాస్త్రవేత్తలు లెక్కేశారు. ఎండల తీవ్రత, వడగాడ్పుల వల్ల సహజంగానే రానున్న రోజుల్లో నీటి కొరత మరింత ఎక్కువకావొచ్చు. ఎన్నికల సీజన్ కావటంతో ఈ సమస్యపై వాగ్యుద్ధాల మోత కూడా ఎక్కువేవుంటున్నది. కారణం మీరంటే మీరని తెలంగాణ రాష్ట్రంలో అధికార, విపక్షాలు మాటలు విసురుకుంటున్నాయి. ఆ మాటెలావున్నా ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండి వడ గాడ్పులపై, ఎండల తీవ్రతపై ప్రజలను హెచ్చరించటం అవసరం. లేనట్టయితే వడదెబ్బ మరణాలు పెరిగే అవకాశం వుంది.

మన దేశంలో వడగాడ్పులను ప్రకృతి వైపరీత్యంగా పరిగణించటం లేదు. చెప్పాలంటే వేటిని వడదెబ్బ మరణాలుగా లెక్కేయాలన్న అంశంలో ఎలాంటి కొలమానమూ లేదు. నిరుడు డిసెంబర్‌లో లోక్‌సభలో వడగాడ్పులను ప్రకృతి విపత్తుగా లెక్కేసి, బాధిత ప్రజల సహాయపునరావాసాల కోసం నిధులందించాలని డిమాండ్ వచ్చింది. కానీ కేంద్రం నుంచి పెద్దగా స్పందన లేదు. పర్యవసానంగా బాధిత కుటుంబాలకు ఎలాంటి సాయమూ అందటం లేదు. కేవలం కొన్ని రాష్ట్రాలు మాత్రమే ఇందుకు మినహాయింపు. ఎన్‌డీఎంఏ 2016 నుంచి కొన్ని మార్గదర్శకాలు విడుదల చేస్తోంది. అక్కడితో దాని పాత్ర ముగుస్తోంది. ఎండ తీవ్రత ఉన్నపుడు ఆరుబయట కార్మికులతో పనిచేయించకుండా చూడటం, ఎక్కడికక్కడ తాగునీటి సౌకర్యం కల్పించటం, ప్రజారోగ్య సిబ్బందిని సంసిద్ధంగా ఉంచటం, అవసరమైన ప్రాంతాలకు సహాయబృందాలను తరలించటం కీలకం. ఇలాంటి జాగ్రత్తలతో వడగాడ్పు మరణాల నివారణ సాధ్యమే. అలాగే ఇరుకిరుకు ఇళ్లలో మగ్గిపోయే మురికివాడల ప్రజలనూ, మరీ ముఖ్యంగా వృద్ధులనూ, గర్భిణులనూ, బాలింతలనూ వడగాడ్పుల నుంచి సంరక్షించటానికి ఏం చేయగలమో ప్రభుత్వాలు ఆలోచించాలి. ఈ కృషిలో స్థానిక సంస్థల పాత్ర పెంచటం, అందుకు అవసరమైన నిధులు అందించటం ప్రభుత్వాల బాధ్యత. అన్నిటికీ మించి వడగాడ్పులను ప్రకృతి వైపరీత్యంగా పరిగణించి, ఆ విషయంలో పౌరులను అప్రమత్తం చేసేందుకూ, వారిని కాపాడేందుకూ అనుసరించాల్సిన విధానాలను రూపొందించటం తక్షణావసరమని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలి.

రూల్‌బుక్‌ను మార్చి రాయాలా?!

విశ్లేషణ



అశోక్ లావాసా

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు కనివిని ఎరుగని విధంగా చేపడుతున్న చట్టపరమైన చర్యల పరంపరపై రచ్చ నడుస్తోంది. ఈ చర్యలు ఏమైనా 'ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య పద్ధతి' ఉల్లంఘనకు దారితీస్తున్నాయా అనే విషయాన్ని ఎన్నికల సంఘం నిర్ధారించవలసిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రజాస్వామ్య ప్రక్రియల సమగ్రతను, నైతికతను కాపాడుకోవటానికి 'అందరికీ సమానావకాశాలు' (ఎల్.పి.ఎఫ్.) అనే భావన కీలకం అవుతోంది. అలాంటి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల తరుణంలో ఎల్.పి.ఎఫ్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ – ఎం.సి.సి.) అమలుపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించి వివిధ అంశాలను విశ్లేషించడం అవసరమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

2024 సార్వత్రిక ఎన్నికలను ప్రకటించిన రోజున భారత ఎన్నికల సంఘం, మీడియాకు వివరాలు అందిస్తూ తెలిపిన మంచి అంశాలలో ఒకటి ఏమిటంటే, లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్... ఆటలో అందరికీ సమానావకాశాలు (ఎల్‌పీఎఫ్)కి ఈసీ ఇస్తున్న ప్రాధాన్యం. అన్ని రాజకీయ పార్టీలకూ ప్రవర్తనా నియమావళిని ఈసీ పంపిందనీ, దానిని ఆ యా పార్టీలు తమ స్టార్ క్యాంపెయినర్ల దృష్టికి తీసుకెళ్లాలనీ అభ్యర్థించినట్లు కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈసీ) రాజీవ్ కుమార్ తెలిపారు. ఎల్పీఎఫ్‌కు భంగం కలిగించే చర్యలకు సంబంధించిన ఫిర్యాదులపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు.

ఎల్‌పీఎఫ్ అనేది క్రీడలు లేదా యుద్ధాల విషయంలో వర్తించని వ్యక్తీకరణ. సమవుజ్జీలైన రెండు జట్లు మాత్రమే ఒకదానితో ఒకటి ఆడాలి అనేది ఉండదు. క్రికెట్‌లో, స్వదేశీ జట్లు పిచ్‌ను తమకు అనుకూలంగా మార్చుకుంటాయి, అయితే ఈ 'అన్యాయమైన అభ్యాసం' మన్నించబడింది ఎందుకంటే పాల్గొనే జట్లు తమ వంతు కోసం ఎదురు చూస్తుంటాయి. అదేవిధంగా, ఒక శక్తిమంతమైన సైన్యం పోరాటంలో ఒక చిన్న ప్రతిపక్షాన్ని దెబ్బతీస్తే దాన్ని అన్యాయంగా పరిగణించరు. ప్రేమలో, యుద్ధంలో అంతా న్యాయమైనదే అంటారు.

ఎల్‌పీఎఫ్ అనేది స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలకు ఒక పవిత్రమైన సూత్రం. ప్రజాస్వామ్యంలో ఎన్నికలనేవి యుద్ధం లేదా ప్రేమ పోటీ కానే కాదు. వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఒకరితో ఒకరు పోటీపడి ప్రతినిధుల సభలో ప్రాతినిధ్యం వహించడానికి ఓటర్ల ఆదేశాన్ని పొందడం ప్రజాస్వామ్యంలో కీలకమైన సంఘటన. ఓటు అనేది విశ్వాసంపై, వాస్తవాలపై ఆధారపడిన సామాజిక ఒప్పందం.

ఈ పోటీ నిష్పక్షపాతంగా ఉండాలంటే, పోటీదారులు సమానంగా ఉండకపోవచ్చని అంగీకరించినప్పటికీ, ఎన్నికల సమయంలో ఎల్‌పీఎఫ్ లభ్యత ఒక తప్పనిసరి షరతుగా పరిగణించబడుతుంది. స్వాభావిక అసమానతను ఆటలో భాగంగా గుర్తిస్తే, ఎన్నికల సమయంలో వారు ఓటర్లను తమకు అనుకూలంగా ప్రభావితం చేయడానికి ప్రయత్నించినప్పుడు ఎల్‌పీఎఫ్ ఉండేలా చూసుకోవడమనేది ప్రక్రియ నియంత్రణాధికారి బాధ్యత.

ఎల్‌పీఎఫ్‌కి చెందిన ఈ సూత్రాన్ని నిశితంగా పరిశీలిస్తే, ప్రతిపక్ష అభ్యర్థులతో పోలిస్తే అధికార పక్షం పొందే ప్రయోజనానికి 'సమం చేయడం' నిర్దిష్టమైనదని చూపిస్తుంది. క్రీడలలో బలహీనమైన జట్టు బలమైన వారితో పోటీపడవచ్చు. వాస్తవానికి, టెన్నిస్ వంటి ఆటలలో పోటీ ప్రారంభ రౌండ్లలో, బలహీనమైన అన్ సీడెడ్ ఆటగాళ్లు ర్యాంకింగ్ పట్టికలను శాసించే ఆటగాళ్లతో తలపడతారు. అత్యున్నతమైన నైపుణ్యాలు, పరాక్రమాలు కలిగిన వారి చేతుల్లో ఓడిపోయినప్పుడు కన్నీళ్లు కూడా రావు. ఎందుకంటే క్రీడలు తాము ప్రజాస్వామికమని చెప్పుకోలేవు. అయితే నిజమైన ప్రజాస్వామ్యంలో ఎన్నికలు మాత్రం అందుకు భిన్నమైన ఆట అనే చెప్పాలి.



సాధారణ సమయాల్లో సాధారణ పౌర ప్రవర్తనను నియంత్రించడానికి సాధారణ చట్టాలు ఉన్నప్పటికీ, రాజకీయ పార్టీల వారు, అభ్యర్థులు ఎన్నికల సమయంలో ఒక నిర్దిష్ట వైఖరిని పాటించాలని భావిస్తున్నారు, దీనిని వారు ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలోనే స్వచ్ఛందంగా అంగీకరించారు. అయితే సూచించిన నిబంధనలన్నీ నిర్దిష్టంగా చట్టంలో లేవు. కొన్నిసార్లు ఇది మంచి ప్రజా ప్రవర్తన పట్ల వారి నిబద్ధతకు గుర్తు. ఈసీ పాటించే సమతూకం విధానానికి చెందిన ప్రదర్శన. ఎన్నికల సమయంలో ఈసీ అమలు చేయాలని భావిస్తున్న ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)కి ఆవిర్భావం ఇది.

ఎంసీసీని పరిశీలిస్తే కోడ్ పరిధిలో నలుగురు ప్రధాన ఆటగాళ్లు ఉన్నారని అర్థమవుతుంది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, అధికార పార్టీ, బ్యూరోక్రసీ. చివరి రెండూ పాలక వ్యవస్థలో భాగమే కానీ వాటికి కూడా విడిగా కోడ్ వర్తిస్తుంది. కోడ్‌లో ఎక్కువ భాగం ఇప్పటికే ఉన్న విభేదాలను తీవ్రతరం చేయడం, లేదా పరస్పర ద్వేషాన్ని పాదుకొల్పటం, లేదా వివిధ కులాలు, వర్గాల మధ్య ఉద్రిక్తతలను సృష్టించటం, లేదా ధ్రువీకరించలేని ఆరోపణలు చేయడం, చట్టంలో పొందుపరచబడిన ఉల్లంఘనల చుట్టూ ఉంటుంది. ఓట్లను పొందడం కోసం కులం లేదా మతపరమైన భావాలను ప్రేరేపించరాదనీ, పార్టీలు, అభ్యర్థులు అవినీతి విధానాలను ఆశ్రయించరాదనీ, పార్టీలు, వారి కార్యకర్తలు ప్రత్యర్థి పార్టీల కార్యకలాపాలకు అంతరాయం కలిగించరాదనీ కోడ్ నిర్దేశిస్తుంది. ప్రచార సభలు, ఊరేగింపులు, పోలింగ్ బూత్‌లు, మేనిఫెస్టోలపై కూడా ఇలాంటి సెక్షన్లు ఉన్నాయి.

అయితే, గమనించదగ్గ విషయం ఏమిటంటే, 'కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ' కోసం ఎంసీసీ ఒక ప్రత్యేక విభాగాన్ని కేటాయించింది. 'అధికారిక పదవిని ఉపయోగించినట్లు ఎటువంటి ఫిర్యాదు రాకుండా, ఎటువంటి ఫిర్యాదుకూ కారణం చూపే అవకాశం లేకుండా చూసుకోవా'లని కోడ్ ఆజ్ఞాపించింది. కోడ్ పరిధిలోకి వచ్చిన దుర్వినియోగమంటే... అతిథి గృహాలు, రవాణా వంటి ప్రభుత్వ సౌకర్యాల వినియోగానికి సంబంధించినవి. అలాగే ప్రకటనల్ని జారీ చేయడానికి లేదా కొత్త ఆంక్షలను మంజూరు చేయ డానికి ప్రభుత్వ నిధులను వినియోగించడం, అందుకు అధికారాన్ని ఉపయోగించడం కూడా! ఎంసీసీ వీటిని దాటి వెళ్లదు.

రాష్ట్ర యంత్రాంగం, న్యాయ వ్యవస్థ సాధారణ పనితీరు ప్రస్తుత ఎంసీసీ ద్వారా ఏ విధంగానూ పరిమితమైపోదు. న్యాయస్థాన విచా రణల వంటి న్యాయ ప్రక్రియలో ఈసీ జోక్యం చేసుకోవడం, లేదా చట్టాన్ని అమలు చేసే సంస్థల సాధారణ విచారణ ఈసీ ఆదేశాలకు లోబడి ఉండాలా వద్దా అనేది చర్చనీయాంశం. బహుశా, ప్రారంభంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముసాయిదాను రూపొందించినప్పుడు ప్రభుత్వ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల అధికార దుర్వినియోగం అనేది ఊహకైనా రాలేదు.

అయితే, ఎంసీసీ అనేది మానవ ప్రవర్తన లాగా కాలగతిలో మారుతూ వచ్చే పురోగమన పత్రం. 2009లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో, ఈసీ 2009 మార్చి 19 నాటి తన లేఖను పరిశీలించి, ఎంసీసీ వర్తింపు చట్టబద్ధమైన స్వయంప్రతిపత్తి గల ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ల వంటి కమిషన్‌లకు విస్తరించిందని స్పష్టం చేసింది. బడ్జెట్ సమర్పణపై ఎంసీసీ వర్తింపు గురించి ఆ నాటి ఈసీ లేఖ స్పష్టం చేసింది.

ప్రస్తుతం నెలకొన్న వాతావరణం, ప్రభుత్వ సంస్థల జోరు ఫలితంగా అన్ని పక్షాలకూ సమాన అవకాశాలు లేని స్థితి చూశాక ఎన్నికల సంఘం రంగంలోకి దిగాల్సిందేనేమో! తాజా ఫిర్యాదులకు దారితీసిన పరిస్థితులను పరిశీలించాలేమో!! గతంలో ఇలాంటి పరిస్థితుల్లోనే 2019లో ఎన్నికల సంఘం రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు ఒక సలహాను జారీ చేసింది. ఇప్పుడు మళ్ళీ ఆ విధంగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల అపూర్వమైన చర్యల పరంపర ఏదైనా 'ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య అభ్యాసాన్ని' ఉల్లంఘిస్తున్నదేమో ఈసీ నిర్ధారించాలి.

ఇప్పుడు ఎన్నికల సంఘానికి ఉన్న ప్రధానమైన సందిగ్ధత ఏమిటంటే... 'స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు' నిర్వహించే తన ఏకైక బాధ్యతకు కట్టుబడి రూల్ బుక్‌ను అనుసరించాలా, లేక 'స్క్రిప్టు'ను తిరిగి రాయాలా అనేది! 'స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు' అనే పదం రాజ్యాంగంలో పేర్కొన లేదు కానీ ఈసీ 'పర్యవేక్షణ, దిశానిర్దేశం' అనే మాటలోనే ఆ స్ఫూర్తి నిండి ఉంటుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనేది కూడా మనం సాధారణంగా అర్థం చేసుకునే దానికంటే చాలా పెద్దది. సంపూర్ణంగా గ్రహించి, అమలు చేయాల్సిన న్యాయమైన స్ఫూర్తి అందులో ఉంటుంది.

వ్యాసకర్త మాజీ ఎన్నికల కమిషనర్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆదర్శ భారత్!



ఇటీవలి నా భారత పర్యటనలో ఎ.ఐ, డి.పి.ఐ. విధ్య అనేవి ఏ విధంగా ఆరోగ్య సంరక్షణను, చిన్న రైతుల జీవితాలను మెరుగుపరుస్తున్నాయో, ఈ రెండు సాంకేతిక పరిజ్ఞానాలతో ప్రపంచాన్ని ఎంత అద్భుతంగా మార్చవచ్చో ప్రత్యక్షంగా చూశా.

– బిల్ గేట్స్, మైక్రోసాఫ్ట్ దిగ్గజం

నవ్వులాట కాదు



ఇదొక ఫన్ ఫ్యాక్ట్. ప్రస్తుతం లోక్‌సభలో బీజేపీకి 295 సీట్లు ఉన్నాయి. సభలో మెజారిటీకి మార్కు 272. అంటే బీజేపీ 272 కంటే దిగువకు పడిపోయిన రోజు దాని మిత్రపక్షాలన్నీ (సీబీఐ, ఈడీలను వాడి కలుపుకొన్నవి) బీజేపీకి దూరంగా వెళ్లిపోతాయి. మోదీకి నిద్ర పట్టకపోవడానికి కారణం లేకపోలేదు.

– సాకేత్ గోఖలే, రాజ్యసభ ఎంపీ

పడవ మునగబోతోందా?



కేజ్రీవాల్ అరెస్టయ్యాక పార్టీలో మద్దతు తగ్గుతోంది. కేజ్రీవాల్ జైల్లోనే కొనసాగితే తమకు సీఎం అయ్యేందుకు అవకాశం ఉందని కలలు కంటున్న ఆతిషి, సౌరభ్ భరద్వాజ్ 'ఆప్'ను వీడక పోవచ్చు. ఆ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా లండన్‌లోనే ఉండిపోయారు. మరో ఎంపీ స్వాతి యు.ఎస్.లో ఉన్నట్లు తెలుస్తోంది.

– అమిత్ మాల్వియా, బీజేపీ ఐటీ సెల్

అన్వయ దోషం



ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయటానికి మూడు రోజుల ముందు ఎస్.పి.ఎం.సి.ఎల్. ద్వారా 1 కోటి రూపాయల విలువజేసే 10 వేల బాండ్ల ముద్రణకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. అయితే పేరున్న పత్రిక ఆ సంఖ్యను 10 వేల కోట్ల రూపాయల విలువైన పదివేల బాండ్లుగా ప్రచురించింది!

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

నిరుద్యోగ రాజ్యం



అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం భారతదేశ పట్టభద్రులలో నిరుద్యోగిత రేటు 29.1 శాతం. ఇది... చదవటం, లేదా రాయటం రాని వారి 3.4 శాతం కంటే 9 రెట్లు ఎక్కువ. ఇక టెన్త్, ఆపై ఉన్నత విద్య అభ్యసించిన యువతలో నిరుద్యోగిత రేటు 6 రెట్లు ఎక్కువగా 18.4 శాతం వద్ద ఉంది!


– సుశాంత్ సింగ్, యేల్ యూనివర్సిటీ

ఇన్ బాక్స్

సమతావాది... సంస్కరణవాది

ధీరోదాత్తత, నిష్కాపట్యం, కరుణ, జాలి, దేశభక్తి, దైవభక్తి లాంటి ఎన్నో గొప్ప లక్షణాలు ఉన్న మహనీయుడు డా॥ బాబూ జగ్జీవన్ రామ్. ఒకవైపు దేశ స్వాతంత్రం కోసం పోరాడుతూనే మరో వైపు సామాజిక సమానత్వం కోసం అలుపెరగని సమరం సాగించిన యోధుడాయన.

జగ్జీవన్ రామ్ చమార్ కుటుంబంలో 1908 ఏప్రిల్ 5వ తేదీన బిహార్ రాష్ట్రంలోని చాంద్వా గ్రామంలో జన్మించారు. బెనారస్ విశ్వవిద్యాలయంలో చదివేటప్పుడు సంఘంలోని హెచ్చుతగ్గులు, కులాల మధ్య తేడాలు పూర్తిగా తెలుసుకున్నారు. కుల సమస్యతో సహా దేశంలోని అనేక సమస్యలు పరిష్కారం కావాలంటే దేశానికి స్వాతంత్ర్యం రావాలని ఆశించారు.



డా॥ బాబూ జగ్జీవన్ రామ్

అస్పృశ్యుల ఉద్ధరణకు 1928లో 'రవిదాస్ మహాసభ'ను ఏర్పాటు చేశారు. హరిజనులు అపరిశుభ్రమైన వృత్తులను విడనాడటం, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఆరోగ్య నియమాలను పాటించటం, మద్యపానాన్ని మానడం వంటి అంశాలను కార్యకర్తలు చేపట్టేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. నిరక్షరాస్యతను తొలగించటానికి రాత్రిపూట వయోజన పాఠశాలలు నిర్వహించేలా చూశారు.

1934లో బిహార్‌లో భూకంపం వచ్చినప్పుడు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. దళితులందరినీ సంఘటిత పరచి 1934 సంవత్సరం కలకత్తాలో తొలి 'అఖిల భారత రవిదాస్ మహాసభ'ను ఏర్పాటు చేశారు. బిహార్ శాసనసభకు 1935లో జరిగిన ఎన్నికల్లో మొత్తం 15 ఎస్సీ రిజర్వుడ్ స్థానాలకు జగ్జీవన్ నిలిపిన అందరూ గెలిచారు. వీరిలో 14 మంది ఏకగ్రీవం కావడం మరో విశేషం. 1936లో బిహార్ శాసనమండలికి నామినేట్ అయ్యారు. 1930లో గాంధీజీ దృష్టిలో పడ్డారు. కాన్పూర్‌లో జరిగిన 'ఆలిండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్' మహాసభలకు అధ్యక్షత వహించారు. ఈ మహాసభలను గాంధీజీ ప్రారంభించడం విశేషం.

వ్యక్తిగత సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలుకెళ్లారు. స్వాతంత్ర్యం అనంతరం రాజ్యాంగంలో చేర్చిన దళితుల హక్కులను కాపాడడానికి ఎంతగానో కృషి చేశారు. భారతదేశంలో సుదీర్ఘకాలం క్యాబినెట్ మంత్రిగా ఉన్న రికార్డు ఆయన సొంతం. కేంద్రంలో కార్మిక, కమ్యూనికేషన్, రవాణా, రైల్వే, ఉపాధి, పునరావాసం, ఆహార, వ్యవసాయ మంత్రి పదవులను ఆయన నిర్వహించారు. ఆయన పేరుకు ముందు 'బాబు' అనే పదం చేర్చి గౌరవంగా పిలుచుకోవడం చూస్తే ఆయన జన జీవితంలో ఎంతగా కలిసిపోయారో అర్థం చేసుకోవచ్చు. అటువంటి మహానుభావుడు 1986 జూలై 6న తుది శ్వాస విడిచారు. అంతకు ముందటేడాదే దేశ ప్రజలు ఆయన జన్మదినోత్సవాన్ని 'సమతా దివస్'గా జరుపుకోవడం విశేషం.

– నర్సింగు కోటయ్య; చరిత్ర అధ్యాపకులు, మిర్యాలగూడ
(రేపు డా॥ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి)

ఆ అందాలు గ్రంథాలకే పరిమితమా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

రుతువులన్నింటిలోనూ ఏది ఆహ్లాదకరమైనదని ప్రశ్నించినప్పుడు 'వసంతం' అని చెప్పుకోవడం మన అలవాటు. కానీ గత సంవత్సరంపైగా పరిణామాల్ని గమనిస్తే ఆ వసంతం కొంతకాలంగా తన 'ధర్మాన్ని' తప్పింది. శిశిర రుతువులో చలికి కుంచించుకుపోయిన వసంతం తన వంతు రాగానే మానవాళికి యవ్వనాన్ని ప్రసాదిస్తుంది. ఈ వసంత కాల యవ్వనోదయాన్ని మహాకవి నన్నయ భారతం ఆది పర్వంలో తన్మయంతో వర్ణించాడు. కోకిలమ్మల కిలకిలా రావాలను చెవులకు కట్టి మరీ వినిపించాడు. కానీ జనవరి–ఫిబ్రవరి నెలల్లో ఎన్నడూ లేనంతగా అధిక ఉష్ణోగ్రతలు ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా నమోదు కావడాన్ని ఆందోళనతో అధికార సంస్థలు పేర్కొన్నాయి.

బహుశా ఈ అసాధారణ వాతావరణ పరిస్థితుల్ని నిరంతర పరిశీలనతో ఏళ్ల తరబడిగా గమనిస్తున్నందుననే కావచ్చు మహాకవి శ్రీనాథుడు ప్రకృతి సమయస్తంభన ఎప్పుడు ఎలా సాధ్యమవుతుందో 'కాశీఖండం' కావ్యంలో అక్షరసత్యంగా వివరించడం ఆశ్చర్యం గొలిపే సన్నివేశం! తానూ సూర్యబింబంతో పాటు ప్రయాణించి తెలుసుకున్నంత వివరంగా వర్ణించాడు. కాలం కదలకుండా స్తంభించిపోతే లోకం ఎలా ఉంటుందో ఊహించి చెప్పాడు. ఫలితంగా కొన్ని దేశాలు విపరీతమైన ఎండలతో 'కుమిలి' పోతాయనీ, కొన్ని అతి చలితో కుంగిపోతాయనీ, కొన్ని దేశాలు ఈ రెండింటి తీవ్రత వల్ల దెబ్బతినిపోతాయనీ పేర్కొన్నాడు. అంతేగాదు, వాతావరణంలో తారుమారు పరిస్థితుల వల్ల చిత్రగుప్తాదులు సహితం లెక్కలు తప్పి చిక్కుల్లో పడతారని, వర్షాలు గాడితప్పి పంటలు నాశనం అయి ప్రజలు ఇబ్బందుల్లో పడతారనీ – శ్రీనాథుడు ఊహించి హెచ్చరించాడు. అలాగే సాలెపురుగు తన శిల్పకళా నైపుణ్యంతో ఆలయాల్ని ఎలా తీర్చిదిద్దిందో ధూర్జటి మహాకవి 'కాళహస్తి మహత్మ్యం' రచనలో వర్ణించాడు.

1970 నుంచి డిసెంబర్–ఫిబ్రవరి మాసాల్లో చలికాలాల్లోనే దేశంలో ఎక్కువ ప్రాంతాల్లో ఎక్కువ డిగ్రీల ఉష్ణోగ్రతలు విజృంభించడాన్ని సాధికార నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఫలితంగా పెక్కు రాష్ట్రాలు 'వసంత' రుతువును కోల్పోయాయి. వాతావరణ శాస్త్రవేత్తల అంచనా ప్రకారం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మాసాలు చలికాలాలు. కానీ ఇటీవల కాలంలో ఈ క్రమగతి కాస్తా తప్పి వసంతం దూరమైపోతోంది. ఈ ప్రపంచం అణు సంయోగం వల్ల ఏర్పడిందన్నది పరమాణువాదుల నిర్ణయం. ఈ సత్యాన్ని 3 వేల ఏళ్ల పూర్వం పరమాణువాది కణ్వ మహర్షి స్పష్టం చేశాడు. ఆ పద్ధతిలోనే ఆధునిక శాస్త్రవేత్తలు అణువుల్ని బద్దలు కొట్టగల్గుతున్నారు. ఎటుతిరిగీ పరమాణువులే ఇంకా అంకెకు రావలసి ఉంది, వాటిని బద్ధలుకొట్టి లోబరచుకునే విశ్వప్రయత్నంలోనే శాస్త్రవేత్తలు ఉన్నారు. ఆ దీర్ఘకాల ప్రయత్నం ఎలా ఉన్నా రానున్న మాసాలలో పెక్కు ప్రాంతాలు 42.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతకు గురి కానున్నాయని తాజా అంచనాలు. ఫలితంగా ఇప్పటికే అనూహ్యమైన వేడికీ, ఉడకబోతకూ పౌరులు గురవుతున్నారు. వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

రెండో మాట



సూర్యచంద్రులు, ఇతర గ్రహాలు నియమం ప్రకారం నడుచుకుంటాయి. నియమాలలో ఉన్న వస్తువులు క్రమబద్ధంగా ఉంటాయని సుప్రసిద్ధ పండిత గోపదేవ్ భావన. అందుకే సంపదను త్యాగభావంతో మాత్రమే అనుభవించాలని, అంటే 'నాది కాదనే' భావంతో అనుభవించాలని గోపదేవ్ అంటారు. 'ఏదో ఒక రోజున ఈ శరీరమనే అద్దె కొంపను ఖాళీ చేయవలసి ఉంటుందని బోధిస్తూ 'అద్దె కొంప లోకమింతేరా తమ్ముడు' అన్న ఓ సినిమా రికార్డును వినిపించారాయన. అలాగే ఈ సంపదలను త్యాగభావంతో మాత్రమే అనుభవించాలని యాజ్ఞవల్క్య మహాముని భార్య మైత్రేయి భావించి భర్తను ప్రశ్నిస్తుంది. దానికి యాజ్ఞవల్క్యుడు సమాధానమిస్తూ 'భర్త తన భార్యను ప్రేమిస్తున్నాడంటే, అది భార్య కోసం కాదు, తన సుఖం కోసం, అలాగే స్త్రీ కూడా పురుషుణ్ణి (భర్తను) ప్రేమించడం తన సుఖం కోసమేనని గ్రహించాలంటాడు. ఈ సందర్భంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి తన భార్య గురించి ఆర్ద్రంగా చెప్పిన మాటలు గుర్తుకు రావలసిందే:

'నాకు మతం లేదు, కులం అసలే లేదు. నేను మనిషిని. హృదయవాదిని. నేను చావును కోరుకోను. ఎందుకంటే భార్యకు దూరమవుతానని. ఆమెను విడిచి ఉండలేననీ!' అనేక దుర్ఘటనలతో అల్లకల్లోలంలో పడిన కృష్ణశాస్త్రి హృదయం తనను 'మనసారా ఏడ్వనివ్వమని' మనల్ని కోరడానికి కారణం ఆ హృదయ ప్రక్షాళన కోసమే! అందుకే బుద్ధిమంతులకు, మూర్ఖులకూ మధ్య తేడాను వివరిస్తూ విజ్ఞులు అన్నారు:

"కావ్య శాస్త్ర వినోదేన కాలో గచ్ఛతి ధీమతాం
/వ్యసనేన చ మూర్ఖాణాం నిద్రయా కలహేన వా"

బుద్ధిమంతుల కాలం కావ్య శాస్త్ర వినోదాలతో గడుస్తుంది. మూర్ఖుల కాలం వ్యసనాలతో, నిద్రతో, కలహాలతో గడుస్తుంది!

abkprasad2006@yahoo.co.in

అహంకారమే అడ్డంకి!

సాధారణంగా సద్గురువు చుట్టూగల కాంతివలయం, ఆయన నుండి వెలువడే ఆకర్షణ శక్తి... ఆయన ఆధ్యాత్మిక వలయంలోనికి వచ్చే వారి మనస్సులను పరిశుద్ధం చేస్తుంది. కావున గురువుకు చేరువలో ఉండటాన్ని ఎవరూ తోసివేయలేరు. ఈ కారణం చేతనే భక్తులు సమీప, దూరపు ప్రదేశాల నుండి మళ్ళీ మళ్ళీ వచ్చి సద్గురువు దర్శనం చేసుకోవడం ఓ నియమంగా ఏర్పరచుకొంటున్నారు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

సద్గురువు సాన్నిధ్యాన్ని శిష్యుడు తన ఆత్మ పరివర్తనకు ఉప యోగించుకోవాలి. ఎప్పుడైతే శిష్యుడు దైవత్వాన్ని క్రమంగా వృద్ధి పరచుకొంటాడో, అప్పుడే సద్గురువు సాన్నిధ్యం సఫలమవుతుంది. ఆ తర్వాత, ఆ భక్తుడు గురువు విశ్వ వ్యాపకత్వాన్నీ, దైవత్వాన్నీ అనుభవిస్తాడు. దైవం, గురువు, ఇష్టదేవత... అందరూ మన ఆధ్యాత్మిక మార్గానికి శక్తిమంతమైన సహాయకులే. కానీ, సహాయాన్ని ఫలవంతం చేసుకోవాలంటే కృషి ఎంతో అవసరం.

'శరణాగతి' చేయనిదే మనకు ఆత్మానుభూతి ఎన్నటికీ సాధ్యపడదు. శరణాగతి సద్గురువుకు చేసినా లేక భగవంతునికి చేసినా ఒక్కటే. నీవు శరణాగతి చేసిన తర్వాత 'నీవు' అనేది ఉండదు. అపుడు నీలోనికి భగవంతుడే (సద్గురువే) ప్రవేశిస్తాడు. దేవుడి లేక సద్గురువు ఆదేశానుసారం నడచుకోవడమే శరణాగతి. అహంకారంతో నీ మనస్సును అనుసరించి నీ ఇష్టానుసారంతో నడిస్తే, నువ్వు చేసే శరణాగతి ఏ స్థాయిలో ఉంటుందో నువ్వే నిర్ణయించుకోవాలి.

శిష్యుడికి గురువు ఎంత పవిత్రుడో, గురువుకు శిష్యుడు కూడా అంతే పవిత్రుడు. అజ్ఞానం వలన ఒక భక్తుడు గురువు గురించి చెడుగా మాట్లాడినా, అలాంటి శిష్యునికే సహాయం చాలా అవసరం ఉన్నదని గురువుకు తెలిస్తే ఆయన వెంటనే సహాయం చేస్తాడు. చంచలమైన మనస్సును స్వాధీనంలోకి తీసుకొనిరావడమనేది కేవలం భక్తి వల్లనే సాధ్యమవుతుంది.

ఈ విధంగా మనస్సును స్వాధీనపరచుకోకపోయినచో, కోరికలు అగ్ని జ్వాలల మాదిరిగా పైపైకి లేస్తాయి. ప్రతి వ్యక్తి తన శరీరాన్నీ, మనస్సునూ, ఆత్మనూ గురువునకు లేక దేవునికి సమర్పించి, నిస్వార్థమైన భక్తిని ఆచరించాలి. అజ్ఞానం కలగడానికి మూలకారణం మన అహంకారమే. ఎపుడైతే 'నేను' అను భావన తొలగిపోతుందో అపుడే అజ్ఞానం మాయమైపోతుంది. నిస్వార్థ భక్తి మార్గంలో సాధకుడికి అడ్డుగా నిలిచేది అహంకారమే. అదే అతి పెద్ద అవరోధం.

భగవంతునికి కావలసినది అహంకార రహిత భక్తి మాత్రమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.దశమి ప.12.02 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** శ్రవణం సా.4.31 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.8.18 నుండి 9.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.00 నుండి 10.48 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, **అమృత ఘడియలు:** ఉ.6.34 నుండి 8.07 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.57, **సూర్యాస్తమయం:** 6.10.

దిగ్విజయంగా పింఛన్ల పంపిణీ

చంద్రబాబు అండ్ కో కుట్రలను అధిగమించి పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం

- బుధవారం మధ్యాహ్నం నుంచే సచివాలయాల్లో అవ్వాతాతలకు పింఛన్లు
- 6 గంటల్లోనే 26,00,064 మందికి రూ.785.25 కోట్లు పంపిణీ
- మరో 3 రోజులు కొనసాగనున్న పంపిణీ
- బుధవారం మధ్యాహ్నం నుంచి పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం..
- వలంటీర్ల బంధాన్ని బాబు అండ్ కో తెంచడంతో ఆ సమాచారం తెలియక వృద్ధులకు ఇబ్బందులు
- ఎక్కువగా అనారోగ్య సమస్యలున్న వృద్ధులు, దివ్యాంగులు వంటి వారికి ఇంటి వద్దే పింఛన్ ఇస్తామన్న అధికారులు



ఒంగోలు 9వ డివిజన్‌లోని ఇందిరమ్మకాలనీ సచివాలయంలో పింఛన్‌దారులకు పింఛన్ నగదు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బాబు కుట్రలతో పండుటాకులు విలవిల

పింఛన్ కోసం సచివాలయాలకు వెళ్లొస్తూ ఒక్కరోజే 20 మంది మృత్యువాత

- వేసవి కావడంతో వడదెబ్బ. తీవ్ర అస్వస్థతకు గురవుతున్న వృద్ధులు
- చంద్రబాబు వల్లే తమకు ఈ అవస్థలు వచ్చాయని మండిపడుతున్న లబ్ధిదారులు
- తమ ఉసురు ఆయనకు తగులుతుందని శాపనార్థాలు.. చేయాల్సిందంతా చేసి టీడీపీ నేతల డ్రామాలు
- పాలకొల్లు, పెనమలూరుల్లో టీడీపీ అభ్యర్థులు నిమ్మల, బోడె ఓవరాక్షన్



కృష్ణా జిల్లా గంగూరులో వజ్రమ్మ మృతదేహం వద్ద టీడీపీ నేత బోడె ప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కుటుంబసభ్యులు

సీఎం జగన్ లేఖపై ఏం చేశారు?

విశాఖ ఉక్కుపై కేంద్రాన్ని ప్రశ్నించిన హైకోర్టు

- సీఎం లేఖను గౌరవించాల్సిందే
- సీఎం లేఖ రాస్తే స్పందించకపోవడం సరికాదు
- స్పందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది
- సీఎం లేఖను పక్కనపెట్టి నిద్రపోవడానికి వీల్లేదు
- మీ కౌంటర్‌లో ఎక్కడా సీఎం లేఖ ప్రస్తావన లేదేం?
- ఆ లేఖ విషయంలో ఏం చేశారో స్పష్టంగా చెప్పండి
- భూముల విక్రయంపై పూర్తి వివరాలతో అఫిడవిట్ వేయండి
- అసలు ఏ చట్టం కింద ప్రైవేటీకరణ చేస్తున్నారు?
- ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించారా?
- అసలు విశాఖ ఉక్కు చరిత్ర తెలుసా? అంటూ ధర్మాసనం ప్రశ్నల వర్షం
- మా సొంత డబ్బుతో కొన్న 25 ఎకరాలనే విక్రయిస్తామన్న 'ఆర్‌ఐఎన్‌ఎల్'





చిత్తూరు జిల్లా పూతలపట్టులో జరిగిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



బుధవారం కల్లూరులో నిర్వహించిన బస్సుయాత్రలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ధర్మాన్ని గెలిపించండి

విశ్వసనీయత, మోసం.. రెండింటిలో మీరు దేనివైపో ఆలోచించండి • పూతలపట్టు సభలో ప్రజలకు సీఎం వైఎస్ జగన్ పిలుపు

- మీ బిడ్డ ఒక్కడిపై వీరంతా యుద్ధం చేస్తున్నారు
- మంచి కోసం కుటుంబం అంతా కూర్చుని ఆలోచించండి
- మీ బ్యాంక్ ఖాతాల్లో స్టేట్ మెంట్ చూసుకోండి..
- ఎప్పుడూ జరగని విధంగా లబ్ధి కలిగుంటేనే నాకు మద్దతుగా నిలవండి

సాక్షి, తిరుపతి: 'విశ్వసనీయత ఒకవైపు, మోసం మరోవైపు.. నిజం ఒకవైపు, అబద్ధం మరో వైపు.. ఇంటింటి ప్రగతి ఒకవైపు, తిరోగమనం మరోవైపు.. ప్రతి ఇంట్లో అభివృద్ధి ఒకవైపు, అసూయ మరో వైపు.. మంచి ఓవైపు, చెడు మరో వైపు.. వెలుగు ఓ వైపు, చీకటి మరో వైపు.. ధర్మం ఓ వైపు, అధర్మం మరోవైపు.. ఇలా విశ్వసనీయత, మోసం అనే రెండింటిలో ఎటు వైపు మొగ్గాలన్న దానిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ధర్మాన్ని గెలిపించాలి' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను కోరారు. ఈ ఎన్నికలు జగన్‌కు, చంద్రబాబు నాయుడుకు మధ్య యుద్ధం కాదని, ఒక హేబిట్యువల్ అఫెండర్ అంటే ప్రజలను మోసం చేయడమే అలవాటుగా పెట్టుకున్న చంద్రబాబుకు, ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధమని చెప్పారు. ఈ యుద్ధంలో మీ బిడ్డ జగన్ ప్రజల పక్షం అని చెప్పడానికి గర్వపడుతున్నానన్నారు. బుధవారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాగిన మనమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా ఏడవ రోజు ఆయన చిత్తూరు జిల్లా పూతలపట్టులో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఇంటింటి ప్రగతి, ఇంటింటి అభివృద్ధి, ఇంటింటి మంచి, పిల్లల భవిష్యత్తు కోసం సత్యనిష్టతో ఉపయోగించి మనందరి ప్రభుత్వం ఓవైపు ఉంటే.. ఒకసారి కాదు.. గతంలో మూడుసార్లు అధికారంలో ఉన్నా కూడా.. అబద్ధం, మోసం, అన్యాయం, తిరోగమనం, చెడు, చీకటినే ప్రజలకు రిటర్న్ గిఫ్ట్‌గా ఇచ్చిన చంద్రబాబు బృందం మరోవైపున మన కళ్ల ఎదుటే కనిపిస్తోందన్నారు. ఈ యుద్ధంలో చంద్రబాబు, ఓ దత్త పుత్రుడు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, వీరందరూ కాక ఈ రాష్ట్రాన్ని విడగొట్టిన పార్టీ, ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా అన్యాయం చేసిన మరో పార్టీ ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్ర ప్రజలను వ్యతిరేకించే పక్షంగా చంద్రబాబు పక్షాన నిలిచారని చెప్పారు. మీ బిడ్డ ఒక్కడిపై వీరందరూ యుద్ధం చేస్తున్నారని, ఈ యుద్ధంలో ధర్మాన్ని గెలిపించడానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 175కు 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాలకు 25 ఎంపీ స్థానాలు గెలిపించుకుని డబుల్ సెంచరీ సర్కార్‌ను స్థాపిద్దామని చెప్పారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..



కల్లూరులో సీఎం జగన్‌కు హారతి ఇచ్చి, బొట్టు పెట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

మనది మనసున్న ప్రభుత్వం

- మీ బిడ్డ జగన్.. మీ గ్రామానికి, మీ ఇంటికి ఏం చేశాడన్నది ఏ గ్రామానికి, ఏ పట్టణానికి వెళ్లినా కనిపిస్తుంది. గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, నాడు–నేడుతో రూపురేఖలు మారిపోయిన ప్రభుత్వ పాఠశాల, ఇంగ్లిష్ మీడియం, విలేజ్ క్లినిక్.. ఫ్యామిలీ డాక్టర్.. ఆరోగ్య సురక్ష, ఇంటింటికీ పౌర సేవలు డోర్ డెలివరీ, ప్రతి నెలా ఒకటవ తేదీన అది సెలవు దినమైనా సరే, ఆదివారమైనా సరే.. అవ్వాతాతల ఇంటికే వెళ్లి తలుపుతట్టి చిరునవ్వుతో పింఛన్ ఇచ్చే వలంటీర్ వ్యవస్థ, ఉన్న ఊళ్లోనే అన్ని పనులు అయ్యేలా సచివాలయ వ్యవస్థ, మహిళా పోలీసు, దిశ యాప్.. ఇలా ఎన్నో కనిపిస్తాయి.
- ప్రతి గ్రామంలో ఏ ఇంట్లో ఎవరికి ఏ టెస్టులు కావాలన్నా, ఆ టెస్టులు ఉచితంగా చేయించి మందులు కూడా వాళ్ల చేతుల్లో పెట్టి ఏకంగా ఆరోగ్యశ్రీని రూ.25 లక్షల దాకా ప్రతి పేదవాడికీ అందుబాటులోకి తీసుకువచ్చింది మీ బిడ్డే. అక్కచెల్లెమ్మల పేరిట ఇచ్చిన 31 లక్షల ఇళ్ల పట్టాలతో అక్కడే నిర్మాణం అవుతున్న కాలనీలు చూస్తుంటే గుర్తుకొచ్చేది మీ బిడ్డ జగనే.
- మధ్యలో ఏ దళారి ప్రమేయం లేకుండా ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లో జమ చేశాం. లంచాలు, వివక్షకు చోటే లేదు. ఇలా 130 సార్లు బటన్ నొక్కి లబ్ధి చేకూర్చాం. ఇంతగా మేలు జరగడం తట్టుకోలేక చంద్రబాబు, ఆయన కూటమి, ఆయన పొత్తుల జెండాలు, ఆయన ఎల్లో మీడియా అసూయ పడుతోంది.

చంద్రముఖిని పెట్టెలో బిగిద్దాం

- మనం వేసే ఈ ఓటుతో మన తలరాతలు మారతాయి. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి విషయం చెప్పండి. జగనన్ననే మళ్లీ తెచ్చుకోవాలి.. జగనన్నే మళ్లీ వస్తే మళ్లీ వలంటీర్ నేరుగా మీ ఇంటికి వస్తాడు.. ప్రతి పథకం నేరుగా మీ ఇంటికే వస్తుంది.. అని చెప్పండి. ప్రతి ఇంట్లో నుంచి స్టార్ క్యాంపెయినర్లను బయటకు రావాలి. జరిగిన మంచి గురించి ప్రతి ఒక్కరూ మరో వంద మందికి చెప్పి రెండు బటన్లు ఫ్యాను మీద నొక్కేలా చూడాలి. చంద్రబాబు నాయుడు అనే చంద్రముఖిని పెట్టెలో బిగించి మళ్లీ లక లక లక అంటూ మన రక్తం తాగేందుకు రాకుండా జాగ్రత్త పడాలి.
- ఎన్నికల సంగ్రామంలో అబద్ధాన్ని, మోసాన్ని మట్టి కరిపించడానికి నేను సిద్ధం. మరి మీరంతా కూడా సిద్ధమా.. (సిద్ధమే అని కేకలు). అలాగైతే సెల్ ఫోన్లు బయటకు తీసి.. టార్చ్ లైట్ బటన్ ఆన్ చేయండి. (ప్రజలందరూ సెల్‌లో టార్చ్ లైట్ ఆన్ చేసి పైకి ఎత్తి చూపించారు).
- చిత్తూరు జిల్లా నుంచి మీ ఎంపీ అభ్యర్థి రెడ్డప్ప, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్, పలమనేరు ఎమ్మెల్యేగా వెంకటే గౌడ, చంద్రగిరి నుంచి భాస్కర్ రెడ్డి కొడుకు, యువకుడు, ఉత్సాహవంతుడు మోహిత్, జీడీ నెల్లూరు నుంచి మన డిప్యూటీ సీఎం నారాయణ స్వామి కూతురు కృపాలక్ష్మి, చిత్తూరు నుంచి విజయ్, నగరి నుంచి నా చెల్లెలు రోజమ్మ, కుప్పం నుంచి మీ వాడు, మీ లోకల్, మీ బీసీ సామాజిక వర్గానికి చెందినవాడు, నా తమ్ముడు భరత్‌ను ఆశీర్వదించి గెలిపించండి. భరత్‌కు కేబినెట్‌లో మంత్రి పదవి ఇచ్చి మీ అందరికీ మంచి చేయిస్తాను. మన గుర్తు ఫ్యాన్ అని మరచిపోవద్దు.

జెండాలు జత కట్టడమే వారి ఎజెండా

- చంద్రబాబు నాయుడు 2014లో కూడా మీ అందరి దగ్గరకు వచ్చాడు. కూటమి అన్నాడు. జెండాలు జత కట్టాడు. ఒక దత్తపుత్రుడిని, ఆయనతోపాటు ఢిల్లీకి వెళ్లి మోదీ గారిని తీసుకొచ్చాడు. అలవిగాని హామీలతో కూడిన ఈ పాంప్లెట్ (చూపిస్తూ) సంతకం పెట్టి మరీ ప్రతి ఇంటికీ పంపించాడు.
- రైతుల రుణ మాఫీపై మొదటి సంతకం అన్నాడు. రూ.87,612 కోట్లు.. రుణ మాఫీ చేశాడా? పొదుపు సంఘాల రుణాలు రూ.14205 కోట్లు మాఫీ అన్నాడు. ఒక్క రూపాయి అయినా చేశాడా? ఆడ బిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకు అంకౌంట్లో డిపాజిట్ చేస్తామన్నాడు. చేశాడా? ఇంటింటికీ ఉద్యోగం, ఉద్యోగం ఇవ్వలేకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి అన్నాడు. ఐదేళ్లలో నెలకు రూ.2 వేల చొప్పున రూ.1.20 లక్షలు ఇచ్చాడా?
- అర్హులైన వాళ్లందరికీ 3 సెంట్ల స్థలం ఇచ్చారా? రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాలన్నీ మాఫీ అన్నాడు.. చేశాడా? మహిళల రక్షణకు ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు జరిగిందా? రాష్ట్రాన్ని సింగపూర్‌ను మించి అభివృద్ధి చేస్తానన్నాడు. ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. ఇలా 650 హామీలు ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ అదే మోసం. అవే పొత్తులు. ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ మళ్లీ మోసం చేయడానికి వస్తున్నాడు. ఈ ముగ్గురూ కలిసి ఇంటింటికీ కేజీ బంగారం అంటున్నారు. ఇంటింటికీ బెంజ్ కారు కొనిస్తామంటున్నారు.

పచ్చ నోట్ల పంపిణీ కేంద్రాలు

- బాబు బృందం వ్యాపార సంస్థలే డంపింగ్ స్థావరాలు
- 'మార్గదర్శి' కేంద్రంగా అక్రమ నిధుల పంపిణీ
- నారాయణ విద్యా సంస్థల నుంచే నల్లధనం దందా





విశాఖలో స్వాధీనం చేసుకున్న మార్గదర్శి నగదు, బాపట్లలో పట్టుబడ్డ రాయల్ మెరైన్ కంపెనీ సొమ్ము

సాక్షి, అమరావతి: ప్రజాబలంతో ఎన్నికల్లో విజయం సాధించలేమని స్పష్టం కావడంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పచ్చ నోట్ల దందాకు తెరతీశారు. రూ.వేల కోట్లు వెదజల్లి ఎన్నికల్లో అక్రమాలకు బరి తెగించేందుకు సన్నద్ధమయ్యారు. దశాబ్దాలుగా తన కుట్ర రాజకీయాల్లో భాగస్వాములైన ఈనాడు రామోజీరావు, పొంగూరు నారాయణలతోపాటు టీడీపీ బడా బాబుల వ్యాపార సంస్థలనే నల్లధనం డంపింగ్ యార్డులుగా మార్చేశారు. విశాఖ నుంచి నెల్లూరు వరకు పచ్చనేతల షిప్పింగ్, ఆక్వా కంపెనీలను నల్లధనం కంటైనర్లకు గమ్యస్థానాలుగా చేసుకున్నారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు టీడీపీ తరలిస్తున్న నల్లధనం బాగోతం ఇప్పటికే రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, పోలీసుల సోదాల్లో బయటపడింది. కాకపోతే దొరికింది గోరంతే! గుట్టుచప్పుడు కాకుండా సిద్ధం చేసిన గిడ్డంగుల్లో టీడీపీ పెద్దలు గుట్టలు గుట్టలుగా అక్రమ నిధులు దాచిపెట్టినట్లు స్పష్టమవుతోంది.

కుట్రలకు 'మార్గదర్శి'

చంద్రబాబు రాజకీయ, ఆర్థిక కుట్రల్లో భాగస్వామి ఈనాడు రామోజీ మరోసారి నల్లధనం తరలింపు బాధ్యతను భుజానికెత్తుకున్నారు. మీడియా ముసుగులో నిత్యం ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వంపై బురద చల్లుతున్న ఆయన మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాలను టీడీపీ అక్రమ నిధుల తరలింపు కేంద్రాలుగా మార్చారు. రోజూ చిట్‌ఫండ్స్ కార్యాలయాల ద్వారా టర్నోవర్ ముసుగులో అక్రమ నిధులను చాప కింద నీరులా టీడీపీ అభ్యర్థులకు చేరవేస్తున్నారు. విశాఖలో ఎలాంటి పత్రాలు లేకుండా మార్గదర్శి కార్యాలయం నుంచి తరలిస్తున్న రూ.51.88 లక్షల నగదు, రూ.39.29 లక్షలు విలువ చేసే చెక్కులను తాజాగా పోలీసులు గుర్తించి జప్తు చేయడం తెలిసిందే. అయితే మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేంద్రంగా సాగుతున్న నల్లధనం దందాలో పట్టుబడిన ఈ మొత్తం సముద్రంలో కాకి రెట్ట లాంటిదే. ఆర్థిక అక్రమాల కోసం మార్గదర్శి చిట్‌ఫండ్స్ మొదటి నుంచి పక్కా పన్నాగంతో వ్యవహరిస్తోంది. డిజిటల్ చెల్లింపులు కాకుండా నగదు లావాదేవీలు నిర్వహిస్తోంది. విశాఖ బ్రాంచిలో మూడు రోజుల లావాదేవీల మొత్తాన్ని తాము తరలిస్తున్నట్లు సోదాల సందర్భంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది చెప్పారు. మూడు రోజులకే ఒక్క బ్రాంచిలో రూ.51.88 లక్షలు లావాదేవీల పేరుతో నల్లధనాన్ని తరలిస్తున్నారంటే ఏ స్థాయిలో అక్రమాలకు టీడీపీ సిద్ధపడిందో ఊహించవచ్చు. దీని ప్రకారం నెలకు రూ.5.10 కోట్లు వసూలు చేస్తున్నట్లే. రాష్ట్రంలోని 37 బ్రాంచిల ద్వారా నెలకు సగటున రూ.188.70 కోట్లు వసూలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. మే నెలలో నిర్వహించనున్న ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు జనవరి నుంచి ఈ విధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ద్వారా అక్రమ నిధులు తరలిస్తున్నట్లు భావిస్తున్నారు. ఇలా మార్గదర్శి కార్యాలయాల నుంచి రూ.వందల కోట్లను ఇప్పటికే గుట్టు చప్పుడు కాకుండా తరలించినట్లు స్పష్టమవుతోంది. 2022 నవంబరు నుంచి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో కొత్త చిట్టీలు వేయడం లేదు. అయినా సరే ఈ స్థాయిలో నగదు లావాదేవీలు నిర్వహిస్తుండటం వెనుక లోగుట్టు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల కమిషన్ రాష్ట్రంలోని 37 మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సోదాలకు ఆదేశించి నగదు లావాదేవీల రికార్డులను తనిఖీ చేస్తే అక్రమాల బాగోతం బట్టబయలవుతుందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

దొంగ ఓట్ల బడి 'నారాయణ'

మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణకు చెందిన నారాయణ విద్యా సంస్థలు ఎన్నికల అక్రమాల శిక్షణా కేంద్రాలుగా మారాయి. నారాయణ విద్యా సంస్థల్లో చదువులు ఎలా చెబుతారో తెలియదు కానీ ఓటర్లను ఎలా ప్రలోభాలకు గురి చేయాలి? నోట్లు పంచి ఓట్లు ఎలా కొనుగోలు చేయాలి? అనేది టీడీపీ శ్రేణులకు పక్కాగా బోధిస్తారు. 2014, 2019 ఎన్నికల్లో అక్రమ నిధుల తరలింపు కేంద్రాలుగా నారాయణ విద్యా సంస్థలే ప్రధాన పాత్ర పోషించాయన్నది బహిరంగ రహస్యం. టీడీపీ హయాంలో అమరావతిలో భూదందాలో నారాయణ 'ఎన్‌స్పైరా' నుంచే అక్రమ నిధులు తరలించారన్నది సీఐడీ దర్యాప్తులో ఇప్పటికే వెల్లడైంది. ఏపీ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఇటీవల నెల్లూరులోని ఎన్‌స్పైరా కార్యాలయాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఈ బాగోతం బట్టబయలైంది. నారాయణ విద్యా సంస్థల నిర్వహణ వ్యయం పేరిట అక్రమ నిధులు తరలిస్తున్నట్లు బయటపడింది. ఈదఫా ఎన్నికల్లో మరింత బరి తెగించారు. ఎన్‌స్పైరా ముసుగులో అక్రమ నిధుల పంపిణీకి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయడం పచ్చ పన్నాగానికి పరాకాష్ట. జిల్లా కేంద్రాల్లోని నారాయణ విద్యా సంస్థలు, వాటి కార్యాలయాల నుంచే టీడీపీ అభ్యర్థులకు అక్రమ నిధుల పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నారు. విద్యార్థులు చెల్లించిన ఫీజుల ముసుగులో చడీచప్పుడు కాకుండా కుట్రను అమలు చేసేందుకు ఉపక్రమించారు. నారాయణ విద్యా సంస్థల్లో విద్యార్థులు, వారు చెల్లించిన ఫీజుల వివరాలు, బ్యాంకుల్లో జమ చేస్తున్న మొత్తం, ఇతర వ్యయం పేరిట చూపిస్తున్న లెక్కలను పరిశీలిస్తే ఈ అక్రమాల గుట్టు రట్టు కావడం ఖాయం. ఎన్నికల కమిషన్ నారాయణ విద్యా సంస్థల్లో సమగ్రంగా సోదాలు నిర్వహించి రికార్డులు, బ్యాంకు ఖాతాలను తనిఖీలు చేయాలని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు.

తీరం వెంట అక్రమ నిధుల డంపింగ్ యార్డులు

రాష్ట్రానికి ఉన్న పొడవైన తీరప్రాంతాన్ని ఎన్నికల అక్రమాలకు చుక్కానిగా చేసుకోవాలని చంద్రబాబు కుట్ర పన్నారు. అందుకోసం విశాఖ నుంచి నెల్లూరు వరకు టీడీపీ బడాబాబులకు చెందిన షిప్పింగ్, ఆక్వా కంపెనీలను దొంగ నోట్ల కేంద్రాలుగా, అక్రమ నిధులను తరలించే కంటైనర్లుగా మార్చుకోవడం ఆయన బరి తెగింపు రాజకీయాలకు నిదర్శనం. బాపట్ల టీడీపీ అభ్యర్థి వేగ్నేశ నరేంద్ర వర్మకు చెందిన రాయల్ మెరైన్ కంపెనీ కంటైనర్లలో తరలిస్తున్న అక్రమ నిధులు మార్చి 28న పోలీసుల సోదాల్లో బయట పడటం గమనార్హం. విదేశాల్లోని టీడీపీ సానుభూతిపరుల నుంచి సేకరించిన నిధులను లావాదేవీల ముసుగులో కంటైనర్ల ద్వారా మన రాష్ట్రంలోని పోర్టులకు తరలించడం ఆ పార్టీ పెద్దల లక్ష్యం. విశాఖ, కాకినాడ, నెల్లూరులో చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన బడా బాబుల షిప్పింగ్ కంపెనీలు, ఆక్వా కంపెనీల గిడ్డంగులకు తరలించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చేరవేయాలని పన్నాగం పన్నారు. ఇప్పటికే విశాఖపలోని ఓ షిప్పింగ్ కంపెనీ యజమానికి చెందిన గిడ్డంగులు అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలకు అక్రమ నిధుల పంపిణీ కేంద్రాలుగా మారాయి. విశాఖ, భీమిలీ తీరప్రాంతంలోని టీడీపీకి బడాబాబుకు చెందిన ఓ హేచరీస్ కంపెనీ స్థావరంగా ఉత్తరాంధ్ర అంతటా అక్రమ నిధులు తరలించేందుకు కుట్ర పన్నుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అదే రీతిలో కాకినాడ జిల్లాలో టీడీపీ అభ్యర్థి ఒకరు తీరప్రాంతంలోని హేచరీలు, ఆక్వా కేంద్రాలు అడ్డాగా అక్రమ నిధులు తరలింపును పర్యవేక్షిస్తున్నారు. నెల్లూరు కేంద్ర స్థానంగా గ్రేటర్ రాయలసీమ జిల్లాల్లో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు టీడీపీ తెరతీసింది.

రాష్ట్రమంతా పర్చూరు మోడల్

ఎన్నికల్లో రూ.వేల కోట్లను వెదజల్లడమే కాకుండా క్షేత్రస్థాయిలో ఓటర్లను ప్రభావితం చేసే పన్నాగాన్ని పక్కాగా పర్యవేక్షించాలని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. 2019 ఎన్నికల్లో పర్చూరు నియోజకవర్గంలో అమలు చేసిన పథకాన్ని ఈసారి మరింత పకడ్బందీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలన్నది ఆయన కుతంత్రం. పర్చూరు టీడీపీ ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు గత ఎన్నికల్లో పాల్పడిన అక్రమాలు ఇటీవల డీఆర్ఐ సోదాల్లో వెలుగులోకి వచ్చాయి. మండలాలు, పంచాయతీలవారీగా ఓటర్లకు పంపిణీ చేయాల్సిన విధానం, ఇతర ప్రాంతాల నుంచి దొంగ ఓటర్లను రప్పించడం, అందుకోసం నిధుల వ్యయం, ఓట్ల కొనుగోలు, దొంగ ఓట్ల పర్యవేక్షణకు వివిధ స్థాయిలో బాధ్యుల నియామకం తదితరాలతో ఓ బ్లూప్రింట్‌ను రూపొందించి ఎమ్మెల్యే సాంబశివరావు అమలు చేశారు. తన వ్యాపార సంస్థ నోవా అగ్రిటెక్ ఆర్థిక వ్యవహారాల ముసుగులో ఆ కుతంత్రాన్ని అమలు చేశారు. అదే రీతిలో బ్లూప్రింట్‌ను టీడీపీ ప్రధాన కార్యాలయం నుంచి అన్ని నియోజకవర్గాలకు పంపి కుట్రను పక్కాగా అమలు చేయాలన్నది చంద్రబాబు పన్నాగం. అందుకోసం మార్గదర్శి చిట్‌ఫండ్స్, నారాయణ విద్యా సంస్థలు, టీడీపీ బడాబాబులకు చెందిన షిప్పింగ్, ఆక్వా, ఇతర కంపెనీలను వాడుకోవాలని కుతంత్రం రచించారు. చంద్రబాబు, లోకేశ్, రామోజీ, నారాయణ, పచ్చ కోటరీలోని ఇతర ముఖ్యులు సర్వం తామై ఈ ఎన్నికల కుతంత్రం పర్యవేక్షణ బాధ్యతలు తీసుకోవడం గమనార్హం. ఎన్నికల్లో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడటం, రూ.వేల కోట్లు వెదజల్లడం, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, అవసరమైతే భయోత్పాతం సృష్టించేందుకు చంద్రబాబు, ఎల్లో గ్యాంగ్ సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో పచ్చ ముఠా అక్రమ నోట్ల గిడ్డంగులపై వెంటనే దాడులు నిర్వహించేలా ఎన్నికల కమిషన్ క్రియాశీలం కావడం ఒక్కటే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్షని పరిశీలకులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీలో మళ్లీ జగన్‌దే సర్కారు

- టీడీపీ అధినేత చంద్రబాబు పని అయిపోయింది
- బీజేపీతో పొత్తు పెట్టుకొని ఆయన తప్పు చేశాడు
- కాంగ్రెస్‌లోకి రావాలని మాకూ ఆహ్వానాలు అందాయి
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



సాక్షి, హైదరాబాద్: ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరో మారు ముఖ్యమంత్రి కావడం ఖాయమని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ వ్యాఖ్యానించారు. ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు పని అయిపోయిందని, బీజేపీతో పొత్తు పెట్టుకొని ఆయన చాలా తప్పు చేశాడన్నారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పుట్టిన టీడీపీ, అదే కాంగ్రెస్‌తో తెలంగాణలో పొత్తు పెట్టుకోవడంతో కనుమరుగైంది. ఇప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా చంద్రబాబు తప్పు చేశాడు. జాతీయపార్టీలతో పొత్తులు పెట్టుకున్న ప్రాంతీయ పార్టీలేవీ తర్వాతి కాలంలో మనుగడ సాధించిన దాఖలాలు లేవు. పొత్తు తర్వాత జతగూడిన పార్టీలను మింగేస్తాయి' అని మాగంటి అన్నారు.

చిల్లర కేసుల భయంతోనే కాంగ్రెస్‌లోకి దానం

'ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మీద అనేక చిల్లర కేసులు ఉన్నాయి. వాటికి భయపడే ఆయన కాంగ్రెస్‌లో చేరాడు. నాతో పాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్‌ను కూడా కాంగ్రెస్‌లోకి తీసుకొస్తానని దానం నాగేందర్ హామీ ఇచ్చారట. గతంలో రేవంత్ జైలుకు వెళ్లిన సందర్భంలో ఆయనకు అన్ని సపర్యలు నేనే చేశాను. కాంగ్రెస్‌లోకి రమ్మని నాకూ ఆహ్వానం అందింది. దేశంలో పార్టీ ఫిరాయింపులు సహా అన్ని రకాల అక్రమాలకు బాటలు వేసిందే కాంగ్రెస్ పార్టీ. నా రాజకీయ జీవితమంతా కాంగ్రెస్ భావజాలానికి వ్యతిరేకంగానే సాగుతూ వస్తోంది. కాంగ్రెస్‌లోకి అసలే వెళ్లను. తెలంగాణలో చంద్రబాబు టీడీపీని మూసివేశారని తెలిసిన తర్వాతే నేను బీఆర్‌ఎస్‌లో చేరా. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారుతున్నారనేది కేవలం మీడియా ప్రచారం మాత్రమే. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ బీఆర్‌ఎస్, బీజేపీ నడుమ నెలకొంది. సికింద్రాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల్లోనూ బీఆర్‌ఎస్ గెలవబోతోంది' అని ఎమ్మెల్యే గోపీనాథ్ చెప్పారు.

తైవాన్‌లో తీవ్ర భూకంపం

రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదు

- ధ్వంసమైన పలు భవనాలు, వంతెనలు, సొరంగాలు
- 9 మంది మృతి.. 934 మందికి గాయాలు
- బొగ్గు గనుల్లో చిక్కుకున్న 70 మంది కార్మికులు
- సునామీ హెచ్చరికలు జారీ... తర్వాత ఉపసంహరణ



బుధవారం తైవాన్‌ను అతలాకుతలం చేసిన భూకంపం ధాటికి ఒరిగిపోయిన భవనం

తైపీ: ద్వీప దేశం తైవాన్‌లో శక్తివంతమైన భూకంపం సంభవించింది. బుధవారం ఉదయం 8 గంటలకు చోటుచేసుకున్న భూప్రకంపనల వల్ల పలు భవనాలు ధ్వంసమయ్యాయి. 9 మంది మరణించారు. మరో 934 మంది క్షతగాత్రులుగా మారారు. ఈ భూకంపం రిక్టర్ స్కేల్‌పై 7.2గా నమోదైనట్లు తైవాన్ భూకంప పర్యవేక్షక ఏజెన్సీ ప్రకటించగా, 7.4గా నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. దేశావ్యాప్తంగా భూకంప ప్రభావం కనిపించింది. రాజధాని తైపీకి 150 కిలోమీటర్ల దూరంలో తైవాన్ తూర్పు తీరంలో ఉన్న హౌలీన్ కౌంటీకి 18 కిలోమీటర్ల దూరంలో 35 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం కేంద్రీకృతమైనట్లు అధికారులు వెల్లడించారు. భూకంపం కారణంగా దేశవ్యాప్తంగా రైలు సర్వీసులను రద్దు చేశారు. సెల్‌ఫోన్ సేవలు నిలిచిపోయాయి. తొలుత సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తర్వాత ఎత్తివేశారు. దేశంలో గత 25 ఏళ్లలో ఇదే అతిపెద్ద భూకంపమని చెబుతున్నారు. భూప్రకంపనల వల్ల పునాదులు ధ్వంసం కావడంతో పలు భవనాలు 45 డిగ్రీల మేర పక్కకు ఒరిగిపోయిన దృశ్యాలు కనిపించాయి. బలహీనంగా ఉన్న పాత భవనాలు కూలిపోయాయి. పాఠశాలల నుంచి విద్యార్థులను బయటకు పంపించారు. భూకంపం సంభవించగానే సహాయక సిబ్బంది రంగంలోకి దిగారు. ధ్వంసమైన ఇళ్ల నుంచి వృద్ధులు, చిన్నారులను బయటకు తీసుకొచ్చారు. భూకంపం, ఆ తర్వాత చోటుచేసుకున్న ప్రకంపనల కారణంగా 24 చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. 35 రోడ్లు, వంతెనలు, సొరంగాలు దెబ్బతిన్నాయి. భారీగా ఆస్తి నష్టం జరిగింది. నేషనల్ పార్కులో ఓ బస్సులో ప్రయాణిస్తున్న 50 మందితో సంబంధాలు తెగిపోయాయని అధికారులు పేర్కొన్నారు. అలాగే రెండు బొగ్గు గనుల్లో 70 మంది కార్మికులు చిక్కుకుపోయారని తెలిపారు. వారి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని వివరించారు.



జపాన్, చైనాలోనూ ప్రకంపనలు

జపాన్ దక్షిణ ప్రాంతంలోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. జపాన్‌లో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. యొనాగుని, ఇషికాగి, మియాకో దీవుల్లో సముద్రపు అలలు పోటెత్తాయి. బుధవారం మధ్యాహ్నం తర్వాత సునామీ హెచ్చరికలను ఉపసంహరించారు. తైవాన్, చైనా మధ్య దూరం 160 కిలోమీటర్లు ఉంటుంది. బుధవారం చైనాలోని షాంఘైతోపాటు ఆగ్నేయ తీరంలోని పలు ప్రావిన్స్‌ల్లో సైతం భూప్రకంపనలు సంభవించాయని స్థానిక మీడియా తెలియజేసింది.

భూ విలయాల గడ్డ తైవాన్

కంప్యూటర్ చిప్‌ల తయారీకి, అత్యాధునిక టెక్నాలజీకి పేరుగాంచిన తైవాన్‌లో తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్'లో ఉండడమే ఇందుకు కారణం. ఈ ప్రాంతంలో భూ అంతర్భాగంలో సర్దుబాట్లు ఎక్కువగా జరుగుతుంటాయి. హౌలీన్ కౌంటీలో 2018లో తీవ్రమైన భూకంపం సంభవించింది. అప్పట్లో 17 మంది మరణించారు. 1999 సెప్టెంబర్ 21న తైవాన్‌లో సంభవించిన భూకంపం రిక్టర్ స్కేల్‌పై 7.7గా నమోదైంది. ఈ భూవిలయం 2,400 మందిని బలితీసుకుంది. లక్ష మందికిపైగా గాయపడ్డారు. వేలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. భూకంపాల విపత్తులను సమర్థంగా ఎదుర్కొనే యంత్రాంగం తైవాన్‌లో ఉంది.

4.5 కేజీలు తగ్గిన కేజ్రీవాల్

ఆయన ప్రాణాలతో బీజేపీ చెలగాటం • ఆప్ మండిపాటు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్‌చేసిన రోజు నుంచి కేజ్రీవాల్ ఇప్పటి దాకా 4.5 కేజీల బరువు తగ్గారని ఆప్ నాయకురాలు, ఢిల్లీ మంత్రి అతిశి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'కేజ్రీవాల్, ఆప్‌ను అణిచేసేందుకు బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది. కస్టడీలో వున్న కేజ్రీవాల్‌కు ఏమైనా జరిగితే దేశం కాదు ఆ దేవుడు కూడా బీజేపీని క్షమించడు. ఆయనను బీజేపీ జైలులో పడేసి ఆయన ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. చక్కెర స్థాయి భారీగా పడిపోవడంతో కేజ్రీవాల్ ఆరోగ్యానికి ముప్పు ఏర్పడింది. ఈడీ కస్టడీలో ఉన్నప్పుడూ మూడు సార్లు ఆయన ఆరోగ్యం క్షీణించింది. ఒక సారి చక్కెర స్థాయిలు ఏకంగా 46కు పడిపోయింది. ఇది ఎంతటి వ్యక్తికైనా ప్రాణాంతకం' అని అతిశి అన్నారు. ''సీఎం ఆరోగ్య పరిస్థితిపై చట్టపరమైన సాయం కోరతాం' అని అన్నారు. అయితే ఈ వాదనలతో తిహార్ జైలు యంత్రాంగం విభేదిస్తోంది. 'ఆయన జైలుకు వచ్చినపుడు 65 కేజీలు ఉన్నారు. ఇప్పుడూ అదే బరువున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. ఇంటి భోజనమే అందిస్తున్నాం' అని అన్నారు. దీనిపై అతిశి మాట్లాడారు. '' జైలుకు వెళ్లేటప్పటికి ఆయన బరువు 69.5 కేజీలు. ఇప్పుడు 65 కేజీలు. ఇది రికార్డుల్లో నమోదైంది. సీఎం స్థాయి వ్యక్తి ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య వైఖరి ఏమాత్రం పనికిరాదు' అని అన్నారు. బుధవారం ఉదయం సైతం కేజ్రీవాల్ ఒంట్లో చక్కెర స్థాయిలో తక్కువగానే నమోదయ్యాయి. షుగర్ లెవెల్స్ తరచూ మారుతున్నాయని అధికారులు వెల్లడించడం గమనార్హం.

సీజేఐ కళ్ల ముందే గొంతు కోసుకున్నాడు!

కర్ణాటక హైకోర్టులో కలకలం

బెంగళూరు: కర్ణాటక హైకోర్టులో బుధవారం రక్తం చిందింది. మైసూరుకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి ఒకటో నంబర్ కోర్టు హాల్లో ఏకంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నీలాయ్ విపిన్‌చంద్ర అంజారియా కళ్లెదుటే గొంతు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు! దాంతో అంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. భద్రతా సిబ్బంది అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కారణం తెలియరాలేదు. భద్రతా వైఫల్యంపై సీజే ఆగ్రహించారు. ''కోర్టు హాలులోకి కత్తితో ఎలా వచ్చాడు? తనిఖీలు చేయడం లేదా?'' అంటూ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. అతన్నుంచి సమగ్ర వివరాలు రాబట్టాలని పోలీసులను సీజే ఆదేశించారు. గొంతు కోసుకోవడానికి ముందు సిబ్బందికి అతనిచ్చిన ఫైల్‌ను నిర్దేశించిన లాయర్‌కివ్వాలని సూచించారు.

54 మందికి రాజ్యసభ వీడ్కోలు

ముగిసిన మన్మోహన్ మూడు దశాబ్దాల ఇన్నింగ్స్

న్యూఢిల్లీ: రాజ్యసభలో 54 మంది సభ్యుల కాలపరిమితి ముగిసిపోయింది. వీరిలో మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ కూడా ఉన్నారు. ఈయన స్థానంలో రాజస్థాన్ నుంచి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ మొట్టమొదటిసారిగా ఎగువ సభలో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టబోతున్నారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన వారిలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, పశు సంవర్థక, మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా, ఐటీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, సహాయ మంత్రి వి.మురళీధరన్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి నారాయణ్‌రాణె, పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ ఉన్నారు. 49 మంది మంగళవారం రిటైర్‌కాగా, ఐదుగురు బుధవారం రిటైర్ అయ్యారు. కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీ సైతం రిటైర్ అయ్యారు. ఈయనకు పార్టీ మరోసారి అవకాశం ఇచ్చినప్పటికీ హిమాచల్ ప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎన్నికల్లో అనూహ్యంగా ఓడిపోవడంతో ఇంకోసారి పెద్దలసభలో అడుగుపెట్టే చాన్స్ కోల్పోయారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి బాటలో పయనింపజేసిన మన్మోహన్ 1991 అక్టోబర్‌లో తొలిసారిగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. మరోవైపు కొత్తగా ఎన్నికైన 12 మంది నూతన సభ్యులతో బుధవారం రాజ్యసబ చైర్మన్ జగదీప్ ధన్‌కఢ్ ప్రమాణం చేయించారు. ధర్మశీల గుప్తా, మనోజ్ కుమార్ ఝా, సంజయ్ యాదవ్, గోవింద్ భాయ్ లాల్జీభాయ్ ధోలకియా, సుభాష్ చందర్, హర్ష్ మహాజన్, జీసీ చంద్రశేఖర్, ఎల్.మురుగన్, అశోక్ సింగ్, చంద్రకాంత్ హండోరె, మేధా విశ్రమ్ కుల్‌కర్ణి, సాధనా సింగ్‌లు ప్రమాణంచేశారు. వీరిలో ఏడుగురు బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్, ఇద్దరు ఆర్జేడీ నుంచి ఉన్నారు.



చాయ్‌వాలీ దీదీ

ఎన్నికల వి-చిత్రం

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పశ్చిమబెంగాల్‌లోని జల్‌పాయ్‌గురిలో తృణమూల్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ ఓ స్థానిక టీ కొట్టులో చాయ్ చేసి అలరించారు. అనంతరం ఇలా స్వయంగా కప్పుల్లో పోసి మరీ అందరికీ అందించారు.

ఎలక్షన్ బీట్

రికార్డులు బద్దలు కొట్టాల్సిందే: మోదీ

లక్నో: దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల ఉత్సాహాన్ని, ఆత్మస్థైర్యాన్ని చూసి ప్రతిపక్షాలకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించాలని, పాత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టేలా కష్టపడి పని చేయాలని పార్టీ నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కొత్త రికార్డులు సృష్టించడమే మన లక్ష్యం కావాలన్నారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లో 10 లోక్‌సభ స్థానాల పరిధిలోని 22,648 పోలింగ్ బూత్‌లకు చెందిన బీజేపీ శ్రేణుల డిజిటల్ ర్యాలీని ఉద్దేశించి 'నమో' యాప్ ద్వారా ప్రధాని మోదీ ప్రసంగించారు. ఎన్నికల్లో విజయం పోలింగ్‌బూత్ స్థాయిలో సాధించే విజయంపై ఆధారపడి ఉంటుందన్నారు. పోలింగ్ బూత్‌లో నెగ్గకపోతే ఎన్నికల్లో నెగ్గలేమని స్పష్టం చేశారు. రాబోయే సార్వత్రి ఎన్నికల్లో పోలింగ్ బూత్ స్థాయిల్లో రికార్డులను బద్దలు కొట్టేలా పని చేయడం అని కార్యకర్తలకు సూచించారు.

బీజేపీ ఆటలు సాగనివ్వం: రాహుల్

మరోసారి వయనాడ్ నుంచి పోటీకి నామినేషన్ దాఖలు




నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న రాహుల్. చిత్రంలో ఆయన సోదరి ప్రియాంక

వయనాడ్: భారత ప్రజాస్వామ్య లక్షణాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి రాహుల్ గాంధీ శ్రీకారం చుట్టారు. బుధవారం కేరళలోని వయనాడ్‌లో భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు రాబోయే ఎన్నికల్లో మళ్లీ వయనాడ్ నుంచి పోటీ చేయడానికి నామినేషన్ దాఖలు చేశారు. తన సోదరి ప్రియాంకాగాంధీ వాద్రా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్‌తో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఆ తర్వాత రోడ్‌షోలో మాట్లాడుతూ.. బీజేపీపై నిప్పులు చెరిగారు. రాబోయే ఎన్నికలు దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న యుద్ధమని అభివర్ణించారు. మన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడానికి కాచుకొని కూర్చున్న శక్తులు ఒకవైపు, వాటిని పరిరక్షించుకోవడానికి పోరాడుతున్న పార్టీలు మరోవైపు మోహరించి ఉన్నాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వేస్తున్న ఎత్తులను విపక్ష 'ఇండియా' కూటమి చిత్తు చేయడం తథ్యమని తేల్చిచెప్పారు. వయనాడ్ ప్రజలకు అండగా నిలుస్తానని, వారి సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

బీజేపీలో చేరుతున్నా: సుమలత

మండ్య(కర్ణాటక): కమలదళంలో త్వరలో చేరబోతున్నట్లు మండ్య స్వతంత్ర ఎంపీ, ప్రముఖ నటి సుమలతా అంబరీశ్ బుధవారం ప్రకటించారు. అయితే ఈసారి మండ్య ఎంపీ స్థానం నుంచి పోటీ చేయట్లేనని స్పష్టంచేశారు. బుధవారం మండ్యలో సుమలత మాట్లాడారు. ' మండ్యను విడిచివెళ్లేది లేదు. మీ కోసం పనిచేస్తూనే ఉంటా. నా అవసరం లేదన్న కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లను. స్వతంత్ర ఎంపీగా గెలిచినా నాకు ప్రతి దశలో బీజేపీ నాయకులు అండగా నిలిచారు. రాజకీయంగా వేరే ఏ ఇతర నిర్ణయం తీసుకోవద్దని ప్రధాని మోదీ నన్ను కోరారు. అది నిజమైన నాయకత్వం. నాకు ఇచ్చిన నిజమైన గౌరవం. మోదీ నాయకత్వం అద్భుతం. అలాంటి నాయకుడిని అభినందించాలి. అందుకే బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నా' అని సుమలత చెప్పారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి విజేందర్



న్యూఢిల్లీ: గత సార్వత్రిక ఎన్నికలకు ముందు కాంగ్రెస్ కండువా కప్పుకున్న ప్రముఖ బాక్సర్, భారత తొలి ఒలంపిక్ గోల్డ్ మెడలిస్ట్ విజేందర్ సింగ్ బుధవారం బీజేపీలో చేరారు. మోదీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశ, విదేశాల్లో భారతీయ క్రీడాకారుల పట్ల అందరికీ గౌరవం మరింత పెరిగిందన్నారు. ఆయన గతంలో కేంద్రానికి వ్యతిరేకంగా రైతు ఉద్యమానికి మద్దతివ్వడంతోపాటు మహిళా రెజ్లర్ల నిరసనల్లో పాల్గొని మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించడం తెల్సిందే. సోషల్ మీడియాలోనూ బీజేపీ వ్యతిరేక పోస్టులు పెట్టేవారు.


లోక్‌సభ బరి నుంచి తప్పుకున్న అబ్దుల్లా

శ్రీనగర్: అనారోగ్య సమస్యలతో లోక్‌సభ ఎన్నికల సమరం నుంచి వైదొలగాలని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, శ్రీనగర్ సిట్టింగ్ ఎంపీ ఫరూక్ అబ్దుల్లా నిర్ణయించుకున్నారు. ఆయన కుమారుడు, పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా బుధవారం ఈ మేరకు వెల్లడించారు.

దేవభూమిలో ఈసారీ... కమల వికాసమే!

స్టేట్ స్కాన్

ఉత్తరాఖండ్‌లో కొన్నేళ్లుగా బీజేపీదే హవా • రెండు ఎన్నికల్లోనూ స్వీప్ • ఈసారి సత్తా చాటేందుకు కాంగ్రెస్ యత్నం





హిమాలయ పర్వత సిగలో బద్రీనాథ్, కేధార్‌నాథ్ వంటి ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రాలకు నెలవైన 'దేవభూమి' ఉత్తరాఖండ్. 2000 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ నుంచి విడిపోయి ఉత్తరాంచల్‌గా ఏర్పాటైన ఈ రాష్ట్రం పేరు 2006లో ఉత్తరాఖండ్‌గా మారింది. ఇక్కడి రాజకీయాల్లో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెసే చక్రం తిప్పుతున్నాయి. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలకంగా నిలిచిన ఉత్తరాఖండ్ క్రాంతి దళ్ (యూకేడీ), బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) కూడా కాస్త ప్రభావం చూపుతున్నాయి. పదేళ్లుగా ఉత్తరాఖండ్ పూర్తిగా కాషాయమయమైంది. అటు అసెంబ్లీలో, ఇటు లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ హవాయే నడుస్తోంది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన కమలనాథులు ఈసారి హ్యాట్రిక్ కోసం ఉవ్విళ్లూరుతున్నారు. ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఉత్తరాఖండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన నాటి నుంచి బీజేపీ, కాంగ్రెస్ మధ్య అధికారం చేతులు మారింది. 2012 నుంచీ మాత్రం రాష్ట్రం బీజేపీ గుప్పిట్లోనే ఉంది. 2002లో కొత్త రాష్ట్రంలో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీ తివారీ సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టింది. ఉత్తరప్రదేశ్‌కు మూడుసార్లు సీఎంగా చేసిన ఆయన రెండు రాష్ట్రాల్లోనూ సీఎం పదవి చేపట్టిన తొలి, ఏకైక నేతగా చరిత్ర సృష్టించారు. 2007లో ఉత్తరాఖండ్‌లో మళ్లీ బీజేపీ అధికారం దక్కించుకుంది. 2012 ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుచుకుంది. బీఎస్పీ, యూకేడీ, స్వతంత్రుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. విజయ్ బహుగుణ, హరీశ్ రావత్ రూపంలో ఆ ఐదేళ్లలో ఇద్దరు సీఎంలను మార్చింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల తిరుగుబాటు, రాష్ట్రపతి పాలన, సుప్రీంకోర్టు ఆదేశాలతో రావత్ విశ్వాస పరీక్షలో నెగ్గడం వంటి నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 5 సీట్లను దక్కించుకున్న బీజేపీ 2017 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బంపర్ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. మొత్తం 70 సీట్లలో ఏకంగా 57 స్థానాలను కొల్లగొట్టింది! 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ కాషాయ పార్టీ మరోసారి క్లీన్ స్వీప్ చేసింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాస్త మెజారిటీ తగ్గినప్పటికీ 47 సీట్లతో మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకుంది. 19 సీట్లతో కాంగ్రెస్ కాస్త పుంజుకుంది. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పూర్వ వైభవం కోసం వ్యూహరచన చేస్తోంది. రాష్ట్రంలోని 5 ఎంపీ సీట్లలో ఒకటి ఎస్సీ రిజర్వుడు స్థానం.

సర్వేలు ఏం చెబుతున్నాయి...

రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి ఆధిపత్యంతో బీజేపీ మంచి జోరు మీదుంది. అయోధ్య రామమందిర నిర్మాణం, హిందుత్వ, మోదీ ఫ్యాక్టర్, అభివృద్ధి నినాదాలతో హోరెత్తిస్తోంది. కాంగ్రెసేమో ఇండియా కూటమి దన్నుతో మొత్తం ఐదు స్థానాల్లో సింగిల్‌గా పోటీ చేస్తోంది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, కార్పొరేట్లతో మోదీ సర్కారు కుమ్మక్కు వంటివాటిని ప్రచారాస్త్రాలుగా చేసుకుంది. కులగణన, సంక్షేమ పథకాలు, యువతకు ఉద్యోగాలు వంటి హామీలను గుప్పిస్తోంది. అయితే సర్వేలు మాత్రం బీజేపీకే జై కొడుతున్నాయి. ఈసారి కూడా 5 సీట్లూ గెలుచుకుని హ్యాట్రిక్ కొడుతుందని అంచనా వేస్తున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడి కన్నుమూత



కారకాస్ (వెనెజులా): ప్రపంచంలోనే అత్యంత వృద్ధ వ్యక్తిగా గిన్నిస్ రికార్డుకెక్కిన వెనెజులాకు చెందిన 114 ఏళ్ల జువాన్ విసెంటీ పెరీజ్ మోరా మంగళవారం మరణించారు. ఆయనకు ఆరుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. ఏకంగా 41 మంది మనవలు, మనవరాళ్లు, 18 మంది మునిమనవలు, మనవరాళ్లున్నారు! ఆ తర్వాత తరంలోనూ ఇంకో 12 మంది వారసులుండటం విశేషం. జువాన్ 1909 మే 27న పుట్టారు. చనిపోయేదాకా పొలంలో పనిచేశారు. బాల్యం నుంచీ రోజూ పొలం పని, త్వరగా నిద్రపోవడం, రోజూ ఒక మద్యం తన దీర్ఘాయు రహస్యమనేవారు!

సుప్రీంకోర్టులో సింగిల్ మాల్ట్ ఎపిసోడ్

నవ్వులు పూయించిన మద్యం సంగతులు

న్యాయవాది ద్వివేదిపై సీజేఐ చెణుకులు

మద్యం కేసు విచారణలో సరదా చర్చ



న్యాయవాది ద్వివేది, సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్

న్యూఢిల్లీ: సంక్లిష్టమైన కేసులపై సీరియస్‌గా విచారణ జరిగే సుప్రీంకోర్టులో సరదా సన్నివేశం చోటుచేసుకుంది. విస్కీ, దాని రకాలు తదితరాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, సీనియర్ న్యాయవాది దినేశ్ ద్వివేది మధ్య జరిగిన ఆసక్తికరమైన సంభాషణ నవ్వులు పూయించింది. సీజేఐ హాస్య చతురత అందరినీ అలరించింది. పారిశ్రామిక ఆల్కహాల్ ఉత్పత్తి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలకు సంబంధించిన వివాదంపై సీజేఐ నేతృత్వంలోని 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందు జరిగిన విచారణ ఇందుకు వేదికైంది. ఈ కేసులో యూపీ తరఫున వాదిస్తున్న ద్వివేది తెల్ల జుట్టు రంగులమయంగా కన్పించడంపై జస్టిస్ చంద్రచూడ్ సరదాగా ఆరా తీశారు. హోలీ సంబరాలు కాస్త శ్రుతి మించడమే కారణమంటూ ద్వివేది కూడా అంతే సరదాగా బదులిచ్చారు. ''ఈ విషయంలో దయచేసి నన్ను క్షమించాలి. నా మనవల నిర్వాకం కూడా ఇందుకు కొంతవరకు కారణమే. సంతానం, మనవలు మరీ ఎక్కువగా ఉంటే, అందులోనూ వారంతా మనతో పాటే ఉంటుంటే ఇలాంటి గమ్మత్తైన సమస్యలుంటాయి. తప్పించుకోలేం'' అన్నారు. సీజేఐ అంతటితో వదల్లేదు. 'అంతేగానీ, ఆల్కహాల్‌కు ఏ సంబంధమూ లేదంటారు!' అంటూ చెణుకులు విసిరారు. విస్కీప్రియుడైన ద్వివేది అందుకు చిరునవ్వులు చిందించారు. ''విస్కీ పాత్ర కూడా ఉందని నేను ఒప్పుకుని తీరాలి. హోలీ అంటేనే ఆల్కహాల్ పార్టీలు. పైగా నేను విస్కీకి వీరాభిమానిని'' అనడంతో అంతా గొల్లుమన్నారు. సింగిల్ మాల్ట్ విస్కీ విషయంలో ఇంగ్లండ్‌లో తనకెదురైన గమ్మత్తైన అనుభవాన్ని విచారణ సందర్భంగా ద్వివేది ఏకరువు పెట్టారు. ''నేను సింగిల్ మాల్ట్ విస్కీనే ఇష్టపడతా. ఆ విస్కీకి స్వర్గధామంగా చెప్పదగ్గ ఎడింబర్గ్ వెళ్లానోసారి. సింగిల్ మాల్ట్ తెప్పించుకుని ఐస్‌క్యూబ్స్ వేసుకోబోతుంటే వెయిటర్ అడ్డుకున్నాడు. 'ఇదేం పని! అది సింగిల్ మాల్ట్ విస్కీ. దాన్నలాగే నేరుగా ఆస్వాదించాలి. అంతే తప్ప ఇలా ఐస్‌క్యూబులూ సోడాలూ కలపొద్దు! పైగా దానికంటూ ప్రత్యేకమైన గ్లాస్ ఉంటుంది. అందులో మాత్రమే తాగాలి' అంటూ సుదీర్ఘంగా క్లాస్ తీసుకున్నాడు. సింగిల్ మాల్ట్ తాగేందుకు ఇంత తతంగం ఉంటుందని అప్పుడే నాకు తెలిసొచ్చింది'' అంటూ వాపోయారు. దాంతో న్యాయమూర్తులతో పాటు కోర్టు హాల్లో ఉన్నవాళ్లంతా పడీ పడీ నవ్వారు. ధర్మాసనంలోని మిగతా న్యాయమూర్తులు కూడా తమ చెణుకులతో ఈ సరదా సన్నివేశాన్ని మరింత రక్తి కట్టించారు. పారిశ్రామిక ఆల్కహాల్‌తో పాటు విస్కీ, వోడ్కా వంటివి కూడా రాష్ట్రాల నియంత్రణ పరిధిలోకే వస్తాయంటూ ద్వివేది వాదించడంతో ఒక న్యాయమూర్తి కల్పించుకున్నారు. ''ఇంతకీ మీరనేదేమిటి? ఆల్కహాల్ మందుబాబులకు కిక్కిచ్చినా, ఇవ్వకపోయినా రాష్ట్రాల ఖజానాకు మాత్రం కిక్కివ్వాల్సిందేనంటారా?'' అనడంతో నవ్వులు విరిశాయి. ఇంకో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ, ''కొన్ని రకాల మద్యం రుచి కాలం గడిచేకొద్దీ పెరుగుతుందని, కొన్ని తేలిక రంగులోనూ మరికొన్ని ముదురు రంగులోనూ ఉంటాయని... ఇలా ఆల్కహాల్‌కు సంబంధించిన చాలా అంశాలను మీరు ఎంతో చక్కగా వివరించారు. సాక్ష్యంగా ఆయా రకాల మద్యం బాటిళ్లను ప్రవేశపెడితే ఎలా ఉంటుందంటారు!'' అనడంతో కోర్టు హాలంతా మరోసారి నవ్వులతో దద్దరిల్లిపోయింది.

బీజేపీకి గట్టిగా బదులిస్తాం

ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ • తిహార్ జైలు నుంచి విడుదల



న్యూఢిల్లీ: విపక్షాలపై తీవ్ర నిర్బంధ చర్యలకు పాల్పడుతున్న బీజేపీకి గట్టిగా బదులివ్వాల్సిన సమయం వచ్చిందని ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ అన్నారు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆర్నెల్ల పాటు తిహార్ జైల్లో గడిపిన ఆయనకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. వైద్య పరీక్షల అనంతరం ఆయన గురువారం రాత్రి విడుదలయ్యారు. ఆప్ కార్యకర్తలు వెంట రాగా ఓపెన్ టాప్ కార్లో ర్యాలీగా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసానికి వెళ్లారు. కేజ్రీవాల్ భార్య సునీతను కలిసి ఆమెకు పాదాభివందనం చేశారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. జైల్లో ఉన్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌ల నివాసాలకు కూడా వెళ్లి వారి కుటుంబీకులను పరామర్శిస్తానని చెప్పారు. మోదీ నియంత పాలనలో దేశమంతా నలిగిపోతోందంటూ దుమ్మెత్తిపోశారు. ''మోదీ సర్కారు ఎంతగా వేధించినా ఆప్ బెదరబోదు. కేజ్రీవాల్ రాజీనామా చేయబోరు. 2 కోట్ల మంది ఢిల్లీవాసుల ప్రయోజనాల పరిరక్షణకు జైలు నుంచే సీఎంగా విధులు నిర్వర్తిస్తారు. ఆయన, సిసోడియా, జైన్ త్వరలోనే విడుదలవుతారు'' అని అన్నారు. అవినీతి ఆరోపణలపై విపక్ష పాలిత రాష్ట్రాల పోలీసులు మోదీ ఇంటి తలుపు తడితే విచారణకు ఆయన సహకరిస్తారా అని సంజయ్ ప్రశ్నించారు.

సాక్షి కరీంనగర్

గురువారం | 4 | ఏప్రిల్ | 2024



స్వల్పంగా పెరిగిన పత్తి ధర

జమ్మికుంట: స్థానిక మార్కెట్లో పత్తి ధర రూ.100 పెరిగి క్వింటాల్‌కు రూ.7,650 పలికింది. మార్కెట్‌కు 694 క్వింటాళ్ల పత్తి వచ్చింది. మోడల్ ధర రూ.7,500, కనిష్ట ధర రూ.7,200 పలికింది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు(సా.)	సహర్ శుక్ర(ఉ.)
కరీంనగర్	6.28	4.38
పెద్దపల్లి	6.35	4.45
రాజన్న సిరిసిల్ల	6.35	4.46
జగిత్యాల	6.35	4.45

గరిష్టం/కనిష్టం 39.0/26.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు కేసీఆర్ రాక



కరీంనగర్‌రూరల్: పొలంబాట కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5న కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో మాజీ సీఎం కేసీఆర్ సాగు నీరు అందక ఎండిపోయిన వరిపంటను పరిశీలిస్తారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం మొగ్దుంపూర్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచు జక్కం నర్సయ్య, ఉపసర్పంచు కూకట్ల తిరుపతియాదవ్, దుర్శేడ్ సింగిల్ విండో డైరెక్టర్లు కందుల రమేశ్‌గౌడ్, దాడి లచ్చయ్య, నాయకులు డి.అంజిరెడ్డి, మంద అశోక్ తదితరులు ఎండిన వరిపొలాలను పరిశీలించారు. స్థానిక రైతులను కలిసి ఎండిన వరిపొలాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఊరచెరువు కట్టకింద ఎండిన పొలాలు కేసీఆర్ పరిశీలించడానికి అనువుగా ఉంటాయని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు తెలిపారు.

ఇంటివద్దకే కల్యాణ తలంబ్రాలు



విద్యానగర్(కరీంనగర్): శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో ఈ నెల 17న జరిగే సీతారామచంద్రుల కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తులకు ఇంటివద్దనే అందజేసే సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం ఎస్.సుచరిత తెలిపారు. బుధవారం కల్యాణ తలంబ్రాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను రీజినల్ కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. శ్రీ సీతారామచంద్రుల కల్యాణ తలంబ్రాల కోసం భక్తులు ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా ఈనెల 4నుంచి 18వరకు రూ.151 చెల్లించి బుక్ చేసుకుంటే వారి ఇంటి వద్దనే తలంబ్రాలు అందించే అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు కరీంనగర్ జిల్లా లాజిస్టిక్స్ మేనేజర్ ఎస్.సదాశివ్‌ను 8125459004 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టీఎన్జీవో చలివేంద్రం ప్రారంభం



కరీంనగర్: కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ సంఘాల నాయకులు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ చలివేంద్రంలో డీఎంహెచ్‌వో సుజాత సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. కలెక్టరేట్ ఏవో సుధాకర్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, రాగి శ్రీనివాస్, మహిళా జేఏసీ చైర్మన్ ఇరుమల శారద, సుమలత, టీఎన్జీవోస్ నాయకులు సర్దార్ హర్మీందర్ సింగ్, వెలిచాల సుమంత్‌రావు, మారుపాక రాజేశ్ భరద్వాజ్, నేరెళ్ల కిషన్, పోలు కిషన్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్ మండలం కాట్రపల్లిలో ఎండిన వరి



సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామంలో ఎండిన పొలం

వరి.. ఆశలు ఆవిరి!

- జిల్లాలోని పలు మండలాల్లో ఎండిన పొలాలు
- ఈసారి దిగుబడి తగ్గుతుందని కొందరు రైతుల ఆవేదన
- పంట పెట్టుబడి రాదేమోనని మరికొందరి ఆందోళన
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

జిల్లాలో తలెత్తిన సాగునీటి సమస్యతో వరి వేసిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. గతేడాది ఉన్నస్థాయిలో ఈసారి నీరు అందుబాటులో లేకపోవడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. చివరి ఆయకట్టులో ఉన్న హుజూరాబాద్, జమ్మికుంట, సైదాపూర్‌లతోపాటు ఎల్ఎండీకి సమీపంలోనే ఉన్న కరీంనగర్ రూరల్ మండలాల్లోని కొన్ని పొలాల పరిస్థితి దయనీయంగా ఉంది. జిల్లాలో ఈసారి యాసంగి సీజన్‌లో 2.66 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా.. దాదాపు 25 వేల ఎకరాల వరకు సాగు నీరందక ఎండిపోయిందని అనధికారికంగా అంచనా వేస్తున్నారు.

రైతన్న కంటతడి..

కళ్లెదుటే పంట ఎండిపోతుంటే జిల్లాలోని రైతులు కంటతడి పెడుతున్నారు. ఎండిన పంటతో కొందరికి ఎలాంటి ఉపయోగం లేకపోగా.. మరికొందరు దిగుబడి గణనీయంగా తగ్గుతుందని వాపోతున్నారు. రూ.వేల ఖర్చుకు ఓర్చి, పంట వేస్తే.. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని దిగులు చెందుతున్నారు. ఒకటి, రెండెకరాలున్న రైతులు మరికొంత కౌలుకు తీసుకొని, సాగు చేశారు. వీరు రెండుచోట్లా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. సైదాపూర్ మండలంలో మొత్తం 16 వేల ఎకరాల్లో వరి, 2,200 ఎకరాల్లో మొక్కజొన్న వేయగా.. బొమ్మకల్, అమ్మనగుర్తి, రాయికల్, ఆకునూరు గ్రామాల్లో చివరి దశకు సాగు నీరందక సుమారు 10 శాతం పంటలు ఎండిపోయినట్లు అంచనా వేశామని వ్యవసాయ అధికారులు తెలిపారు.



ఎండుతున్న వరిపొలంలో కూర్చున్న ఈ కౌలు రైతు గుజ్జుల రవీందర్‌రెడ్డి. కరీంనగర్‌రూరల్ మండలం చెర్లబూత్కూర్. ఆయనకున్న మూడెకరాలతోపాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని, వరిసాగు చేశాడు. పంట పొట్ట దశలో ఉండగా రెండు బావుల్లోని నీరు అడుగంటింది. దీంతో పంటను కాపాడుకునేందుకు సుమారు రూ.2 లక్షలతో పూడిక తీయించి, సైడ్‌బోర్లు వేయించాడు. అయినా నీరందరక కౌలుకు తీసుకున్న భూమిలోని రెండెకరాల వరి ఎండిపోతోంది. ఎకరానికి రూ.25 వేల చొప్పున 6 ఎకరాలకు రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టానని తెలిపాడు. ఇప్పటికే రెండెకరాల్లో వరి ఎండిపోయిందని, మిగతా నాలుగెకరాల్లోని పంట చేతికి రాకుంటే అప్పులపాలవుతానని ఆవేదన చెందుతున్నాడు. ఈ సమస్య ఒక్క రవీందర్‌రెడ్డిదే కాదు కరీంనగర్ జిల్లాలోని చాలా మందిది.

జిల్లాలో సాగైన పంటలు (ఎకరాల్లో)

పంట	ఎకరాలు
వరి	2,66,293
మక్క	25,164
పత్తి	19
పెసర	63
నువ్వు	48
పొద్దుతిరుగుడు	355
పొగాకు	541
వేరుశనగ	462

గింజ తాలుపోయేటట్టుంది



నేను నాలుగెకరాల్లో వరేసిన. 24 గజాల లోతు ఉన్న బావిలో నీరు అడుగంటిపోయి, పొలం పారడం లేదు. వరి గింజ తాలుపోయేటట్టుంది. మూడెకరాలు కౌలుకు తీసుకొని, మొక్కజొన్న ఏసిన. అందులో ఎకరం ఎండిపోయింది. పంటలకు రూ.2 లక్షల ఖర్చయింది. పెట్టుబడైనా అత్తదో రాదో!

– ఓదెలు, బొమ్మకల్, రైతు, సైదాపూర్

నీళ్లు రాకుంటే మక్క ఎండుతది



నేను మూడెకరాలు కౌలుకు తీసుకొని, మక్క వేసిన. రూ.90 వేల వరకు పెట్టుబడి పెట్టిన. కెనాల్ నీరు రాకుంటే ఎదిగిన పంట ఎండుతది. ఇంకో రెండు తడుల సాగు నీరిస్తే పంట చేతికి వస్తుంది. ప్రభుత్వం నీళ్ల విడుదల చేసి, పంటలను కాపాడాలి. రైతులు అప్పులపాలు కాకుండా ఆదుకోవాలి.

– పంజాల మల్లేశ్, కౌలు రైతు, మడిపల్లి, జమ్మికుంట

ప్రభుత్వం ఆదుకోవాలి



ఆరుగాలం కష్టించి, పండించిన పంట చేతికొస్తది అనుకున్న. కానీ, ఎండిపోతుంటే బాధేస్తుంది. నాకున్న మూడెకరాల భూమిలో వరి సాగు చేస్తే రూ.1.50 లక్షల ఖర్చు వచ్చింది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి. లేకుంటే అప్పులపాలవుతాం. మా కుటుంబం ఆగమైతది.

– నిమ్మల కుమారస్వామి, రైతు, కాట్రపల్లి, హుజూరాబాద్

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా కర్ణన్



ఆర్వీ కర్ణన్

కరీంనగర్ అర్బన్: సాగు, తాగునీటికి కష్టాల క్రమంలో పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. ప్రధానంగా తాగునీటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించనున్నారు. జూలై చివరి వరకు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుండగా జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమన్వయం చేయనున్నారు. కాగా ఆర్వీ కర్ణన్ జిల్లా కలెక్టర్‌గా వ్యవహరించిన అనుభవముంది.

నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి



కరీంనగర్ కార్పొరేషన్: నీటి మట్టం తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్యశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) ఆర్.శ్రీధర్ అన్నారు. నగరంలో ఎదురవుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించే క్రమంలో బుధవారం ఈఎన్సీ నగరానికి వచ్చారు. మానేరుడ్యాం వద్ద ఫిల్టర్‌బెడ్, ఇంటెక్‌వెల్, బూస్టర్ పంప్‌హౌస్‌లను ఆయన సందర్శించారు. తాగునీటి సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రస్తుతం నడుస్తున్న బూస్టర్ మోటార్లకు అదనంగా మరో బూస్టర్ మోటారును నడిపించాలని సూచించారు. భవిష్యత్‌లో మళ్లీ సమస్య రాకుండా ఉండేందుకు అమృత్ పథకంలో అదనపు పైప్‌లైన్‌లు, సంప్‌నిర్మాణం చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య శాఖ ఎస్ఈ శ్రీనివాస్‌రావు, ఈఈ సంపత్‌రావు, నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, ఈఈలు మహేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కండి

- కలెక్టర్ పమేలా సత్పతి



విద్యాశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: 'మహిళలైతే చక్కగా పని చేయిస్తారు. డబ్బు వృథా చేయకుండా పొదుపుపై దృష్టి పెడతారు. అందుకే మహిళా సంఘాలకు ప్రభుత్వం పెద్దబాధ్యత అప్పగించింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములను చేస్తోంది. అందుకే జిల్లా, మండల సమైక్య సంఘాల ప్రతినిధులు పాఠశాలలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి' అని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎంఈవోలు, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, వివిధశాఖల ఇంజినీరింగ్ అధికారులు, జిల్లా, మండల సమైక్య సంఘాల ప్రతినిధులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు, పాఠశాలలో చేపట్టాల్సిన పనులపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో టాయిలెట్స్, కిచెన్‌షెడ్లు, ప్రహరీ, అదనపు తరగతి గదులు, తాగునీరు, విద్యుత్ సరఫరాతోపాటు ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. పనులు చేపట్టడంలో వీవో అధ్యక్షురాలు కీలకం అని, ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే పనులు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. పనులు జూన్ 10లోగా పూర్తి చేయాలని సూచించారు.

భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు ఉండాలి

ఇల్లందకుంటలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 27వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులు మెచ్చే విధంగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శ్రీరామనవమి వేడుకల ఏర్పాట్లపై బుధవారం కోఆర్డినేషన్ మీటింగ్ జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఎండాకాలం నేపథ్యంలో శ్రీరామనవమికి హాజరయ్యే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. చలువ పందిళ్లు, బారీకేడ్లు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పోలీస్‌శాఖ ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. రైస్‌మిల్లర్స్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్టీసీ అవసరమైన బస్సులను నడిపించాలన్నారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, డీఆర్‌వో పవన్ కుమార్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఈవీఎంల ర్యాండమైజేషన్

ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేశామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం వివిధ రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఈవీఎంల, వీవీ ప్యాట్ల మొదటి రాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాండమైజేషన్‌పై అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అవగాహన కల్పించారు. ర్యాండమైజేషన్ పూర్తయిన తర్వాత ప్రతిఒక్క ఈవీఎంను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. రెండో రాండమైజేషన్‌లో పోలింగ్‌స్టేషన్ల వారీగా ఈవీఎంలు అలాట్ అవుతాయని తెలిపారు.

బాధ్యతాయుతంగా పని చేయండి

కరీంనగర్‌టౌన్: వైద్యాధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బుధవారం కలెక్టర్ ఆడిటోరియంలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, ఎంఎల్‌హెచ్‌సీ డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. సమీక్షకు వచ్చేటప్పుడు అన్ని వివరాలతో హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానాల్లో సాధారణ ప్రసవాలు పెరిగేలా కృషి చేయాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దని పేర్కొన్నారు. పనితీరు కనబరిచిన వారికి ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్లు అందజేశారు. డీఎంహెచ్‌వో సుజాత తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే.. ఆయుధం

interview

- అవగాహనతో అగ్నిప్రమాదాలు దూరం
- షాపింగ్‌మాల్స్, హాస్పిటల్స్‌లో నియంత్రణ చర్యలు
- బస్టాండ్, విద్యాసంస్థలు, రద్దీ ప్రాంతాల్లో మాక్‌డ్రిల్
- సహాయక చర్యలపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- డివిజన్ ఫైర్ అధికారి తగరం వెంకన్న



కరీంనగర్‌క్రైం: 'ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉంటే అగ్ని ప్రమాదాలను అంత త్వరగా నివారించొచ్చు. వేసవికాలంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశముంది. అజాగ్రత్తతో వ్యవహరిస్తే ఆస్తినష్టం పెరిగే ప్రమాదముంది. ప్రజలు అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి. ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్ వంటి పెద్ద భవనాల్లో నియంత్రణ చర్యలపై నిఘాపెట్టాం' అని కరీంనగర్ ఫైర్ అధికారి తగరం వెంకన్న పేర్కొన్నారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశముండగా.. తీసుకుంటున్న చర్యలు.. సిబ్బంది, తదితర అంశాలను బుధవారం 'సాక్షి'కి వెల్లడించారు.

సాక్షి: అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?

ఫైర్ అధికారి: ఎల్‌పీజీ సిలిండర్ ఉన్నచోట గాలి వచ్చివెళ్లే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. వంటగదిలో కిరోసిన్, పెట్రోలు ఉంచకూడదు. ఇంట్లో నాణ్యమైన ఐఎస్ఐ వైరింగ్ ఏర్పాటు చేసుకోవాలి. లీకేజీ అయిన సిలిండర్‌ను ఆరుబయట వేయాలి. ఇంట్లో వైరింగ్ లోపంతో సమస్యలు తలెత్తితే మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్స్ అమర్చుకోవాలి.

సాక్షి: అగ్నిప్రమాదాలు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఫైర్ అధికారి: అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రతీ శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. హాస్పిటళ్లు, షాపింగ్‌మాల్, అపార్టుమెంట్లు, స్కూల్, కాలేజీల్లో అగ్ని నిరోధక సాధనాలను పరిశీలిస్తూ పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి: ఆస్పత్రుల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఫైర్ అధికారి: హాస్పిటల్స్‌లో అగ్నిమాపక పరికరాలు ఎల్లప్పుడూ పనిచేసే విధంగా అమర్చుకోవాలి. అత్యవసర ద్వారాలు, ఫైర్‌డోర్లకు తాళాలు వేయొద్దు. ఫైర్ అలారం విన్న వెంటనే ఆసుపత్రిని ఖాళీ చేయాలి. ఏసీ, విద్యుత్ ఉపకరణాల్లో లోపాలు లేకుండా పరీక్షిస్తుండాలి. క్యాంటీన్‌ను ఆసుపత్రి భవనంలో కాకుండా వేరే చోట ఉండాలి.

సాక్షి: షాపింగ్‌మాల్స్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఫైర్ అధికారి: మాల్స్‌లోని అగ్నిమాపక పరికరాలు ఎల్లప్పుడూ పనిచేసేలా ఉంచుకోవాలి. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు లిఫ్టులు, ఎస్కెలేటర్స్ వాడొద్దు. ఫైర్‌డోర్లకు తాళాలు వేయొద్దు. మాల్స్‌లో పనిచేసేవారికి ఫైర్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇవ్వాలి. విద్యుత్ వైర్లను ఎప్పటికప్పుడు పరిశీలించి, నాణ్యమైన వైరింగ్ వాడాలి. మూడు నెలలకోసారి సమీపంలోని ఫైర్‌స్టేషన్ సిబ్బందితో మాక్‌డ్రిల్స్ ఏర్పాటుచేసుకోవాలి.

సాక్షి: వేసవిలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఫైర్ అధికారి: జిల్లాలోని ఐదు ఫైర్‌స్టేషన్లలో వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రమాదం జరిగిన తక్షణమే ఘటనాస్థలానికి చేరుకుంటాం. ఫైర్‌సర్వీస్ వారోత్సవాలు ఏప్రిల్ 13 నుంచి 18వరకు నిర్వహిస్తున్నాం. ఇందులో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలను వివరిస్తున్నాం. సిబ్బంది కొరత కొంతవరకు ఉంది. త్వరలో కొత్తవారు విధుల్లో చేరనున్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం



కిసాన్‌నగర్‌లో అల్పాహారం తింటున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బి.వినోద్‌కుమార్, వై.సునీల్‌రావు

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కరీంనగర్: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, రానున్న ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కిసాన్‌నగర్ 3,25వ డివిజన్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఎమ్మెల్యే కమలాకర్, వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డాక స్మార్ట్‌సిటీ నిధులతో పాటు సీఎం హామీ నిధులు రూ.360 కోట్లతో కరీంనగర్ నగరాన్ని అద్దంలా తీర్చిదిద్దామని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత వాగ్దానాలను తిప్పికొట్టి బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని ప్రజలను కోరారు. మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నాయకులు చల్ల హరిశంకర్, ఎడ్ల అశోక్, కుర్ర తిరుపతి, కంసాల శ్రీనివాస్, కామారపు శ్యాం పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం



చిగురుమామిడిలో మార్నింగ్‌వాక్ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ లీడర్లు

- చిగురుమామిడిలో మంత్రి 'పొన్నం' మార్నింగ్ వాక్

తిమ్మాపూర్: రైతులకు కొంత ఇబ్బంది ఏర్పడుతున్న మాట వాస్తవమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చిగురుమామిడిలో బుధవారం 'మార్నింగ్ వాక్' నిర్వహించారు. సాగునీరు అందక ఎండుతున్న పంటలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో పాత బావులు అద్దెకు తీసుకుంటామన్నారు. నూతన బోర్లు వేయడంపై కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. రూ.500కే గ్యాస్‌తో పాటు, 200యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రేషన్‌కార్డులు ఇస్తామని తెలిపారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు మార్నింగ్ వాక్ చేపట్టినట్లు తెలిపారు.

నగరంలో విజిలెన్స్ దాడులు

కరీంనగర్‌క్రైం: నగరంలోని పలు హోటళ్లు, బేకరీలపై బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులు దాడులు నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫుడ్‌సేఫ్టీ అధికారి సునీత కోతిరాంపూర్‌లోని మైసూర్ బేకరీ, కృతుంగా రెస్టారెంట్‌తో పాటు పలు హోటళ్లలో తనిఖీలు చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత తీరును పరిశీలించారు. నిర్వహణ సరిగా లేని ఓ సంస్థను సీజ్ చేసినట్లు సమాచారం.

పోలీసు కస్టడీకి ఇద్దరు

కరీంనగర్‌క్రైం: భూ ఆక్రమణ కేసులో అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్న ఇద్దరిని కరీంనగర్ రూరల్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. కొత్తపల్లి జెడ్పీటీసీ భర్త పిట్టల రవీందర్‌ను మంగళవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు, కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాశ్‌ను బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు కస్టడీకి తీసుకున్నారు. వారిళ్లలో సోదాలు చేసి పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

అమ్మాయిది శ్రీలంక.. అబ్బాయిది పందికుంటపల్లి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి ప్రభాకర్

రామడుగు(చొప్పదండి): అమ్మాయిది శ్రీలంక.. అబ్బాయిది రామడుగు మండలంలోని పందికుంటపల్లి. దేశాలు వేరైనప్పటికీ ప్రేమ అనే బంధం ఇరువురినీ ఒక్కటి చేసింది. పందికుంటపల్లికి చెందిన కట్కం సురేందర్ ఉద్యోగం చేయడానికి లండన్ వెళ్లాడు. తాను పని చేస్తున్న ఆఫీస్‌లో శ్రీలంక దేశానికి చెందిన జానుషికతో పరిచయం ఏర్పడింది. తర్వాత అది ప్రేమగా మారడంతో తమ కుటుంబసభ్యులను పెళ్లికి ఒప్పించారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో ఏడడుగులు వేశారు. వివాహానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

భూ కబ్జాపై ఎస్పీకి ఫిర్యాదు

సిరిసిల్లక్రైం: అధికారి పార్టీ అండ చూసుకొని మాజీ సర్పంచ్ తన భూమి కబ్జా చేశాడని ఓ వ్యక్తి బుధవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌కు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం .. చందుర్తి మండలంలోని మల్యాలగడ్డకు చెందిన మెండె గంగయ్యకు అతను ఇల్లు కట్టుకున్న ఏరియాలో 16 గుంటల భూమి ఉంది. మంగళవారం ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జలపతి ఆ భూమిలోకి చొరబడి, గంగయ్యను కొట్టి, చంపుతానని బెదిరించి, తెల్ల కాగితంపై సంతకం తీసుకున్నాడు. అధికార పార్టీ నాయకుడినని, ఎమ్మెల్యే పేరు చెప్పి, భూమి ఆక్రమించాడని, తనకు న్యాయం చేయాలని ఎస్పీని కోరినట్లు బాధితుడు తెలిపాడు.

శ్రీజ అత్తింటివారి అరెస్టు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ పంచాయతీ పరిధి విజయ్‌నగర్ కాలనీకి చెందిన శ్రీజ, ఆమె కుమారుడు రేయాన్ష్, తల్లి జయప్రద ఆత్మహత్య కేసులో శ్రీజ అత్తింటివారిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆమె తండ్రి గద్దె వెంకటేశ్వరాచారి ఫిర్యాదు మేరకు శ్రీజ భర్త నరేశ్, అత్తామామ సుజాత-కేశవాచారిలపై కేసు నమోదు చేశామన్నారు. బుధవారం వారిని అరెస్టు చేసి, జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

గంజాయి మాయంపై కొనసాగుతున్న విచారణ

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్ పోలీసులు సీజ్ చేసిన గంజాయి పోలీస్‌స్టేషన్ నుంచి మాయమైన ఘటనపై విచారణ కొనసాగుతోంది. గతంలో గంజాయి తరలింపులో నిందితులుగా ఉన్నవారిని, కొత్తగా అనుమానిస్తున్న వారిని మూడోరోజు బుధవారం విచారించారు. 70 కిలోల గంజాయి ప్యాక్ చేసిన సంచులను ఠాణా నుంచి ఏదైనా వాహనంలో తరలించి ఉంటారని భావిస్తున్నారు. దీనిపై పలు కోణాల్లో విచారణ జరుగుతున్నట్లు తెలిసింది.

ఆవుకు రెండు దూడలు



ధర్మపురి: ధర్మపురివాసి భారతపు సత్యనారాయణ అనే రైతుకు చెందిన ఆవు బుధవారం ప్రసవ వేదనతో అల్లాడిపోయింది. పశువైద్యాధికారి రాజేందర్‌రెడ్డికి సమాచారం ఇవ్వడంతో వచ్చి, సహజ ప్రసవం చేశారు. ఆ ఆవు రెండు దూడలకు జన్మనివ్వడంతో రైతు సంతోషం వ్యక్తం చేశాడు. పశువులు కవలలకు జన్మనివ్వడం చాలా అరుదని, మూడు జీవాలూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైదాధికారి తెలిపారు.

వెల్గటూర్‌లో మట్టి దందా

- రెవెన్యూ అధికారులు, పోలీసుల జాయింట్ ఆపరేషన్‌తో వెలుగులోకి..
- టిప్పర్, లారీలు, జేసీబీ వదిలేసి, పారిపోయిన డ్రైవర్లు
- రూ.కోట్ల స్కాంపై చర్యలు తీసుకోవాలి : విప్, ఎమ్మెల్యే అడ్లూరి



అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లాలోని ధర్మపురి నియోజకవర్గంలో గుట్టుగా సాగుతున్న మట్టి దందా వెలుగుచూసింది. వెల్గటూర్ మండలంలోని కిషన్‌రావుపేట శివారులో నిల్వ ఉంచిన చెరువు మట్టిని లారీల్లో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు, రెవెన్యూ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి, పట్టుకున్నారు. వారి వివరాల ప్రకారం .. మంగళవారం రాత్రి 11 గంటలకు జేసీబీ సహాయంతో మట్టిని లారీల్లో నింపి, పెద్దపల్లి జిల్లా గౌరెడ్డిపేటకు తరలించే ప్రయత్నం చేస్తుండగా రెవెన్యూ అధికారులు, పోలీసులు దాడి చేశారు. అప్పటికే మట్టి నింపిన టిప్పర్ సహా 11 లారీలు, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లు వాహనాలను వదిలేసి, అప్పటికే పారిపోయారు. రెవెన్యూ అధికారులు ఆ వాహనాలను బుధవారం ఎస్సై ఉమాసాగర్‌కు అప్పగించగా వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నల్ల మట్టిని తన స్థలంలో నిల్వ ఉంచినందుకు పట్టాదారు తిరుపతి, మట్టిని అక్రమంగా నిల్వ ఉంచినందుకు రవీందర్, తరలించేందుకు ప్రయత్నించిన వెంకటేశ్వర్‌లపై తహసీల్దార్ శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏడాది కిందే డంపుల ఏర్పాటు!

మట్టి డంపులను ఏడాది కిందటే ఏర్పాటు చేసినట్లు సమాచారం. కప్పారావుపేట చెరువు నుంచి మట్టి తీయడానికి 2022లో 3 రోజులకు అనుమతి తీసుకొని, రెండుచోట్ల డంపు చేశారు. కప్పారావుపేట శివారులో ప్రైవేటు వ్యక్తి పట్టా భూమిలో సుమారు ఎకరం విస్తీర్ణంలో 8 ఫీట్ల ఎత్తులో, కిషన్‌రావుపేట శివారులోని కొలకాని రాములు, తిరుపతి, రవిలకు చెందిన సర్వే నంబర్ 348/ఇ/1లో 1.24 ఎకరాల్లో 3 ఫీట్ల ఎత్తులో మట్టి నిల్వ చేశారు. మూడు రోజులుగా మట్టిని తరలిస్తుండగా స్థానికులు కొందరు ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే, మట్టి తరలించేవారు వారినే బెదిరించారని, పోలీసులు, రెవెన్యూ అధికారులకు తాము లంచాలిచ్చేశామని బదులిచ్చినట్లు సమాచారం. దీంతో కోపోద్రిక్తులైన స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ దందా వెలుగుచూసింది.

పదేళ్లుగా అక్రమాలు..



ధర్మపురి నియోజకవర్గంలో పదేళ్లుగా కొందరు నల్లమట్టి, కంకర, గ్రానైట్ తదితర వ్యాపారాల్లో అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా అనుమతులుంటే వ్యాపారం చేసుకోవచ్చు. కానీ, పాత అనుమతులతో ఇప్పుడు అక్రమంగా వ్యాపారం చేస్తామంటే కుదరదు. రూ.కోట్ల స్కాం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాం. ఈ విషయమై విజిలెన్స్, రెవెన్యూ, మైనింగ్ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తా. – విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్

‘ట్రినిటీ’ విద్యార్థులకు ఓవరాల్ చాంపియన్‌షిప్



కరీంనగర్‌రూరల్: వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సూయి జనరిస్ ప్రోగ్రాంలో ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. 14 రకాల ఈవెంట్లలో సత్తా చాటడంతోపాటు యాక్టివ్ పార్టిసిపేషన్ ట్రోఫీ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి బుధవారం అభినందించి, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్, ఏవో రాధాకృష్ణ, ఎంబీఏ హెచ్‌వోడీ ప్రవీణ్‌కుమార్, లెక్చరర్లు సంతోషి, రజితరెడ్డి, ఇలియాజ్ అలీ, అజారుద్దీన్, సుప్రియ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

- నాలుగేళ్ల క్రితం కులాంతర వివాహం
- భర్తే హత్య చేశాడని బంధువుల ఆందోళన
- డీఎస్పీ జోక్యంతో సద్దుమణిగిన వివాదం



సుధారాణి మృతదేహం

జగిత్యాలక్రైం: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లాకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఆమెను భర్తే హత్య చేశాడని పేర్కొంటూ బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు, బంధువుల కథనం ప్రకా రం.. ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాళ్ల సుధారాణి, గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన ఎల్లంకి రంజిత్ నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి హర్షవర్ధన్ (3) కుమారుడు సంతానం. భార్యాభర్తలు కొన్నాళ్లుగా జగిత్యాలలోని చిలుకవాడలో నివా సముంటున్నారు. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 4న హర్షవర్ధన్ పుట్టువెంట్రుకలు తీసేందుకు నిర్ణయించారు. సంప్రదాయం ప్రకారం మేనమామ రావా ల్సి ఉండగా.. రంజిత్ నిరాకరించాడు. దీంతో మరో సారి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో సుధారాణి బుధవారం ఉదయం క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో కనిపించడంతో స్థానికులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందించేలోపే మృతిచెందింది. విషయం తెలుసుకున్న సుధారాణి కుటుంబ సభ్యులు, బంధువులు జగిత్యాలకు చేరుకుని సుధారాణి భర్త రంజిత్, అతని కుటుంబ సభ్యులపై దాడికి ప్రయత్నించారు. డీఎస్పీ రఘుచందర్, పట్టణ సీఐ వేణుగోపాల్ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. తన కూతురును రంజిత్ కులం పేరుతో దూషించి మానసికంగా వేధించాడని, చివరకు హత్య చేశాడని మృతురాలి తల్లి కాళ్ల వసంత ఆరోపించింది. ఆమె ఫిర్యాదు మేరకు రంజిత్‌తోపాటు, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

దుబాయిలో విలాసాగర్‌వాసి మృతి

- రెండు రోజుల క్రితం గుండెపోటు
- పన్నెండేళ్లుగా అక్కడే..
- కూతుళ్ల పెళ్లికీ రాలే..
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు



శ్రీనివాస్ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): బతుకుదెరువు కోసం పన్నెండేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు.. కూతుళ్ల పెళ్లికీ రాలేదు.. రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో మృతిచెందాడు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బోయినపల్లి మండలంలోని విలాసాగర్‌కు చెందిన చల్ల శ్రీనివాస్(58) గ్రామంలో హమాలీ పని చేసేవాడు. స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో దుబాయి వెళ్లాడు. వెళ్లినప్పటి నుంచి స్వగ్రామానికి తిరిగి రాలేదు. కోవిడ్, వీసా సమస్యల వల్ల తన ఇద్దరు కూతుళ్ల రవళి, రమ్య వివాహానికి సైతం రాలేకపోయాడు. మృతుడికి భార్య పద్మ ఉంది. ఆమె అప్పులు చేసి, కూతుళ్ల వివాహం జరిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీనివాస్ గుండెపోటుతో మృతి చెందాడన్న విషయం దుబాయిలో ఉండే అతని బంధువు ద్వారా తెలిసిందని పేర్కొన్నారు.

విప్‌ను కలిసిన మృతుడి కుటుంబసభ్యులు

శ్రీనివాస్ మృతితో తాము దిక్కులేనివారమయ్యామని బాధిత కుటుంబసభ్యులు కంటతడి పెట్టారు. తమకు ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందించి, ఆదుకోవాలని బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి విన్నవించారు. శ్రీనివాస్ మృతదేహాన్ని త్వరగా స్వగ్రామం రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి..



శ్రీహర్ష (ఫైల్)

పెద్దపల్లిరూరల్: విద్యుదాఘాతంతో ఓ విద్యార్థి మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి పట్టణంలోని కమాన్ రోడ్డు (పాత చిత్రాణి టాకీసు వద్ద) ప్రాంతానికి చెందిన కీర్తి శ్రీహర్ష(14) బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లి, ఇంటికి వచ్చాడు. బకెట్‌లో ఉన్న వాటర్ హీటర్‌కు విద్యుత్ సరఫరా ఉండటాన్ని గుర్తించకుండా పట్టుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. కాసేపటికి గుర్తించిన తండ్రి రవికుమార్ కర్ర సాయంతో హీటర్‌ను తొలగించి, శ్రీహర్షను ఆస్పత్రికి తరలించాడు. కానీ, అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అప్పటిదాకా అందరితో కలివిడిగా ఉన్న శ్రీహర్ష మృతిచెందాడని తెలుసుకున్న కాలనీవాసులు కంటతడి పెట్టారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

- ఇరాక్‌లో గతేడాది డిసెంబర్ 29న రోడ్డు ప్రమాదంలో మృతి



వెంకటేశం మృతదేహం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బతుకుదెరువు కోసం గల్ఫ్ బాట పట్టిన వలసజీవి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మూడు నెలల తర్వాత ఆయన మృతదేహం స్వగ్రామం చేరింది. బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన బైరి వెంకటేశం(40) ఉపాధి నిమిత్తం 14 ఏళ్లుగా ఇరాక్ వెళ్తున్నాడు. గతేడాది డిసెంబర్ 29న అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన మృతదేహం బుధవారం స్వగ్రామం చేరగా కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య సౌమ్య, కూతురు జాను, తల్లి బుచ్చవ్వ ఉన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగం, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలంగాణ గల్ఫ్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి వెంకటేశం కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కుమారుడి చెంతకు తప్పిపోయిన వృద్ధుడు



వృద్ధుడిని అప్పగిస్తున్న డే కేర్ సెంటర్ నిర్వాహకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తప్పిపోయిన ఓ వృద్ధుడు బుధవారం తన కుమారుడి చెంతకు చేరాడు. వివరాల్లోకి వెళ్తే.. ఇల్లంతకుంట మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన మెడకొక్కుల నర్సయ్య మంగళవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి వచ్చి, తప్పిపోయాడు. స్థానిక బస్టాండ్ ప్రాంతవాసులు డే కేర్ సెంటర్ నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి, ఆయనను తీసుకెళ్లారు. కేంద్రం ఇన్‌చార్జి మమత నర్సయ్యకు భోజనం పెట్టించి, వివరాలు తెలుసుకోగా ఓబులాపూర్‌వాసినని చెప్పాడు. దీంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్‌కు ఫోన్ చేయగా నర్సయ్య కుమారుడిని పంపించారు. జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు వృద్ధుడిని అతని కొడుకుకు అప్పగించారు. డే కేర్ నిర్వాహకులకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం



బాధితురాలిని కాల్వలో నుంచి బయటకు తీసుకువస్తున్న బ్లూకోల్ట్స్ పోలీసులు

మల్యాల(చొప్పదండి): ఆత్మహత్య చేసుకునేందుకు వరద కాల్వలో దిగిన ఓ వివాహితను బ్లూకోల్ట్స్ పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. మేడిపల్లి మండలంలోని కొండాపూర్‌కు చెందిన బొల్లె లక్ష్మి కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. బుధవారం మల్యాల మండల కేంద్రంలోని తన తల్లిగారి ఇంటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, బయలుదేరింది. మల్యాల అడ్డరోడ్డు సమీపంలోని వరద కాల్వ వద్దకు చేరుకొని, అందులో దిగింది. గమనించిన స్థానికులు 100కు ఫోన్ చేశారు. బ్లూకోల్ట్స్ పోలీసులు వెంటనే వచ్చి, ఆమెను బయటకు తీసుకువచ్చారు. కాల్వలో నీరు తక్కువగా ఉండటంతో లక్ష్మి ప్రాణాలతో బయటపడింది.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

కోనరావుపేట(వేములవాడ): భార్య ఆత్మహ త్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.30 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో తెలిపారు. కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన కంటె నరేశ్‌కు చందుర్తి మండలం అనంతపల్లికి చెందిన ఎక్కల రేవతి అలియాస్ శిరీషతో 2017లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.10లక్షల కట్నంతోపాటు ఇతర లాంఛనాలు ఇచ్చారు. వారికి ఒక కూతురు జన్మించింది. తర్వాత కొన్నాళ్లకు నరేశ్‌తోపాటు తల్లిదండ్రులు, ఆడపడుచు అదనపు కట్నం కోసం వేధించగా 2021 మార్చి 19న రేవతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో బుధవారం జిల్లా జడ్జి ప్రేమలత నరేశ్‌కు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రైలు కింద దూకి యువకుడి బలవన్మరణం

జమ్మికుంట(హుజూరాబాద్): రైలు కింద దూకి గుర్తు తెలియని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. బుధవారం జమ్మికుంట రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ యువకుడు(30) రైలు కింద దూకాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, ఆధారాలు లేవు. తెలుపు చుక్కలున్న బ్లూ కలర్ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి, గడ్డంతో ఉన్నాడు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు 99493 04574, 87126 58604 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ సూచించారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా

కోనరావుపేట(వేములవాడ): బైండోవర్ ఉల్లంఘించిన ఓ వ్యక్తికి రూ.లక్ష జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలంలోని పల్లిమక్తకు చెందిన అలిపిరి ఆదిరెడ్డి గతంలో తన ట్రాక్టర్ ద్వారా కనగర్తి మూలవాగు నుంచి పలుమార్లు ఇసుక అక్రమ రవాణా చేస్తూ అధికారులకు చిక్కాడు. తహసీల్దార్ ఎదుట రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ చేశారు. మళ్లీ ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. దీంతో బైండోవర్ నిబంధన ఉల్లంఘించాడని జరిమానా విధించగా బుధవారం చెల్లించాడు. డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తల్లీపిల్లల అదృశ్యం

జమ్మికుంట(హుజూరాబాద్): తన భార్యాపిల్లలు కనిపించడం లేదని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని సోమారంపేటకు చెందిన సూర రాజు బతుకుదెరువు కోసం తన భార్య కవిత, ఇద్దరు పిల్లలతో కలిసి జమ్మికుంట పట్టణంలోని మారుతీనగర్‌కు వచ్చాడు. స్థానికంగా ఓ ఇల్లు అద్దెకు తీసుకొని, ఉంటున్నాడు. ఈ నెల 1వ తేదీన అతను కూలీ పనికి వెళ్లి, ఇంటికి రాగా భార్యాపిల్లలు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. పక్కింట్లో ఉంటున్న గుంజి నాగరాజు తీసుకెళ్లినట్లు తనకు అనుమానం ఉందని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కోరుట్ల రూరల్: మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ శివారు ఎస్సారెస్పీ కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెద్దాపూర్ గ్రామస్తులు బుధవారం కాల్వ వెంట వెళ్తుండగా అందులో మృతదేహం కనిపించింది. వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని, బయటకు తీయించారు. మృతుడి వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, నలుపు రంగు దుస్తులు ధరించాడని, ఇతర ఏ ఆధారాలు లభించలేదని ఎస్సై పేర్కొన్నారు. వివరాలు తెలిసినవారు కోరుట్ల సీఐ నంబర్ 87126 56820 లేదా ఎస్సై నంబర్ 87126 56790కు ఫోన్ చేయాలని కోరారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

- 12 మందికి తీవ్ర అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు
- కరీంనగర్ జిల్లా వెదిర గ్రామంలో ఘటన



బాధితులను 108 వాహనంలో తరలిస్తున్న అధికారులు

రామడుగు(చొప్పదండి): కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిర గ్రామంలో ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడిచేశాయి. 12మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం గ్రామ పరిధిలోని మసుకుంట వైపువెళ్లే దారిలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలపై ఒక్కసారిగా తేనెటీగలు దాడికి దిగడంతో పరుగులు తీశారు. గ్రామానికి చెందిన మచ్చ మల్లేశం, మీసాల సంజీవ్, నిట్టు కవిత, మీసాల రాజమల్లు, గుడిసె మల్లయ్య, కొలిపాక సంపూర్ణ, లక్ష్మి, అమృత, పుల్ల మల్లవ్వ, ముత్త కనకయ్య, కుమ్మరి రమ్య, ఉపేంద్ర పైన తేనెటీగలు పెద్ద మొత్తంలో దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మచ్చ మల్లేశం, మీసాల సంజీవ్, మీసాల రాజమల్లు, గుడిసె మల్లయ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బాధితులను రామడుగు తహసీల్దార్ భాస్కర్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు



అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

ధర్మపురి: చైన్ స్నాచింగ్ ముఠాను బుధవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత వివరాలను ఆయన వెల్లడించారు. ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన అక్కల అంతమ్మ మార్చి 29న స్థానిక పెట్రోల్ బంక్ వద్ద దోసకాయలు విక్రయించేందుకు జాతీయ రహదారి పక్కన కూర్చుంది. ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు దోసకాయలు బేరం చేశారు. ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపిస్తామని నమ్మించి, మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వివిధ మండలాలకు చెందిన ఎస్సైలు ఐదు రోజులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బుధవారం రాయపట్నం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు బైక్‌లపై నలుగురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా బంగారు గొలుసు, పుస్తె లభ్యమయ్యాయి. విచారణలో అయిలాపూర్‌కు చెందిన సిలిగిరి సందీప్, కోరుట్లకు చెందిన ముంజ రాజేందర్ చోరీ చేసినట్లు, మెట్‌పెల్లి మండలంలోని ఆరెపేటకు చెందిన అక్షయ్‌కుమార్, అతని భార్య అలేఖ్యలతో కలిసి వాటిని మంచిర్యాలలో విక్రయించేందుకు వెళ్తున్నట్లు తేలింది.

జల్సాలకు అలవాటుపడే..

జల్సాల అలవాటుతో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారని డీఎస్పీ పేర్కొన్నారు. గొలుసు చోరీ చేసిన మరుసటి రోజే విక్రయించడానికి బీంగల్ మండలానికి వెళ్లగా ఎవరూ కొనలేదన్నారు. దీంతో వారు మంచిర్యాలలో అమ్మేందుకు వెళ్తూ పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. బంగారు గొలుసుతో పాటు ఒక గ్రాము పుస్తె, 3 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులను త్వరగా పట్టుకున్న సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సైలు ఉదయ్‌కుమార్, ఉమాసాగర్, సతీశ్, శ్రీధర్‌రెడ్డి తదితరులను ఎస్పీ అభినందించారు.

నకిలీ వీసాలతో మోసగించిన కేరళవాసి..



హసిఫ్ అరెస్టు చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి(కోరుట్ల): దుబాయ్‌లో ఉద్యోగాల పేరిట నకిలీ వీసాలు ఇచ్చి, మోసం చేసిన కేసులో కేరళకు చెందిన మహమ్మద్ హసిఫ్‌ను అరెస్టు చేసినట్లు సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి తెలిపారు. వారి కథనం ప్రకారం.. హసిఫ్ గత జనవరిలో మెట్‌పల్లికి చెందిన ఏలేటి రమేశ్‌తో కలిసి ఈ ప్రాంతంలోని పలు వురికి దుబాయ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. ఒక్కొక్కరి నుంచి రూ.26,500 చొప్పున వ సూలు చేశాడు. అనంతరం వీసాలు ఇవ్వగా వారు హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. అక్కడి అధి కారులు పరిశీలించి, అవి నకిలీవని తేల్చారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు న మోదైంది. పోలీసులు గత ఫిబ్రవరిలో రమేశ్‌ను అరెస్ట్ చేశారు. బుధవారం హసిఫ్‌ను అరెస్టు చేసిన ట్లు సీఐ పేర్కొన్నారు. ఇదే కేసులో మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి..



అరెస్టు చూపుతున్న సీఐ సురేశ్‌బాబు

కోరుట్ల రూరల్: పట్టణంలోని హాజీపురకు చెందిన మహమ్మద్ షబ్బీర్‌ను గంజాయి తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు సీఐ సురేశ్‌బాబు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణ శివారులోని వెటర్నరీ విశ్వవిద్యాలయం వద్ద ఎస్సై శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో షబ్బీర్ బైక్‌పై నిజామాబాద్ నుంచి కోరుట్లకు గంజాయి తీసుకువస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి 210 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. షబ్బీర్ కోరుట్ల పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో గంజాయి విక్రయిస్తున్నాడని తెలిపారు. ఎస్సైని, సిబ్బందిని అభినందించారు. సీఐ వెంట ఎస్సై కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

క్లుప్తంగా

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి



మంత్రిని కలిసిన బాలాజీనగర్ వాసులు

కరీంనగర్ కార్పొరేషన్: తమ కాలనీలోని డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ నగరంలోని 21వ డివిజన్ బాలాజీనగర్ కాలనీవాసులు రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. బుధవారం నగరంలోని మంత్రి నివాసంలో కలిసిన కాలనీవాసులు మురికినీరు నిలవడంతో తాము పడుతున్న అవస్థలను వివరించారు. ఇందుకు స్పందించిన మంత్రి పొన్నం నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి సమస్యపై ఆరా తీశారు. వెంటనే పరిష్కరించాలని, కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో కాలనీ వాసులు నాంపల్లి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, కొమురయ్య, శ్రీమతిరెడ్డి, రమ, రజిత తదితరులు ఉన్నారు.

కచ్చాకాలువ పనులు పరిశీలన

కరీంనగర్ కార్పొరేషన్: బాలాజీనగర్‌లో నిలుస్తున్న మురుగునీటిని తొలగించేందుకు నగరపాలక సంస్థ చేపట్టిన చర్యలను బుధవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి తనిఖీ చేశారు. కచ్చాకాలువ ద్వారా మురుగునీటిని తొలగించడాన్ని పరిశీలించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ డీఈ వెంకటేశ్వర్లు, సిబ్బంది,కాలనీ వాసులు ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్ బెల్టుల ప్రదానం



విద్యార్థులతో ఇన్‌స్ట్రక్టర్ వసంత్‌కుమార్

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ బెల్టుల ప్రదానోత్సవం నిర్వహించారు. మొత్తం 14 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసి బెల్టులు సాధించారు. మార్షల్ ఆర్ట్స్‌తో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా పటిష్టంగా ఉంటారని పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బబిత విశ్వనాధన్, మార్షల్ ఆర్ట్ చీఫ్ కోచ్ వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిలుక దుర్గమ్మ ఆలయం పునః ప్రారంభం



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లోని ఎస్సీ కాలనీలో గల అతి పురాతన చిలుకదుర్గమ్మ ఆలయాన్ని పునర్మించి బుధవారం రోజున భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ కాసారపు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నాయకుడు నరహరి లక్ష్మారెడ్డి, ఆలయ పునర్నాణ కమిటీ సభ్యులు అంజయ్య, పోశయ్య, లక్ష్మీరాజం, మల్లయ్య, చంద్రయ్య, రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను శ్రీనివాస్‌గౌడ్ సన్మానించారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

కరీంనగర్‌టౌన్: కేన్సర్‌తో బాధపడుతున్న నిరుపేద మహిళకు బుధవారం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో కేఏజేపీఎస్ ప్లస్ సంస్థ, ఏఆర్‌టీ సెంటర్ ఆధ్వర్యంలో చొప్పదండి మండలం పెద్దకుర్మపల్లికి చెందిన కూకట్ల మల్లయ్య రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సూర్యకిరణ్, కేఏజేపీఎస్‌ప్లస్ సంస్థ అధ్యక్షురాలు టి.మమత, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.02 లక్షలు పట్టివేత

కరీంనగర్‌క్రైం: శాతవాహన యూనివర్సిటీ సమీపంలో బుధవారం రాత్రి రూ.1,02,400 నగదు తరలిస్తున్న రేకుర్తి విజయపురికాలనీకి చెందిన మనోహర్‌ను పట్టుకున్నట్లు టూటౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. పట్టుకున్న నగదును సీజ్ చేశామని అన్నారు.

అన్నదానం

కరీంనగర్: అభయ రామన్ సొసైటీ(ఏఆర్ అకాడమీ) ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అకాడమీ డైరెక్టర్ భూపెల్లి లక్ష్మణ్, సీనియర్ ఫ్యాకల్టీ వేణు, శ్రీనివాస్‌రావు, సాహితీ పాల్గొన్నారు.



విద్యార్థులకు కలెక్టర్ అభినందన

కరీంనగర్/కొత్తపల్లి: జనవరి 26న ఢిల్లీలో ప్రధాని మోదీ హాజరైన పెరేడ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎన్‌సీసీ విభాగం నుంచి పాల్గొన్న కొత్తపల్లి సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి శ్రీచరణ్, బొమ్మకల్ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీ విద్యార్థి విజయ్‌కుమార్‌లను బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. రాబోయే కాలంలో మరిన్ని ఉన్నతమైన కార్యక్రమంలో పాల్గొని మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ 9వ బెటాలియన్ కల్నల్ డానియన్ లొద్దము, మేజర్ సుబేదార్ సాగర్ సింగ్, ఎక్స్ సర్వీస్‌మెన్ అబ్దుల్ ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.



ఉష్ణ తాపం.. నీటితో ఉపశమనం

కరీంనగర్ అర్బన్: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుతుండగా సకల వర్గాలు సతమతమవుతున్నాయి. ఇక నోరు లేని జీవాల పరిస్థితి మరీ ఘోరం. జీవాలను కాపాడుకునేందుకు రైతులు పాట్లు పడుతుండగా ఉద్యానవనాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టారు. నగరంలోని జింకల ఉద్యానవనంలో పక్షుల పందిళ్లకు నీటిని పడుతూ తాత్కాలిక ఉపశమనం అందిస్తున్నారు. పక్షులు, జంతువులను కాపాడేందుకు ప్రయత్నం చేస్తున్నారు.



సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

కొత్తపల్లి: కొత్తపల్లి శివాలయంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మూడో రోజైన బుధవారం 108 అష్టోత్తర శత కలశ సుగంధ ద్రవ్య అభిషేకం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. చివరి రోజైన గురువారం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఘట్టాలను నిర్వహించనున్నారు. శృంగేరి వేద పండితుల పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా జరుగుతున్న ఈ వేడుకల్లో భక్తులు పాలుపంచుకుంటున్నారు.

అఖిల్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



అఖిల్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు అఖిల్ కుటుంబాన్ని ఆదుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. బుధవారం నగరంలోని ముకరాంపురలో ఉన్న అఖిల్ నివాసానికి వెళ్లిన మంత్రి పొన్నం అఖిల్ కుటుంబసభ్యులను పరామర్శించారు. అఖిల్ అకాల మరణం తనను కలిచివేసిందన్నారు. పార్టీ కోసం కష్టపడిన అఖిల్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. మంత్రి వెంట పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌ఏ మోసిన్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజ్, మహ్మద్ అమీర్, ఇమ్రాన్, షహబాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పీసీసీ అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావు అఖిల్ కుటుంబసభ్యులను పరామర్శించారు. తన సహచర నాయకుడు అఖిల్ లేని లోటు పూడ్చలేనిదన్నారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి

కరీంనగర్ సిటీ: పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. బుధవారం ఎస్సారార్‌లో బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 'సయోనర' పేరిట నిర్వహించిన వీడ్కోలు వేడుకకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బయో టెక్నాలజీ అధ్యయనంతో పలు రంగాల్లో నైపుణ్యం గల యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. బయోటెక్నాలజీ విభాగాధిపతి సి.కిశోర్ కుమార్ మాట్లాడుతూ ప్రముఖ సంస్థలైన సీఎస్ఐఆర్, ఐసీఎంఆర్, సీసీఎంబీ, ఎన్ఐఎన్, లాంటి సంస్థల్లో సైంటిస్టులుగా వివిధ రకాల ఫార్మా ఇండస్ట్రీల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. బయోటెక్నాలజీలో ఈ అకాడమిక్ సంవత్సరంలో జరిగిన విషయాల గురించి నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మల్లారెడ్డి, బాటనీ విభాగాధిపతి శంకర్, మైక్రో బయోలజీ ఆచార్య ముత్తన్న ,ఇంగ్లిష్ విభాగాధిపతి ఉమామహేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మేనేజ్‌మెంట్ మీట్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్

కొత్తపల్లి: నగరంలోని వివేకానంద డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన సూయ్ జెనరిస్-2024 మేనేజ్‌మెంట్ మీట్‌లో సీతారాంపూర్ సూర్యనగర్‌లోని ఆల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. ప్రాయెజిక్, సంకల్ప్, విశేషక్, నర్తన్, చాయాకృతి, జాగృతి, స్వయం, చలన చిత్ర, చిత్రకళ వంటి 14 అంశాల్లో బహుమతులు గెలుపొంది ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకున్నారని అన్నారు. చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థినులను బుధవారం అభినందించి మాట్లాడుతూ విద్యతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ, నైపుణ్య మెలకువలను బోధిస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో కళాశాల విద్యార్థినులు ఐదవ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించడం గర్వంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్, మేనేజ్‌మెంట్ విభాగం హెచ్‌వోడీ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులు

బండి సంజయ్ డ్రామాలు ఇక సాగవు

- రైతులకు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలి
- సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: ఎంపీ బండి సంజయ్ దొంగదీక్షలు, నాటకాలు ఇక సాగవని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఉద్యమించిన రైతులపై రబ్బర్ బుల్లెట్‌లు ప్రయోగించి, గుర్రాలతో తొక్కించిన చరిత్ర బీజేపీదన్నారు. అలాంటి బీజేపీ నేత రైతు దీక్ష పేరిట డ్రామాలు చేస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎంపీగా ఐదేండ్లు కరీంనగర్‌కు ఏం చేశాడో చెప్పాలని, దేవుడి పేరిట మత రాజకీయాలు సరికాదన్నారు. నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా తీసుకురాని సంజయ్ ఆరు గ్యారంటీలకు నిధులు తెస్తామంటున్నాడని ఎద్దేవా చేశారు. దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు అప్పటి మంత్రి, మేయర్‌తో కలిసి వాటాలు పంచుకున్నాడని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు రైతుల వద్దకు వెళ్లేముందు క్షమాపణ చెప్పాలన్నారు. రైతుల ఈ దుస్థితికి తామే కారణమని చెప్పి, క్షమాపణలు అడగాలని ఆయన సూచించారు. నాయకులు కొరివి అరుణ్ కుమార్, బానోతు శ్రవణ్ నాయక్, వాడె వెంకటరెడ్డి, బొబ్బిలి విక్టర్, దండి రవీందర్, కుర్ర పోచయ్య, జీడీ రమేశ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాస్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చేగుర్తి, మొగ్దుంపూర్, చామనపల్లి, నగునూరు గ్రామాల్లోని ఐదు ఎరువుల దుకాణాలను బుధవారం డీఏవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువుల నిల్వ, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈనెల 1 నుంచి కొత్త స్టాక్ రిజిస్టర్లను డీలర్లు నిర్వహించాలని సూచించారు. ప్రతీ డీలరు కొత్తగా స్టాక్ రిజిస్టర్, బిల్లుబుక్‌లను మండల వ్యవసాయాధికారితో సర్టిఫికేషన్ చేయించుకోవాలని అన్నారు. డీఏవో వెంట ఏవో బి.సత్యం ఉన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి



మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

కరీంనగర్: వేసవికాలంలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. బుధవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాగునీరందక రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఎగువ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టుల నుంచి దిగువలో ఉన్న మిడ్‌మానేరు, ఎల్ఎండీ, ఇతర ప్రాజెక్టులకు నీళ్లు తెప్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనేక రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల ఉసురు పోసుకుందన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రైతు దీక్ష చేస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ శ్రేణులను సిద్ధం చేసేందుకు ఈనెల 6న కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల, ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో కరీంనగర్ జరుగుతుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్,కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బుచ్చన్న యాదవ్, రాజు, యుగేందర్, మహేందర్, రమేశ్, వెంకటేశ్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఐదు శాతం రాయితీతో ఆస్తి పన్ను చెల్లించండి

కరీంనగర్ కార్పొరేషన్: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈనెల 30వ తేదీలోగా ఆస్తి పన్ను చెల్లించి ఐదు శాతం రాయితీ పొందాలని నగర పాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్లీబర్డ్ స్కీంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కార్యాలయ బిల్ కలెక్టర్, నగర పాలక సంస్థ కార్యాలయం, ఆన్‌లైన్ ద్వారా ఆస్తి పన్ను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

గ్రానైట్ లారీని ఢీకొన్న ట్యాంకర్



కొత్తపల్లి: మండలంలోని బావుపేట శివారు పాత వంతెనపై బుధవారం మధ్యాహ్నం గ్రానైట్ లారీని వెనక నుంచి ఓ ట్యాంకర్ ఢీకొట్టింది. పక్కనుంచి వెళ్లేందుకు ప్రయత్నించిన టిప్పర్ మధ్యలో ఇరుక్కుపోయింది. దీంతో వెళ్లేందుకు దారి లేక కరీంనగర్-వేములవాడ రహదారికి ఇరువైపులా అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఎండలో సుమారు రెండు గంటలపాటు వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. వేములవాడ వైపు నుంచి వస్తున్న కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ వై.సునీల్‌రావు, ఇతర ప్రజాప్రతినిధుల వాహనాలు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. చివరకు పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంతో అందరూ వెళ్లిపోయారు.

'రైతులపై బీజేపీది కపట ప్రేమ'

కరీంనగర్: రైతులపై భారతీయ జనతా పార్టీకి ఉన్నది కపట ప్రేమ అని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం ఒక ప్రకటనలో అన్నారు. రైతులకు నష్టం కలిగించి, కార్పొరేట్ శక్తుల జేబులు నింపేందుకు తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో శాంతియుతంగా పోరాటం చేస్తున్న 1200 రైతుల ప్రాణాలను బీజేపీ బలిగొన్నదన్నారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఐదేళ్లలో ఏమి అభివృద్ధి సాధించారని, మళ్లీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. రైతుల ఉద్యమానికి తలొగ్గి, మీడియా ముందే క్షమాపణ కోరిన నరేంద్ర మోదీ రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం రైతులను దగ చేయడమేనని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా లౌకికవాదులు ఏకంకావాల్సిన అవసరం ఉందన్నారు.

కరీంనగర్ కార్పొరేషన్: రైతుల పట్ల ఎంపీ బండి సంజయ్‌ది కపట ప్రేమ అని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఐదేళ్లలో ఎంపీగా రైతులను పట్టించుకోని సంజయ్, ఎన్నికల వేళ మళ్లీ కొత్త డ్రామాకు తెరతీశారని అన్నారు. రైతుల కోసం కేంద్రం నుంచి ఒక్కరూపాయి కూడా తేలేని సంజయ్, ఇప్పుడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నాడన్నారు. బండి ఎన్ని నాటకాలు వేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

రైతాంగాన్ని మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ వాసాల రమేశ్

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రైతులను మభ్యపెట్టి అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్ అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా రెండు లక్షల రుణమాఫీ, 15వేల రైతు భరోసాను ఎందుకు అమలు చేయలేదో రైతాంగానికి సమాధానం చెప్పాలన్నారు. సాగునీరు లేక రైతులు అల్లాడుతున్నారని, పంటలను కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతులు అనేక కష్టాల్లో ఉంటే, రైతాంగాన్ని ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తుందని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, తక్షణమే వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలని, ఇతర పంటలకు సైతం బోనస్ అందించాలన్నారు. ఈ సమావేశంలో దుబాల శ్రీనివాస్, బాస సత్యనారాయణరావు, గుగ్గిల్లపు రమేశ్, రాజేంద్రప్రసాద్, కొలగాని శ్రీనివాస్, పురం హరి, జానపట్ల స్వామి, రాగి సత్యనారాయణ, కేంచే శేఖర్, కడర్ల రతన్ కుమార్, వేముల చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, హరిప్రసాద్, చిట్టిబాబు, నర్సన్న, పద్మయ్య పాల్గొన్నారు.

నేషనల్ స్పేస్ సెటిల్‌మెంట్ ఫలితాల్లో ప్రతిభ

సప్తగిరికాలనీ: నగరంలోని విద్యారణ్యపురిలో గల శ్రీచైతన్య ఐపీఎల్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సాత్విక్ వరణ్య అమెరికా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ స్పేస్ సెటిల్‌మెంట్ ప్రోగ్రాంలో విజేతగా నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఈ ప్రాజెక్టులో శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన ఏడు ప్రాజెక్టులు ప్రథమ బహుమతి, 11 ప్రాజెక్టులు ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతిని 15 ప్రాజెక్టులు, హానరబుల్ మెన్షన్‌గా 29 ప్రాజెక్టులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, రాజు, ప్రవీణ్, శ్రీకాంత్‌రెడ్డి, మధుకర్, మోసిన్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



సాత్విక్ వరణ్యను అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం

భారత రాజ్యాంగం చాలా గొప్పది

కరీంనగర్: భారత రాజ్యాంగం గొప్పదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం ఎస్ఎస్‌గార్డెన్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. రాబోయే వర్షాకాలంలో బాగా వర్షాలు కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్నారు. మేయర్ వై.సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మౌలానా కాజా అలీమొద్దీన్, రభాని, కమాలోద్దీన్, సర్వర్, నసీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న గంగుల కమలాకర్, వినోద్‌కుమార్


చేయూత వాహనం మంజూరు

సప్తగిరికాలనీ: దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చేయూత వాహనం మంజూరైనట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆపదలో ఉన్న, సహాయం అవసరమైన దివ్యాంగులు, వయోవృద్ధులకు ఈ వాహనం ఉపయోగిస్తారని పేర్కొన్నారు. ఆపదలో సహాయం అవసరమైన వయోవృద్ధులు 14567 టోల్‌ఫ్రీ నంబర్‌కు, దివ్యాంగులు 155326 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

అధిక ఫీజు వసూళ్లను అరికట్టాలి

కరీంనగర్: ఇంటర్‌బోర్డు నిబంధనలు పట్టించుకోకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల ఆగడాలను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ముందస్తు అడ్మిషన్లు, వేసవి తరగతులు నిర్వహిస్తున్నాయని అన్నారు. వివిధ కోర్సుల పేరుతో, పండుగలు పేరు మీద వివిధ ఆకర్షణీయమైన పేర్లు పెట్టి విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని తెలిపారు. ఫీజులో రాయితీ ఇస్తామంటూ అడ్మిషన్లు చేపడుతున్నా జిల్లా ఇంటర్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు.

అభినందన



కరీంనగర్‌క్రైం: నూతనంగా ఎన్నికైన కరీంనగర్ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని బుధవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లోని ఆయన నివాసంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి, కార్యదర్శి బీమా సాహెబ్, స్పోర్ట్స్ సెక్రెటరీ మడిపల్లి రవి, లైబ్రరీ సెక్రెటరీ కటకం రాజేందర్, మహిళా ప్రతినిధి దేవులపల్లి రేణుక, సీనియర్ ఈసీ సభ్యులు సుంకె దేవాకిషన్ ,కందుల అరుణ్‌కుమార్, మాతంగి రవీందర్, జూనియర్ ఈసీ సభ్యులు బెజ్జంకి శ్రీకాంత్, కొండ్ర లక్ష్మయ్య, పస్తం ఆంజనేయులు పాల్గొన్నారు.

గోవిందపూర్‌కు అధికారులు

గ్రామస్తులతో మాట్లాడి వివరాల సేకరణ

- నివాస ప్రదేశంలో తాగునీటి వసతి కల్పించేందుకు చర్యలు



కొత్త గ్రామంలో వసతులను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

తాంసి: కిడ్నీ వ్యాధితో ఉన్న ఊరిని వదిలివెళ్లిన ఆ గిరిజనుల గోసను కళ్లకు కట్టేలా వివరించిన 'సాక్షి'కథనం అధికార యంత్రాంగాన్ని కదిలించింది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కమట్‌వాడ జీపీ పరిధిలోని గోవింద్‌పూర్ గిరిజన గ్రామాన్ని అధికారులు బుధవారం సందర్శించారు. 'కిడ్నీ వ్యాధితో ఊరు ఖాళీ'శీర్షికన సాక్షి మెయిన్‌లో కథనం ప్రచురితమైంది. కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాన్ని సందర్శించి పలు వివరాలు సేకరించారు. డీఎల్‌పీఓ ఫణీందర్‌తో పాటు ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ తదితరులు గిరిజనులు విడిచి వెళ్లిన గ్రామాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న వసతులతో పాటు తాగునీటికి గ్రామస్తులు ఉపయోగించిన చేతిపంపులను పరిశీలించారు. గ్రామాన్ని విడిచి వెళ్లడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నివా సం ఉన్న ప్రదేశంలో తాగునీరు, ఇతర అవసరాల కు ఏ నీటిని ఉపయోగిస్తున్నారని అడగ్గా, తాగేందుకు పక్కన ఉన్న ధనోరా నుంచి ఆటో ద్వారా మినరల్ వాటర్ తెప్పించుకుంటున్నామని చెప్పారు. ఇతర అవసరాలకు పక్కన ఉన్న వ్యవసాయబావి నీటిని వాడుకుంటున్నామన్నారు. ఆ బావిలోని నీటిని అధికారులు పరిశీలించారు. శాంపిళ్లు సేకరించి పరీక్ష చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి డీఎల్‌పీఓ సూచించారు. ప్రస్తుతమున్న చోట ట్యాంక్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. కలెక్టర్‌కు విన్నవించి ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు.

వైద్యశిబిరం ఏర్పాటు

భీంపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి నిఖిల్‌రాజ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు. కిడ్నీతో పాటు ఇతర వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేసినట్టు తెలిపారు. కిడ్నీ సంబంధ వ్యాధికి గల కారణాలు తెలుసుకునేందుకు త్వరలోనే మరో క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు.



పరిశ్రమలో రియాక్టర్ పేలటంతో కమ్ముకున్న పొగ



ఎస్‌బీ ఆర్గానిక్ పరిశ్రమ వద్ద గుమిగూడిన గ్రామస్తులు, ఉద్యోగులు



ఎస్‌బీ పరిశ్రమను పరిశీలిస్తున్న మంత్రి కొండా సురేఖ

రసాయన పరిశ్రమలో పేలిన రియాక్టర్

ఘోర ప్రమాదంలో పరిశ్రమ యజమాని సహా ఐదుగురు మృత్యువాత

- 30 మందికి పైగా కార్మికులకు గాయాలు.. ఏడుగురి పరిస్థితి విషమం
- మృతులు వివిధ రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తింపు
- సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్‌లో ఘటన

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ హత్నూర/ సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్‌లో ఉన్న ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. పరిశ్రమలో ఉన్న ఆయిల్ రియాక్టర్ బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా పేలిపోయింది. దీంతో అగ్నికీలల్లో చిక్కుకుని పరిశ్రమ యజమానుల్లో ఒకరైన హైదరాబాద్‌కు చెందిన రవి (45), ఆంధ్రప్రదేశ్, తమిళనాడులకు చెందిన ప్రొడక్షన్ ఆఫీసర్లు సుబ్రహ్మణ్యం (36), దయానంద్ (48), మధ్యప్రదేశ్‌కు చెందిన మెయింటెనెన్స్ ఇన్‌చార్జి సురేష్ పాల్ (45) సజీవ దహనమయ్యారు. చందాపూర్ గ్రామానికి చెందిన కార్మికుడు చాకలి విష్ణు (35) హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ప్రమాదంలో మొత్తం ఐదుగురు మరణించారని సుమారు 30 మందికి పైగా కార్మికులు తీవ్రంగా గాయపడినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి బుధవారం రాత్రి ప్రకటించారు. గాయపడిన వారిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, స్థానిక ఎంఎన్‌ఆర్ ఆసుపత్రికి, హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రులకు తరలించినట్లు తెలిపారు. గాయపడిన వారిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహలు, జిల్లా ఎస్పీ రూపేష్, వివిధ శాఖల అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించారు.



రవివర్మ



విష్ణు

పేలుడు ధాటికి కంపించిన భూమి

ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో సుమారు 200 మంది వరకు షిఫ్టుల వారీగా పనిచేస్తున్నారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో సుమారు 60 మంది కార్మికులు విధుల్లో ఉండగా పెద్ద శబ్దంతో రియాక్టర్ పేలింది. పేలుడు ధాటికి పరిశ్రమలో ఉన్నవారు ఎగిరి కొన్ని మీటర్ల దూరంలో చెల్లాచెదురుగా పడిపోయారు. మంటల్లో కాలి మరణించినవారు, తీవ్రంగా గాయపడిన వారితో భీతావహ పరిస్థితి నెలకొంది. బాధితుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఆవరణంతా దట్టమైన పొగ అలుముకుంది. పరిశ్రమతో పాటు, చుట్టుపక్కల ఉన్న భవనాలు ధ్వంసమయ్యాయి. సుమారు ఐదు కిలోమీటర్ల దూరం వరకు భూమి కంపించడం, ఇంటి పైకప్పులు సైతం ఎగిరిపోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. రెడ్డిఖానాపూర్‌లో భూమి కంపించిందని కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన నారాయణ తెలిపారు.

కార్మికుల కుటుంబాల ఆందోళన

పేలుడుతో అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. చెలరేగిన మంటలు రెండో రియాక్టర్‌కు కూడా అంటుకోవడంతో అది కూడా పేలుతుందని అధికారులు భయపడ్డారు. ముందు జాగ్రత్తగా చుట్టుపక్కల వారందరినీ అక్కడి నుంచి తరలించారు. పరిశ్రమ ఎదుట కార్మికుల కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన నిర్వహించారు. రాత్రి తొమ్మిది గంటల తర్వాత మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పరిశ్రమను పరిశీలించిన మంత్రులు

మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహలు కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిశ్రమను పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని, బాధితులకు మెరుగైన చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలతో పాటు, గాయపడిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని కొండా సురేఖ హామీ ఇచ్చారు. పరిశ్రమల్లో భద్రత చర్యలు చేపట్టకపోవడం వల్లే ప్రమాదాలు సంభవించినప్పుడు కార్మికులు మరణిస్తున్నారని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. అనంతరం ఎంఎన్‌ఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దిలీప్‌రెడ్డి, శ్రీనివాస్, మస్తానయ్య, పూడి కుమార్‌రెడ్డి, సీహెచ్ భాస్కర్, సాయికుమార్, ధన్‌రాజ్, మాధవరావు ,అజయ్ పరిహార్, మాధవ్ సింగ్, అశోక్ సింగ్ , రాజేష్, నరసింహులు, ఉద్ధవ్, మల్లేశంలను మంత్రి పరామర్శించారు.

ప్రముఖుల దిగ్భ్రాంతి

ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు మరణించడంపై రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ యంత్రాంగానికి సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డిని ఆదేశించారు. కాగా మృతుల కుటుంబాలకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలియజేశారు. తీవ్రంగా గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలం చెల్లిన రియాక్టర్!

పరిశ్రమల శాఖ ప్రాథమిక నిర్ధారణ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో పేలిపోయిన రియాక్టర్ కాలం చెల్లినదిగా పరిశ్రమల శాఖ వర్గాలు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఈ కారణంగానే రియాక్టర్ నుంచి ఆయిల్ లీకేజీ జరిగి అగ్ని ప్రమాదానికి దారితీసిందని, రియాక్టర్ పేలిపోయిందని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. కాగా ప్రమాదంపై ప్రాథమిక విచారణ ప్రారంభించామని, ఇప్పుడే ఏమీ చెప్పలేమని ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇలావుండగా పరిశ్రమలో మొత్తం మూడు యూనిట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. యూనిట్ -1లో ప్రమాదం జరిగింది. ఇందులో గైనిడైన్ నైట్రేట్, గైనిడైట్ కార్బోనేట్ తయారవుతుందని అధికారులు తెలిపారు. ఇవి పేలుడు పదార్థాలకు సంబంధించిన ఉత్పత్తులని వివరించారు. మిగతా రెండు యూనిట్లలో బల్క్‌డ్రగ్స్ తయారవుతాయని పేర్కొన్నారు.

కొత్త రుణాలు కావాలా..

పాత అప్పు కట్టండి

రైతులకు తేల్చి చెప్తున్న బ్యాంకులు ● మౌఖిక ఒత్తిళ్లు.. లీగల్ నోటీసులు సైతం జారీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు రుణాలు ఇచ్చిన బ్యాంకులు వారి ముక్కుపిండి మరీ తిరిగి వసూలు చేస్తున్నాయి. లీగల్ నోటీసులు, మౌఖిక ఆదేశాలు, ఒత్తిళ్లతో వడ్డీతో సహా రాబట్టుకుంటున్నా యి. కొన్ని బ్యాంకులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఎంతో కొంత తగ్గించి వసూలు చేస్తున్నాయి. కొత్త రుణాలు కావాలంటే పాత అప్పు చెల్లించాల్సిందేనంటూ మెడపై కత్తి పెట్టినట్లుగా వ్యవహరిస్తున్నా యి. కొన్ని బ్యాంకులు రైతుల ఖాతాల్లోని రైతుబంధు సొమ్మును లాగేసుకుంటున్నాయి. దీంతో కొందరు రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు తెచ్చి మరీ బ్యాంకులకు చెల్లిస్తున్నారు. రుణమాఫీ జరుగుతుందనే ఆశతో అప్పులు తిరిగి చెల్లించలేదని, రుణమాఫీ జరగకపోగా వడ్డీ తడిచిమోపెడు అవుతోందని గగ్గోలు పెడుతున్నారు. రుణమాఫీ జరిగేవరకు వేచి చూడాలని వేడుకుంటున్నా బ్యాంకులు వినడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు బ్యాంకులు నోటీసులు..మరోవైపు వ్యవసాయశాఖ చేతులెత్తేయడం, రుణమాఫీ ఎప్పుడు జరుగుతుందో తెలియక, కొత్తగా అప్పు పుట్టే పరిస్థితి లేక రైతులు నలిగిపోతున్నారు.

ముందుకు సాగని రూ.2 లక్షల రుణమాఫీ

తమ పార్టీని గెలిపిస్తే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఇప్పుడదే పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ నాలుగు నెలలైనా ఇప్పటివరకు రుణమాఫీకి సంబంధించిన ప్రక్రియ మొదలు కాలేదు. కనీసం మార్గదర్శకాలు కూడా ఖరారు చేయలేదు. కానీ రూ.2 లక్షల వరకు రుణాన్ని మాఫీ చేయాలంటే రూ.30 వేల కోట్లు అవసరమవుతాయని మాత్రం ప్రభుత్వం అంచనా వేసింది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు.. ఎలా చేయాలి? ఏ తేదీ వరకు రుణమాఫీ చేయాలి అన్న అంశంపై తర్జనభర్జన పడుతున్నారు.

ఇప్పట్లో సాధ్యం కాదా?

ఎన్నికల కోడ్‌తో ఇప్పటికిప్పుడు రుణమాఫీకి మార్గదర్శకాలు ఖరారు చేయడం, ఇతరత్రా ప్రక్రియ మొదలు పెట్టడం కానీ సాధ్యం కాదని అధికారులు అంటున్నారు. దీంతో జూన్ మొదటి వారం వరకు రుణమాఫీపై అడుగు ముందుకు పడే అవకాశం లేదు. మరోవైపు వానాకాలం సీజన్ జూన్ నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు మే నుంచే రైతులు సిద్ధం అవుతుంటారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం, త్వరగా వర్షాలు కురిస్తే దుక్కులు దున్నడానికి సన్నాహాలు చేసుకుంటుంటారు. ఇంకోవైపు ఏప్రిల్ నుంచే వానాకాలం సీజన్ పంట రుణాల ప్రక్రియను బ్యాంకులు ప్రారంభిస్తాయి. కానీ రుణమాఫీ జరగకుంటే కొత్త రుణాలు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో అప్పులు తిరిగి చెల్లించాలని, రెన్యువల్ చేసుకోవాలని బ్యాంకులు నోటీసులు జారీ చేస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.

> "బ్యాంకుల్లో రైతు రుణాలు ఉన్నవాళ్లు ఎవ్వరూ కట్టకండి.. మేం అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తాం"
> అప్పట్లో పలు ఎన్నికల ప్రచార సభల్లో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి

ముందు చెల్లించండి.. తర్వాత సర్దుబాటు చేస్తాం

రాష్ట్రంలో ప్రతి ఏటా సగటున 42 లక్షల మంది వరకు రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకుంటారు. రుణం తీసుకున్న రైతులు మూడు సీజన్లలోగా బకాయిలు చెల్లిస్తేనే తదుపరి రుణం తీసుకోవడానికి అర్హులవుతారు. అయితే ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో రైతులు తమ బకాయిలను చెల్లించలేదు. మరోవైపు దీర్ఘకాలంగా బకాయిలు పేరుకుపోయిన వారు కూడా అవి చెల్లించలేదు. ఈ నేపథ్యంలో బ్యాంకులు చెప్పిన ప్రకారం పాత అప్పులు చెల్లించాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీ నిధులు విడుదల చేశాక సర్దుబాటు చేస్తామని చెబుతున్నారు. రుణాలు రెన్యువల్ చేసుకోకపోతే రైతులు డిఫాల్టర్లుగా మారిపోతారు. అయితే కొన్ని బ్యాంకులు రైతుబంధు సొమ్మును జమ చేసుకోవడం ద్వారా రెన్యువల్ చేయడం గమనార్హం. కాగా తాము రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారమే నడుచుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకోవడం సాధ్యం కాదని ఒక బ్యాంకు అధికారి 'సాక్షి'కి చెప్పారు. బకాయిలు పేరుకుపోతే ఎవరినైనా డిఫాల్టర్లుగా ప్రకటిస్తామని అన్నారు. లక్షలాది మంది రైతుల రుణ బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని, అందుకే నోటీసులు ఇస్తున్నామని స్పష్టం చేశారు. పాత రుణాన్ని అలాగే ఉంచి కొత్త రుణం ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు.

కేజీబీవీలో ఫుడ్ పాయిజన్!

- నర్సాపూర్(జి) పాఠశాలలో ఘటన
- 20 మంది విద్యార్థినులకు అస్వస్థత
- ఏడుగురు విద్యార్థినులకు నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స
- పరిశీలించిన డీఈవో, సెక్టోరియల్ అధికారి



చికిత్స పొందుతున్న విద్యార్థులను పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి శ్రీదేవి

నర్సాపూర్(జి): నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని కేజీబీవీలో బుధవారం ఫుడ్ పాయిజన్ జరిగింది. ఈ ఘటనలో 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఏడుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని నిర్మల్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మిగతా 13 మంది విద్యార్థినులకు స్థానికంగానే ఆర్బీఎస్కే వైద్య సిబ్బంది చికిత్స అందించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, కేజీబీవీల సెక్టోరియల్ అధికారి శ్రీదేవి విద్యార్థులను పరిశీలించారు.

ఏం జరిగిందంటే..

పాఠశాల విద్యార్థులు ఎప్పటిలాగే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం చేశారు. ఆ తర్వాత విద్యార్థులకు వాంతులు, విరోచనాలు కావడంతో ఆందోళన చెందారు. 20 మంది ఇబ్బందులు పడుతుండడంతో కస్తూరిబా సిబ్బంది ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఉదయం ఉప్మా, మధ్యాహ్నం ఆలుగడ్డ కూరతో భోజనం చేశారని తెలిపారు. ఒక్కోసారి రాత్రి వండిన వంటలను మరుసటి రోజు ఉదయం విద్యార్థులకు వడ్డిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థుల అస్వస్థతకుఏ ఫుడ్ పాయిజన్ కాకపోవచ్చని, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో అస్వస్థతకు గురై ఉండవచ్చని అధికారులు తెలిపారు.




నిర్మల్ ఆస్పత్రిలో విద్యార్థినులు



విద్యార్థినికి చికిత్స చేస్తున్న వైద్యుడు

సరిహద్దుల్లో అలజడి

- వరుస ఎన్‌కౌంటర్లతో జిల్లా పోలీసులు అప్రమత్తం
- మావోయిస్టులు చొరబడకుండా నిఘా తీవ్రతరం



మంథని: పార్లమెంటు ఎన్నికల వేళ ఉమ్మడి కరీంనగ్ జిల్లాకు సరిహద్దున ఉన్న తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో 15రోజులుగా యుద్ధవాతావరణం నెలకొంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో వరుసగా ఎన్‌కౌంటర్లు జరగడంతో 20 మంది మావోయిస్టులు మృతిచెందారు. 15రోజుల క్రితం మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రతా బలగాలు ముగ్గురు మావోయిస్టులను హతమార్చి పైచేయి సాధించాయి. ఆ తర్వాత గడచిన వారం రోజుల్లో ఉమ్మడి కరీంనగర్ సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో రెండు భారీ ఎన్‌కౌంటర్లు చోటుచేసుకున్నాయి. మొదటి ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మరణించగా, మంగళవారం తెల్లవారుజామున భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య సుమారు ఎనిమిది గంటల పాటు ఏకధాటిగా జరిగిన భీకర కాల్పుల్లో ఇప్పటివరకు 13 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీస్ వర్గాలు ధ్రువీకరించాయి. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో స్వల్ప కాలంలోనే మూడు భారీ ఎన్‌కౌంటర్లు జరిగి 20 మంది మావోయిస్టులు మృతి చెందడం సరిహద్దు పల్లెల్లో యుద్ధ వాతావరణం నెలకొల్పినట్లు అయింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా వ్యూహరచన చేస్తూ మావోయిస్టులపై పైచేయి సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో ఎన్‌కౌంటర్లు జరిగిన సమయంలో తెలంగాణ పోలీసులు సైతం అత్యంత అప్రమత్తంగా ఉంటున్నారు. సరిహద్దులు దాటి మావోయిస్టులు ఆత్మరక్షణ కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వైపు రాకుండా నిఘా వ్యవస్థను పటిష్టం చేశారు. గోదావరి తీర ప్రాంతంలో తనిఖీలు, కూంబింగ్‌తో మావోయిస్టులను కట్టడి చేస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల వేళ ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టుల ప్రాబల్య ప్రాంతాల్లో బీజేపీ ప్రభుత్వం అనూహ్యంగా ప్రతీ పది కిలోమీటర్లకు ఒక పోలీస్ క్యాంప్ ఏర్పాటు చేసింది. భారీఎత్తున పోలీసు బలగాలు అడవుల్లో జల్లెడ పడుతున్నాయి. భారీ ఎన్‌కౌంటర్లకు స్కెచ్ వేస్తూ విజయపరంపర కొనసాగిస్తునానయి. బీజాపూర్ అడవుల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీలు.. భారీ ఎన్‌కౌంటర్లతో వణికిపోతున్నారు. తెల్లవారేసరికి సమీప ప్రాంతాల్లో ఏ దుర్వార్త వినాల్సి వస్తుందోనని, ఏవైపు నుంచి తుపాకుల మోత చెవుల్లో పడుతుందోనని భయపడుతున్నారు. పార్లమెంటు ఎన్నికల వరకు భారీ ఎత్తున భద్రతా బలగాలు బీజాపూర్ జిల్లాలోనే మకాం వేసి ఉంటున్న నేపథ్యంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ తూర్పు అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు లేకున్నా.. సరిహద్దుల్లోని పల్లెల్లో అలజడి కొనసాగుతోంది.

ఇద్దరిని బలిగొన్న రోడ్డు ప్రమాదం



వడ్లూరి గణపతి(ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఇద్దరిని రోడ్డు ప్రమాదం బలిగొంది. ఈ ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం ఇందిరానగర్‌లో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన గోలెం సాయికిరణ్(30) ఆసిఫాబాద్‌లో బీఎస్ఎన్ఎల్ సైట్ ఇంజనీర్‌గా చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం ఆసిఫాబాద్ వైపు వెళ్లి పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు బయలుదేరాడు. అలాగే రెబ్బెన మండలం ఇందిరానగర్‌కు చెందిన వడ్లూరి గణపతి(52) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం కూలీ పనికి వెళ్లి రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి బయలుదేరాడు. ఇందిరానగర్ వద్ద జాతీయ రహదారి దాటుతున్న గణపతిని బైక్‌తో వెళ్తున్న సాయికిరణ్ అతివేగంగా బలంగా ఢీకొట్టాడు. స్థానికులు సాయికిరణ్‌ను 108 అంబులెన్స్‌లో, గణపతిని ప్రైవేటు వాహనంలో బెల్లంపల్లికి తరలించారు. ఇద్దరు మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గణపతికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైల్వే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

- తొలిసారిగా అమలు
- ఉమ్మడి జిల్లాలో 3300మంది

మంచిర్యాలక్రైం: రైల్వే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని భారత ఎన్నికల సంఘం కల్పించింది. కొన్నేళ్లుగా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని కోరుతుండగా.. ఎట్టకేలకు ఈ పార్లమెంటు ఎన్నికల్లో తొలిసారిగా సదుపాయాన్ని కల్పించింది. దేశ పౌరులందరూ ఓటు వేయడం హక్కే కాదు బాధ్యత కూడా. కొన్ని విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయడం కుదరకపోవడంతో అలాంటి వారి కోసం ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈసారి ఏకంగా మరో 33 అత్యవసర సేవా విభాగాల్లో పని చేస్తున్న వారందరికీ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించింది. జిల్లాల వారీగా పోస్టల్ బ్యాలెట్ జారీకి సంబంధించిన నోడల్ అధికారులను నియమించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించింది. దీంతో మంచిర్యాల జిల్లాలో రైల్వేశాఖలో పని చేస్తున్న 1500 ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం లభించింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వెయ్యి మంది, ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 800 మంది వరకు ఉద్యోగులు ఉన్నారు.

ఓటు వేసే విధానం..

పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవాలని అనుకునే ఉద్యోగులు తమ ఓటరు కార్డుతోపాటు ఉద్యోగ ధ్రువీకరణ పత్రం రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. 12డీ, 13ఏ, 13బీ, 13సీ, 13డీ కవర్లను రిటర్నింగ్ సిబ్బంది అందజేస్తారు. 13ఏ కవర్‌లో ఉండే డిక్లరేషన్ ఫారంపై ఓటరు సంతకం చేయాలి. గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేయించాలి. బ్యాలెట్ సెంటర్, సీరియల్ నంబర్లు వేసి ఆ డిక్లరేషన్ ఫారాన్ని అదే కవర్‌లో ఉంచి అతికించాలి. 13బీ కవర్‌లో నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, పార్టీల పేరుతో బ్యాలెట్ పేపర్ ఉంటుంది. అభ్యర్థి ఎదురుగా స్కెచ్ పెన్‌తో రైట్ గుర్తును నమోదు చేయాలి. ఆ బ్యాలెట్‌ను 13బీ కవర్‌లో ఉంచి అతికించాలి. కవర్‌పై బ్యాలెట్ పేపర్ సీరియల్ నంబరు వేయాలి. అనంతరం 13ఏ, 13బీ కవర్లను 13సీ కవర్‌లో ఉంచి అతికించాలి. దీన్ని 13డీ కవర్‌లో ఉంచి రిటర్నింగ్ అధికారి చిరునామా రాసి పోస్టల్ ద్వారా లేదా ఓట్ల లెక్కింపు తేదీలోగా రిటర్నింగ్ అధికారికి అందజేయాలి.

మంచి అవకాశం...

గతంలో ఓటు వేసేందుకు కచ్చితంగా ఊరికి వెళ్లేవాళ్లం. ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగానికి మంచి అవకాశం కల్పించింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటును సద్వినియోగం చేసుకుంటా.

– ప్రభాకర్, సౌత్ సెంట్రల్ రైల్వే ట్రాక్‌మెన్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి, మంచిర్యాల

కేడీసీసీబీ దేశంలోనే ఓ బ్రాండ్



మాట్లాడుతున్న కొండూరి రవీందర్ రావు

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ డీసీసీబీ దేశంలోనే బ్రాండ్‌గా నిలిచిందని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. 2005లో రూ.70 కోట్ల మేర నష్టాల్లో నడుస్తున్న డీసీసీబీ 2011లో డిజిటలైజేషన్, సుపరిపాలన, వ్యాపార కార్యకలాపాల వైవిధ్యం వంటి సంస్కరణలతో స్థూలంగా రూ. 2023–24 సంవత్సరంలో రూ.100.10 కోట్లు లాభం సాధించిందని వివరించారు. రూ.100 కోట్లకు పైగా లాభాలు సాధించినందుకు బుధవారం నగరంలోని కేడీసీసీబీ ప్రధాన కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించి మాట్లాడారు. 0.74 చొప్పున ఎన్‌పీఏ సాధించినందుకు డీసీసీబీ బృందాన్ని, సీఈవో ఎన్ సత్యనారాయణరావును అభినందించారు. ఎస్‌బీఐ, యూబీఐ తర్వాత వ్యవసాయ రంగానికి ఆర్థిక సాయం చేయడంతోపాటు వ్యాపారం చేయడంలో జిల్లాలో కేడీసీసీబీ మూడో అతిపెద్ద బ్యాంకుగా నిలుస్తుందన్నారు. ఉద్యోగులు అసాధారణంగా పనిచేసి మంచి ఫలితాలు సాధించారని సీఈవో ఎన్.సత్యనారాయణరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీబీ వైస్ చైర్మన్ పి.రమేశ్, డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, గోపాల్‌రావు, సీఏ రమేశ్, జనరల్ మేనేజర్ ఉషశ్రీ, డీసీవో విజయకుమారి, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ గరుడ' షురూ





డ్రోన్‌ను పరిశీలిస్తున్న రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్, పోలీసు అధికారులు

పెద్దపల్లిరూరల్: సంఘవిద్రోహ శక్తుల ఆటకట్టించి, నేరాలను కట్టడి చేసేందుకు జిల్లా కేంద్రంలో బుధవారం ఆపరేషన్ గరుడ పేరిట డ్రోన్‌లతో చేపట్టే నిఘా ప్రక్రియను రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ ప్రారంభించారు. తొలిదశలోనే నేరాలను గుర్తించి, నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వీలుగా డ్రోన్ ద్వారా ఏరియల్ సర్వే చేసేందుకు ఆపరేషన్ గరుడ చేపట్టామని సీపీ వివరించారు. డ్రోన్‌లు తీసిన వీడియోలు, ఫొటోలు పరిశీలించి బాధ్యులైన వారిపై చర్యలు చేపడతామని అన్నారు. పెద్దపల్లితోపాటు శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలపై ఇక నుంచి పకడ్బందీ నిఘా ఉంటుందని తెలిపారు. ఈ పద్ధతిని పోలీసు కమిషనరేట్ పరిధిలోని ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. డ్రోన్ కోసం ఆర్థికంగా సాయం అందించిన లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకటేశ్‌ను సీపీ అభినందించారు. అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్‌బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ కృష్ణ, ఎస్సైలు లక్ష్మణ్‌రావు, మల్లేశ్ పాల్గొన్నారు.

సింగరేణి టార్గెట్ 72 మిలియన్ టన్నులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రాబోయే ఆర్థిక సంవత్సరంలో సాధించే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించింది. 11 ఏరియాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 72మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిన సింగరేణి.. ఈసారి మరో రెండు మిలియన్ టన్నులు పెంచుకుంది. ఈమేరకు సంస్థ సీ అండ్ ఎండీ ఎన్.బలరాం అధికారులకు బుధవారం దిశానిర్దేశం చేశారు. ఓసీపీల ద్వారా అత్యధికంగా ఉత్పత్తి సాధించాలని టార్గెట్ విధించారు.

ఏరియాల లక్ష్యం ఇలా..

ఆర్జీ–1 ఏరియా లక్ష్యం 49.40 టన్నులు, ఆర్జీ–2.. 98.70, ఆర్జీ–3..62.50, ఏపీఏ.. 5.20, కొత్తగూడెం .. 149.50, ఇల్లెందు.. 41.30, మణుగూరు.. 127.60, బెల్లంపల్లి..38.50, మందమర్రి.. 34.60, శ్రీరాంపూర్.., 63.10, భూపాలపల్లి ఏరియా 49.60 టన్నుల లక్ష్యంగా నిర్దేశించారు.


డాక్టర్ అనితా శర్మ

ఆమె పోలియో బాధితురాలు.
ఐ.ఐ.ఎం. ఇండోర్‌లో పీహెచ్‌డీ చేసిన విద్యాధికురాలు.
కాని ఆమె తన జీవితాన్ని దివ్యాంగుల కోసం అంకితం చేసింది.
పట్టుదలగా డ్రైవింగ్ నేర్చుకోవడమేగాక
దివ్యాంగులకు డ్రైవింగ్ నేర్పించే స్కూల్ నడుపుతోంది.
ఏయే పరికరాలు అమర్చడం ద్వారా
దివ్యాంగులు సులభంగా డ్రైవ్ చేయవచ్చో తెలుపుతోంది.
'డ్రైవ్ ఆన్ మై ఓన్' సంస్థ నడుపుతున్న
డాక్టర్ అనితా శర్మ గురించి.

కదలండి కదిలించండి

అనితాశర్మకు కారు డ్రైవింగ్ నేర్చుకోవాలనిపించింది. జైపూర్ ఆమెది. జైపూర్‌లో పదిహేను, ఇరవై కాల్స్ చేసింది. ఎవరూ నేర్పించము అన్నారు. ఢిల్లీలో నేర్పుతారేమోనని అక్కడా ఒక పది, ఇరవై కాల్స్ చేసింది. అక్కడా ఎవరూ నేర్పము అన్నారు. కారణం? అనిత కుడికాలుకు పోలియో ఉంది. పోలియోతో బాధ పడుతున్నవారికి, లేదా ఇతర దివ్యాంగులకు కారు డ్రైవింగ్ నేర్పించే తర్ఫీదు డ్రైవింగ్ స్కూల్స్‌కు లేదు. అలా చేయడానికి అవసరమైన మోడిఫైడ్ కార్లు వారి దగ్గర ఉండవు. దివ్యాంగులు చక్రాల కుర్చీకి పరిమితం కావలసిందేనా? వారు తమకు తాముగా బయటకు తిరగకూడదా అనుకుంది అనితా శర్మ.


దివ్యాంగుల కోసం డ్రైవింగ్ క్లాసులు నిర్వహిస్తున్న అనితా శర్మ

తల్లి సహాయంతో...

అనితా శర్మ ఇండోర్ ఐ.ఐ.ఎంలో పీహెచ్‌డీ చేసింది. అమృతసర్ ఐ.ఐ.ఎంలో ప్రొఫెసర్ ఉద్యోగం సంపాదించింది. అయితే ఆమెకు కారు నడపాలన్న కోరిక మాత్రం తీరలేదు. 'మొదట నేను అదనపు చక్రాలు బిగించిన టూ వీలర్ నడిపాను. నా ఆనందానికి అవధుల్లేవు. కారు నడిపితే ఎంత బాగుండో అనిపించింది. హ్యాండ్ కంట్రోల్ ఉండేలా కారును మోడిఫై చేయించి మా అమ్మ సహాయంతో నేర్చుకున్నాను. ఇప్పుడు నేను ఎప్పుడైనా ఎక్కడికైనా నా కారులో ప్రయాణించగలను. నేను కారు నడపడం చూసి చాలా మంది దివ్యాంగులు మాకు నేర్పించవచ్చు కదా అనడిగేవారు. వారి కోసం పని చేయాలనిపించింది. అందుకే నా ఉద్యోగానికి రాజీనామా చేసి'డ్రైవ్ ఆన్ మై ఓన్' సంస్థ స్థాపించాను. దివ్యాంగులకు కారు డ్రైవింగ్ నేర్పించి, సొంత కారు కొనుక్కోవడంలో అవసరమైన సాయం చేయడమే మా సంస్థ ఉద్దేశం' అంటుందామె.

కస్టమైజ్డ్ కార్లు

అనితాశర్మ సంస్థ దివ్యాంగుల కోసం డ్రైవింగ్ క్లాసులు నిర్వహిస్తుంది. వెబినార్లు, సెమినార్లు నిర్వహిస్తుంది. దివ్యాంగుల కమ్యూనిటీలో ఒకరికొకరికి పరిచయాలు చేసి ప్రోత్సహించుకునేలా చేస్తుంది. శారీరక పరిమితులను అనుసరించి కారులో ఎటువంటి మోడిఫికేషన్ చేస్తే కారు నడపవచ్చో సూచిస్తుంది. ఆ మోడిఫికేషన్ పరికరాలు సమకూర్చడంలో సాయం చేస్తుంది. ఆ తర్వాత కార్ల రిజిస్ట్రేషన్, జిఎస్‌టి వంటివి దివ్యాంగుల పక్షంలో జరిగేలా చూస్తుంది. 'ఇదంతా చేయడానికి మేము కొంత ఫీజు తీసుకుంటాం. దివ్యాంగులు ఛారిటీ మీద కాకుండా తమ కాళ్ల మీద తాము బతకాలన్నదే నా ఉద్దేశం' అంటుంది అనితా శర్మ.

కుటుంబ సభ్యులు

'దివ్యాంగులు కారు నడపడానికి వారి కుటుంబసభ్యులను ఒప్పించడమే పెద్ద సమస్య. దివ్యాంగులు కారు నడపగలరు. వారిని డ్రైవింగ్ సీట్‌లో స్లయిడర్స్ ద్వారా సులువుగా చేర్చవచ్చు. కాళ్లతో పని లేకుండా చేతులతోనే మొత్తం కంట్రోల్ చేయొచ్చు. వారికి తిరగాలని ఉంటుంది. ధైర్యం చెప్పి సహకరించి తిరగనివ్వండి' అని సూచిస్తోంది అనితా శర్మ.

న్యూస్ మేకర్

సంపన్న కుటుంబ నేపథ్యం లేని మిక్కీ జగ్తియాని 'ల్యాండ్‌మార్క్'తో ఒక్కోమెట్టు ఎక్కుతూ ప్రపంచ కుబేరుల సరసన నిలిచాడు.
భర్త అడుగు జాడల్లో నడిచి వ్యాపార నైపుణ్యాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని 'ల్యాండ్ మార్క్'కు తనదైన మార్క్ జోడించి ఆ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించింది.
తాజాగా... ఫోర్బ్స్ న్యూ బిలియనీర్స్ 2024 జాబితాలో చోటు సాధించింది.

విజయాలకు ల్యాండ్ మార్క్


రేణుకా జగ్తియాని

రేణుకా జగ్తియాని నేతృత్వంలోని దుబాయ్ చెందిన రిటైలింగ్ దిగ్గజం 'ల్యాండ్‌మార్క్' 21 దేశాలలో పాదరక్షల నుంచి గృహోపకరణ వస్తువుల వరకు వివిధ బ్రాండ్‌లతో విజయపథంలో దూసుకుపోతుంది.

హాస్పిటాలిటీ బిజినెస్‌లో కూడా గెలుపు జెండా ఎగరేసింది. ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలతో ముందుకువెళ్లే రేణుక మిడిల్ ఈస్ట్, ఇండియా, ఆగ్నేయాసియాలోని కీలక మార్కెట్‌లలో రాబోయే కాలంలో వందలాది స్టోర్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

ఎలాంటి వ్యాపార అనుభవం లేని రేణుక 1993లో ల్యాండ్‌మార్క్ గ్రూప్‌లోకి అడుగు పెట్టింది.

'ఇది సాధ్యమా!' అనుకునే వాళ్లు సందేహాల దగ్గరే తచ్చాడుతారు.

'కచ్చితంగా సాధ్యమే' అనుకునే వాళ్లు ముందుకు దూసుకుపోతారు.

రేణుక రెండోకోవకు చెందిన మహిళ. వేగంగా వ్యాపార నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవడమే కాదు ఫాస్ట్–ఫ్యాషన్ బిజినెస్ 'స్ప్లాష్'తో తనదైన ముద్ర వేసింది. 'స్ప్లాష్' పదకొండు దేశాలలో 200 స్టోర్స్ వరకు విస్తరించింది. మన దేశంలో 1999లో లైఫ్‌స్టైల్, హోమ్ సెంటర్ అండ్ మాక్స్‌లాంటి అయిదు ఫార్మట్స్‌లో ప్రస్థానం ప్రారంభించి 900 స్టోర్స్‌లో విస్తరించింది ల్యాండ్‌మార్క్.

2017లో రేణుక ల్యాండ్ మార్క్ గ్రూప్ చైర్‌పర్సన్, సీయీవోగా బాధ్యతలు స్వీకరించింది.

రేణుక భర్త మిక్కీ జగ్తియాని సౌత్ ఆఫ్రికా ఇమిగ్రెంట్స్‌ను దృష్టిలో పెట్టుకొని బహ్రెయిన్‌లో బేబీ ప్రొడక్ట్స్ స్టోర్‌ను మొదలుపెట్టాడు. అక్కడినుంచి ప్రారంభమైన బుడి బుడి అడుగుల వ్యాపారం 'ల్యాండ్ మార్క్' రూపంలోఎక్కడికో వెళ్లింది.

భర్త నిర్మించిన వ్యాపార సామ్రాజ్యాన్ని చెక్కుచెదరకుండా నిలబెట్టడం అంత సులువు కాదు. కాని ఎక్కడా రేణుక వెనకడుగు వేయలేదు. అయితే ప్రపంచంలోని ఎన్నో కంపెనీలపై పడినట్లే కోవిడ్ సంక్షోభ ప్రభావం 'ల్యాండ్ మార్క్' పై పడింది. రెండు నెలలకు పైగా స్టోర్స్ అన్నీ క్లోజ్ అయిపోయాయి. ఆ తరువాత మెల్లమెల్లగా కొత్త గైడ్‌లైన్స్‌తో తెరుచుకోవడం మొదలైంది.

> భర్త అడుగుజాడల్లో నడిచి, వ్యాపారనైపుణ్యాన్నే కాదు సేవా దృక్పథాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని వ్యాపారంతోపాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది.

'విపత్కరమైన పరిస్థితుల్లో ఆపరేషనల్ ప్రాసెస్‌లో ర్యాపిడ్ చేంజెస్ చేశాము. ఉద్యోగుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాం. క్వారంటైన్‌లో ఉన్న ఉద్యోగులు లేదా వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయం అందించాం, వారిలో ధైర్యం నింపాం. ఆఫీస్, స్టోర్ ఉద్యోగుల కోసం ప్రత్యేక వసతి ఏర్పాటు చేశాం. ఉద్యోగుల కోసమే కాదు కోవిడ్ బాధితుల కోసం మా ఫౌండేషన్ తరపున ఎన్నోరకాల సేవాకార్యక్రమాలు చేపట్టాం' అంటూ ఆ రోజులను గుర్తు తెచ్చుకుంటుంది రేణుక.

చిన్న వ్యాపారంగా మొదలైన 'ల్యాండ్ మార్క్' గల్ఫ్‌కు సంబంధించి 'కింగ్ ఆఫ్ రిటైల్'గా పేరు తెచ్చుకుంది.

విజయపథంలో దూసుకుపోతున్న 'ల్యాండ్‌మార్క్' ముందున్న కర్తవ్యం... సమాజానికి తిరిగి ఇవ్వాలి. ఆదరించిన ప్రజలకు అండగా ఉండాలి. పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్న ల్యాండ్ మార్క్ గ్రూప్ చెన్నై, ముంబై మురికివాడల్లో రకరకాల సేవాకార్యక్రమాలు చేపడుతోంది.

రేణుక జగ్తియాని భర్త మిక్కీ జగ్తియాని 71 సంవత్సరాల వయసులో చనిపోయారు. కొన్ని సంవత్సరాల క్రితం ఒక రిపోర్టర్ ఆయనను 'మీ నెక్స్ట్ ప్లాన్ ఏమిటి?' అని అడిగాడు.

దీనికి మిక్కీ జగ్తియాని చెప్పిన జవాబు...

'నా గురించి నేను పూర్తిగా తెలుసుకోవడానికి ఎక్కువ సమయం గడపాలనుకుంటున్నాను. వ్యాపార సంబంధిత విషయాల గురించి కాకుండా నేనెవరిని? జీవితపరమార్థం ఏమిటి? లాంటి విషయాల గురించి ఆలోచిస్తుంటాను. వ్యాపార లాభాలే కాదు జీవితానికి సంబంధించిన ఎన్నో అంశాలలో ఆనందం దొరుకుతుంది'

భర్త అడుగుజాడల్లో నడిచి, వ్యాపార నైపుణ్యాన్నే కాదు సేవాదృక్పథాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని వ్యాపారంతో పాటు సేవాకార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది.


విపుల్ వర్షిణే

'కోరుకున్న రంగంలో రాణించాలంటే మనలో ఒక తపన ఉండాలి.
ఒక తపస్సులా ఆ రంగాన్ని స్వీకరించాలి.
ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలి' అంటారు
ఐదు పదుల వయసు దాటిన విపుల్ వర్షిణే.
లక్నోవాసి అయిన విపుల్ వర్షిణే ముప్పైఏళ్లుగా ఆర్కిటెక్చర్ రంగంలో తనదైన ముద్ర వేస్తూ, గుర్తింపు పొందారు.
ఒక్కరూ తన మాట వినడం లేదు అనే నిరాశ నుంచి రెండు విమానాశ్రయాల రూపకల్పన చేసేంత స్థాయికి ఎదిగారు.
విపుల్ వర్షిణే తనను తాను శక్తిగా మలుచుకున్న విధానం నేటి మహిళలకు స్ఫూర్తిని కలిగిస్తుంది.

ఎదుర్కోడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి

'నా పేరు విపుల్ అనే ఉండటంతో మగ ఆర్కిటెక్ట్ అనుకుని, సంప్రదించేవారు. నేను మహిళను అని తెలిసి వర్క్ ఇవ్వడానికి వెనకడుగు వేసేవారు. ఇప్పుడు ఈ పరిస్థితుల్లో కొంతమార్పు చూస్తున్నాను కానీ, 30 ఏళ్ల క్రితం నేను ఆర్కిటెక్ట్ అని చెబితే చాలామంది ఆశ్చర్యపోయేవారు. ఇప్పుడు నేను రెండు విమానాశ్రయాలను డిజైన్ చేసే స్థాయికి ఎదిగాక ఈ రంగంలో అమ్మాయిలూ రాణించగలరు అనే స్పష్టత వచ్చింది. ఈ విషయాన్ని నిరూపించడానికి నేను చేసిన ప్రయత్నం ఆషామాషీ కాదు.

సృజనతో అడుగు

పుట్టి, పెరిగింది లక్నోలో. స్కూల్ ఏజ్ నుంచి పెయింటింగ్స్ వేయడం, కార్టూన్స్ గీయడం వంటివి చూసి వాటిని పత్రికలకు పంపించే వారు నాన్న. మొదట నేను మెడిసిన్ చదవాలని కోరుకున్న మా నాన్న నాలోని సృజనాత్మకత చూసి ఆర్కిటెక్ట్ ఇంజినీరింగ్ చేయమని సలహా ఇచ్చారు. ఎందుకంటే ఆర్కిటెక్చర్ సైన్స్, సృజనాత్మకతల సమ్మేళనంగా ఉంటుంది. మా నాన్న మనసులో నేను గవర్నమెంట్ ఉద్యోగం చేయాలని, అది నాకు సురక్షితమైనదని భావించేవారు. నేను ఎంచుకున్న రంగం చాలా శ్రమతో కూడుకున్నదని ఆయనకు తెలియదు. అప్పట్లో కంప్యూటర్లు లేవు కాబట్టి రాత్రంతా డ్రాయింగ్ బోర్డ్ పైనే పని చేయాల్సి వచ్చేది.

ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు..

''నేను ఆర్కిటెక్చరల్ ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు మా క్లాస్‌లో ముగ్గురం మాత్రమే అమ్మాయిలం. ఈ వృత్తిలో అబ్బాయిలదే అధిపత్యమని అప్పుడు అర్థమైంది. కాలేజీలో చదివే సమయంలోనే పెళ్లి అయ్యింది. మావారు సివిల్ ఇంజనీర్ కాబట్టి పెళ్లయ్యాక ఆయనతోనే కెరీర్ ప్రారంభించాను. భవనాలు కట్టే లొకేషన్‌కు వెళ్లేటప్పుడు నాతో మాట్లాడేందుకు కూలీలు తడబడేవారు. మేస్త్రీలు నా మాటలను అస్సలు పట్టించుకునేవారు కాదు. ఒక మహిళ యజమానిగా మారడం వారెవరికీ ఇష్టం ఉండదని అప్పుడు అర్థమైంది. అసలు నన్ను వారు నిర్మాణశిల్పిగా అంగీకరించలేదు. నిరాశగా అనిపించేది. కానీ, నా డిజైన్ ప్రకారమే పనిచేయాల్సి ఉంటుందని నా నిర్ణయాన్ని సున్నితంగానూ, అంతే కచ్చితంగానూ తెలియజేశాను. అక్కడ నుంచి ఆర్కిటెక్ట్‌గా ఎదగడానికి నన్ను నేను మార్చుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. ఆఫీస్‌లో నాకు, నా భర్తకు విడివిడిగా క్యాబిన్లు ఉండేవి. క్లయింట్స్ వచ్చినప్పుడల్లా నా సలహా తీసుకోవాలని నా భర్త తరచూ వారికి చెప్పాల్సి వచ్చేది. తీసుకున్న ప్రాజెక్ట్ పూర్తి చేయడం పట్ల పూర్తి శ్రద్ధ పెట్టేదాన్ని. కానీ వచ్చిన వాళ్లు మాత్రం 'మిస్టర్ విపుల్ వర్షిణే ఎప్పుడు వస్తారు' అని అడిగేవారు. నేనే విపుల్ అని, ఆర్కిటెక్ట్ అని తెలిసి ఆశ్చర్యపోయేవారు.



200 భవనాల జాబితా

భవన నిర్మాణంలో నా వర్క్‌ని కొనసాగిస్తూనే లక్నోలోని చారిత్రక కట్టడాలపై, వాటి పరిరక్షణ గురించి ప్రాజెక్ట్ వర్క్ చేశాను. అక్కడి వారసత్వ కట్టడాల పట్ల ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోవడం లేదని తెలుసుకొని దాదాపు 200 భవనాల జాబితాను తయారు చేశాను. ఆ జాబితాను పురావస్తు శాఖకు అప్పగించాను. ఆ సమయంలోనే 500 పేజీల ఆ ప్రాజెక్ట్ వర్క్‌ని పుస్తకంగా తీసుకువస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్న సన్నిహితుల సలహాతో బుక్‌గా తీసుకువచ్చాను. అలా రచనా ప్రపంచంలోకి అడుగుపెట్టాను. ఇప్పటి వరకు మన దేశ వారసత్వ సంపదపైన ముఖ్యంగా లక్నో సంస్కృతి, వారసత్వ నగరం, చరిత్ర ద్వారా నడక, మ్యూజింగ్స్ ఇన్ బెనారస్, ఎ కెలిడోస్కోప్ ఆఫ్ ది హార్ట్, లక్నో ఎ ట్రెజర్ పేర్లతో 5 పుస్తకాలు ప్రచురితమయ్యాయి. ఇటీవలే అయోధ్యకు సంబంధించి ఎ వాక్ త్రూ ది లివింగ్ హెరిటేజ్ ప్రచురితమైంది.

'షామ్ ఎ అవధ్ పుస్తకంలో లక్నో సంస్కృతిపై స్కెచ్‌లు కూడా వేశాను. లక్నోలోని చికంకారీ ఎంబ్రాయిడరీ, ఈ నగరంలోని వీధులు, మార్కెట్ల గురించి ప్రస్తావించాను. లక్నో ఇన్‌టాక్‌కి కన్వీనర్‌గా ఉన్నాను.

లేహ్ విమానాశ్రయం .. ఓ సవాల్!

2018లో లేహ్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ చేసే అవకాశం వచ్చింది. ఈ ప్రాజెక్ట్ నాకు అత్యంత సవాల్‌గా ఉండేది. ఎందుకంటే అక్కడ భూమి, పర్యావరణం చాలా భిన్నంగా ఉంటాయి. పర్వతాల కారణంగా భూభాగం చాలా తేడాగా ఉంటుంది. విమానాశ్రయం అరైవల్, డిపార్చర్ లాంజ్‌ల మధ్య 3 అంతస్తుల వ్యత్యాసం ఉంది. అక్కడ లగేజీ బెల్ట్ రివర్స్ చేయాల్సి వచ్చింది. ఉష్ణోగ్రత చాలా తక్కువ కాబట్టి, ఎయిర్ కండీషనర్లలో ఉపయోగించే ద్రవం ఘనీభవన స్థానం కంటే తక్కువగా ఉంది. అలాంటప్పుడు ప్రత్యేక రసాయనాలను ఉపయోగించి, దానిని ఏర్పాటు చేశాను. లేహ్‌లో అనేక బౌద్ధ విహారాలు ఉన్నాయి. ప్రవేశం ద్వారం వద్ద 30 అడుగుల ఎత్తైన బుద్ధుని విగ్రహాన్ని ఉంచాను. అక్కడి స్థానిక సంస్కృతి, కళ, హస్తకళలను దృష్టిలో ఉంచుకుని రంగు రంగుల వలలు, ప్రార్థన చక్రాలను ఏర్పాటు చేయించాను. అయోధ్య విమానాశ్రయం పని ప్రారంభించినప్పుడు అక్కడ మహంతులు, సాధువులను కలుస్తూ ఉండేదాన్ని. ఎందుకంటే అక్కడి నిర్మాణాన్ని బాగా అర్థం చేసుకోవాలి, సరైన సమాచారం కోసం చాలా పుస్తకాలు చదివాను. వివిధ వృత్తులలో ఉన్న వ్యక్తులతో మాట్లాడాను. దీంతో అయోధ్యపై నాకు ఆసక్తి పెరుగుతూ వచ్చింది. ఆ తర్వాత దానినే పుస్తకంగా తీసుకు వచ్చాను.

ఒక సృజనాత్మక వ్యాపకం నన్నూ నా దిశను మార్చింది. సవాల్‌గా ఉన్న రంగంలో సమున్నతంగా నిలబడేలా చేసింది. ఏ రంగం ఎంచుకున్నా అందులో మనదైన ముద్ర తప్పక వేయాలి. అప్పుడే, ఎక్కడ ఉన్నా సరైన గుర్తింపు లభిస్తుంది' అని వివరిస్తారు విపుల్ వర్షిణే.

బటర్‌ఫ్లై మామ్

ఇల్లంటే ఎలా ఉండాలి? ఇంటి ముందు గుమ్మానికి ఆకుపచ్చ తోరణం ఉండాలి. గుమ్మానికి ఇరువైపులా పచ్చటి మొక్కలుండాలి. ఆ మొక్కలకు రంగురంగుల పువ్వులుండాలి. ఇంట్లోకి అడుగుపెడుతుంటే పరిమళాలు స్వాగతం పలుకుతుండాలి. ఇవన్నీ ముంబయి నగరంలో, మల్టీ స్టోరీడ్ బిల్డింగ్‌లో సాధ్యమయ్యే పనేనా? సాధ్యం కాదని ఊరుకుంటే ప్రియాంక సింగ్ బటర్‌ఫ్లై మామ్ అయ్యేదే కాదు. ఆమె ఇల్లు వేలాది సీతాకోక చిలుకలకు పుట్టిల్లయ్యేదీ కాదు.

ప్రియాంక సింగ్‌ది ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి పట్టణం. గంగానది తీరాన, వందల ఏళ్ల నాటి మహావృక్షాల నీడన పెరిగిన బాల్యం ఆమెది. చదువు, ఉద్యోగం, పెళ్లి... ఆమె గమ్యాన్ని నిర్దేశించాయి. ముంబయిలో అడుగు పెట్టింది. ఆమె ఫ్లాట్ ఆ భవనంలో పదమూడవ ఫ్లోర్‌లో ఉంది. తాను గడిపిన అందమైన బాల్యం తన పిల్లలకు ఉండదని దిగులు పడిందామె. మహావృక్షాల నీడన కాకున్నా, కనీసం అడుగు ఎత్తు మొక్కల మధ్య పెరిగినా చాలనుకుంది. బాల్కనీలో రకరకాల మొక్కలు పెంచింది. మొక్కలను సేంద్రియ పద్ధతిలో పెంచాలనుకోవడమే ఆమెకు తెలియకుండా ఆమె చేసిన ఓ మంచిపని. మొక్కలకు చీడపీడలకు రసాయన క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియాలతో పెంచింది. ఒకరోజు ఒక లార్వా ఆమె మొక్కల ఆకుల కింద కనిపించింది. రోజుల్లోనే అది ప్యూపా దశకు చేరడం, ఆ తర్వాత రంగురంగుల సీతాకోక చిలుక రెక్కలు విప్పుకుని ఎగరడం అన్ని దశలూ చూస్తుండగానే జరిగిపోయాయి.

అప్పటి నుంచి ఆమె సీతాకోక చిలుకల పరిణామక్రమాన్ని చదవడం మొదలు పెట్టింది. ఆ తర్వాత రసాయన క్రిమిసంహారిణులను ఇంట్లోకి తీసుకురావడమే మానేసింది. ఇప్పుడామె బాల్కనీలో నిమ్మజాతి చెట్లు, అక్షింతల చెట్లు, కరివేపాకు, వెస్ట్ ఇండియన్ జాస్మిన్... వంటి మొక్కలున్నాయి. వాటి మీద మోనార్క్ బటర్‌ఫ్లై, కామన్ జాయ్, లైమ్ స్వాలోటెయిల్ వంటి అరుదైన జాతుల సీతాకోక చిలుకలు కనిపిస్తున్నాయి. అలా వచ్చి వెళ్లిపోకుండా ఆ చెట్ల ఆకుల మీదనే గుడ్లు పెడుతున్నాయి. సంతతిని వృద్ధి చేస్తున్నాయి. ఆమె ఇంట్లో సీతాకోక చిలుకలకు అనువైన వాతావరణం ఉంది. ఆ వాతావరణాన్ని పరిరక్షిస్తోందామె. అందుకే ప్రియాంక సింగ్‌ను బటర్ ఫ్లై మామ్ అంటున్నారు ఆమె స్నేహితులు. తాను జీవవైవిధ్యత కోసం అంకితమవుతానని వారణాసి నుంచి ముంబయికి పయనమైనప్పుడు కలలో కూడా ఊహించలేదు... అంటుంది ప్రియాంక సింగ్. ఆమెకు సీతాకోక చిలుకలను చూస్తూ తేడాలను గుర్తించడంతో పాటు ప్రతి సీతాకోక చిలుకనూ ఫొటో తీయడం అలవాటైంది. ఇప్పటివరకు ఆమె మినీ గార్డెన్‌లో ఐదు వేలకు పైగా సీతాకోక చిలుకలు కొలువుదీరాయి. రెక్కలొచ్చిన తర్వాత ఎగిరి వెళ్లిపోయాయి.


ప్రియాంక సింగ్

బ్యూటిప్స్

పెడిక్యూర్ సింపుల్‌గా

పాదాలు అందంగా ఆరోగ్యంగా ఉండాలంటే చర్మం మీద మృత కణాలు తొలగించడం ప్రధానం. ఇంట్లోనే చేసుకోగలిగిన సింపుల్ పెడిక్యూర్ చేసుకునేటప్పుడు ఒక జాగ్రత్త తప్పనిసరిగా పాటించాలి. పాదాలను శుభ్రం చేయడానికి వాడే పమిస్ స్టోన్ మరీ పాతదై పోయి స్టోన్ రంధ్రాలు మురికితో నిండినప్పటికీ కొందరు దానినే ఉపయోగిస్తుంటారు. అది అసలు మంచిది కాదు. దాని వల్ల చర్మం మీదున్న మృతకణాలు తొలగకపోగా ఇతర ఇన్‌ఫెక్షన్‌లు వచ్చే ప్రమాదం ఉంటుంది.



- గోరు వెచ్చటి నీటిలో రెండు చుక్కలు లిక్విడ్ సోప్ లేదా షాంపూ వేసి కలిపి అందులో పాదాలను పది నిమిషాల సేపు ఉంచాలి. ఆ తర్వాత పాదాలను, వేళ్లను పమిస్ స్టోన్ లేదా ఫుట్ ఫైలర్‌తో రుద్ది శుభ్రం చేయాలి.
- పాదాలను పొడి వస్త్రంతో తుడిచి మాయిశ్చరైజర్ లేదా బాడీ క్రీమ్ రాయాలి.
- క్రీమ్ రాసిన తర్వాత పాదాలకు, వేళ్లకు మర్దన చేయాలి. ఇలా చేయడం వల్ల పాదాలు అలసట తొలగి సాంత్వన పొందుతాయి. రక్త ప్రసరణ మెరుగవడంతో పాదాల నొప్పులు, పాదాల కండరాలు పట్టేయడం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి.



నిఖత్ విదేశీ శిక్షణకు క్రీడా శాఖ ఆమోదం

పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తెలంగాణ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌తోపాటు ప్రీతి, పర్వీన్, లవ్లీనా విదేశీ గడ్డపై శిక్షణ తీసుకోనున్నారు. ఒలింపిక్స్ సన్నాహాల కోసం ఈ నలుగురు బాక్సర్లు టర్కీ వెళ్లనున్నారు. ఈ నలుగురు బాక్సర్ల శిక్షణకు అయ్యే మొత్తం ఖర్చును భరిస్తామని కేంద్ర క్రీడా శాఖ ప్రకటించింది. క్రొయేషియా, చెక్ రిపబ్లిక్‌లో జరిగే అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనేందుకు భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మనిక బత్రాకు అయ్యే ఖర్చులు భరిస్తామని క్రీడా శాఖ తెలిపింది.

ఐపీఎల్ టోర్నీకి శివమ్ మావి దూరం

పక్కటెముకల గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో భారత క్రికెటర్, లక్నో సూపర్ జెయింట్స్ జట్టు పేస్ బౌలర్ శివమ్ మావి ఐపీఎల్ 17వ సీజన్ నుంచి వైదొలిగాడు. గత ఏడాది ఐపీఎల్‌లో రన్నరప్‌గా నిలిచిన గుజరాత్ టైటాన్స్ జట్టులో శివమ్ మావి సభ్యుడిగా ఉన్నాడు. అయితే అతనికి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. గత డిసెంబర్‌లో జరిగిన మినీ వేలంలో లక్నో ఫ్రాంచైజీ ఏకంగా రూ. 6 కోట్ల 40 లక్షలకు శివమ్ మావిని కొనుగోలు చేసింది.



పోరాడి ఓడిన సుమిత్

మరాకెష్ (మొరాకో): గ్రాండ్‌ప్రి హసన్-2 ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 95వ ర్యాంకర్ సుమిత్ 6-1, 3-6, 4-6తో ప్రపంచ 61వ ర్యాంకర్ లొరెంజో సొనెగో (ఇటలీ) చేతిలో ఓడిపోయాడు. సుమిత్‌కు 10,165 యూరోల (రూ. 9 లక్షల 16 వేలు) ప్రైజ్‌మనీ, 25 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



యూకీ జోడీ శుభారంభం

ఇదే టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)-ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో యూకీ-ఒలివెట్టి జంట 6-3, 6-4తో స్టీవెన్స్ (నెదర్లాండ్స్)-పెట్రోస్ సిట్సిపాస్ (గ్రీస్) ద్వయంపై గెలిచింది.

శ్రీలంక క్లీన్‌స్వీప్



చట్టోగ్రామ్: బంగ్లాదేశ్ గడ్డపై తమ అజేయ రికార్డును శ్రీలంక జట్టు కొనసాగించింది. ఆతిథ్య జట్టుతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను ధనంజయ డిసిల్వా సారథ్యంలోని శ్రీలంక జట్టు 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 511 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 318 పరుగులకు ఆలౌటైంది. చివరి రోజు బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 268/7తో ఆట కొనసాగించిన బంగ్లాదేశ్ మరో 50 పరుగులు జోడించి మిగతా మూడు వికెట్లు కోల్పోయింది. లంక బౌలర్లలో లాహిరు కుమార (4/50), కామిందు మెండిస్ (3/32) రాణించారు.

బంగ్లాదేశ్‌లో భారత మహిళల జట్టు పర్యటన

ఢాకా: ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు ఈనెలలో భారత మహిళల క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. బంగ్లాదేశ్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం భారత జట్టు ఈనెల 23న బంగ్లాదేశ్‌కు చేరుకుంటుంది. మే 10వ తేదీన పర్యటన ముగించుకొని తిరిగి వెళుతుంది. సిల్హెట్‌లో జరిగే ఈ సిరీస్‌లో రెండు జట్లు ఏప్రిల్ 28, 30, మే 2, 6, 9వ తేదీల్లో ఐదు టి20 మ్యాచ్‌లు ఆడతాయి.

విశాఖలో పరుగుల సంద్రం

కోల్‌కతా నైట్‌రైడర్స్ స్కోరు 272/7

ఢిల్లీపై 106 పరుగులతో గెలుపు

చెలరేగిన నరైన్, అంగ్‌క్రిష్, రసెల్

సరిగ్గా వారం రోజుల క్రితం... గత బుధవారం హైదరాబాద్ గడ్డపై సన్‌రైజర్స్ భీకర బ్యాటింగ్‌తో ఐపీఎల్‌లో అత్యధిక స్కోరును నమోదు చేసింది. ఇప్పుడు ఈ బుధవారం విశాఖపట్నం వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్ అదే తరహా పరుగుల విధ్వంస రచన చేసింది. రికార్డు స్కోరుకు చేరువగా వచ్చి త్రుటిలో దానిని అందుకోలేకపోయినా... ఐపీఎల్‌లో రెండో అత్యధిక స్కోరును కోల్‌కతా సాధించింది. సునీల్ నరైన్, అంగ్‌క్రిష్ రఘువంశీ, రసెల్ ఇందులో కీలక పాత్ర పోషించారు... ఆ తర్వాత భారీ స్కోరు చూసి ముందే తలవంచిన ఢిల్లీ లక్ష్యానికి చాలా దూరంలో ఆగిపోయింది. కోల్‌కతా ఖాతాలో హ్యాట్రిక్ విజయం చేరగా... ఢిల్లీ మళ్లీ ఓటమి బాట పట్టింది.

సాక్షి, విశాఖపట్నం: మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) తాజా సీజన్ ఐపీఎల్‌లో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన పోరులో కేకేఆర్ 106 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. ఐపీఎల్ చరిత్రలో సన్‌రైజర్స్ (277) తర్వాత ఇదే రెండో అత్యధిక స్కోరు. సునీల్ నరైన్ (39 బంతుల్లో 85; 7 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు వేగంతో బ్యాటింగ్ చేయగా... అంగ్‌క్రిష్ రఘువంశీ (27 బంతుల్లో 54; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అంతే జోరుతో అండగా నిలిచాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 48 బంతుల్లోనే 104 పరుగులు జోడించారు. ఆ తర్వాత ఆంద్రీ రసెల్ (19 బంతుల్లో 41; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడు కేకేఆర్‌కు భారీ స్కోరును అందించింది. అనంతరం ఢిల్లీ 17.2 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రిషభ్ పంత్ (25 బంతుల్లో 55; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (32 బంతుల్లో 54; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు.

శతక భాగస్వామ్యం...

తొలి ఓవర్లో ఎక్స్‌ట్రాల రూపంలోనే 7 పరుగులతో కేకేఆర్ ఇన్నింగ్స్ ఆరంభం కాగా... తర్వాతి రెండు ఓవర్లలో సాల్ట్ (12 బంతుల్లో 18; 4 ఫోర్లు), నరైన్ కలిసి 25 పరుగులు రాబట్టారు. అయితే రైడర్స్ అసలు జోరు ఇషాంత్ వేసిన నాలుగో ఓవర్లో మొదలైంది. నరైన్ వరుసగా 6, 6, 4, 0, 6, 4 బాది ఏకంగా 26 పరుగులు సాధించడం విశేషం. సాల్ట్ వెనుదిరిగిన తర్వాత నరైన్‌తో రఘువంశీ జత కలిశాక కోల్‌కతా మరింత వేగంగా దూసుకుపోయింది. సలామ్ ఓవర్లో నరైన్ 3 ఫోర్లు, సిక్స్ కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 88 పరుగులకు చేరింది. 21 బంతుల్లోనే నరైన్ అర్ధ సెంచరీ పూర్తయింది. అక్షర్ కూడా వేసిన ఒక్క ఓవర్లో 18 పరుగులు సమర్పించుకున్నాడు. సుమీత్ ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన రఘు... సలామ్ ఓవర్లో రెండు సిక్సర్లతో చెలరేగాడు. ఎట్టకేలకు 13వ ఓవర్లో మార్ష్ ఈ జోడీని విడదీశాడు. టి20ల్లో తన అత్యధిక స్కోరు సాధించిన నరైన్ సెంచరీ అవకాశాన్ని చేజార్చుకోగా... మరోవైపు 25 బంతుల్లో రఘు హాఫ్ సెంచరీని అందుకున్నాడు. రఘువంశీ కూడా వెనుదిరిగిన తర్వాత రసెల్ తన స్థాయిని ప్రదర్శిస్తూ బౌండరీలతో చెలరేగుతూ స్కోరును 200 పరుగులు దాటించాడు. శ్రేయస్ అయ్యర్ (18) అవుటైన తర్వాత నోర్జే ఓవర్లో 3 సిక్స్‌లు, ఫోర్ బాది రింకూ సింగ్ (8 బంతుల్లో 26; 1 ఫోర్, 3 సిక్స్‌లు) పండగ చేసుకున్నాడు. ఈ ఓవర్లో మొత్తం 25 పరుగులు వచ్చాయి. మరో 14 పరుగులు చేస్తే ఐపీఎల్‌లో అత్యధిక స్కోరు నమోదు చేసే లక్ష్యంతో చివరి ఓవర్లో కేకేఆర్ బ్యాటింగ్‌కు సిద్ధమైంది. అయితే ఇషాంత్ అద్భుత యార్కర్‌తో తొలి బంతికే రసెల్‌ను క్లీన్ బౌల్డ్ చేయడంతో ఆ ఆశలకు తెర పడింది.


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సునీల్ నరైన్


అంగ్‌క్రిష్


రసెల్ బౌల్డ్

పంత్ మెరుపులు...

భారీ ఛేదనలో ఢిల్లీ తడబడింది. 12 పరుగుల వ్యవధిలో ఆ జట్టు తొలి 4 వికెట్లు కోల్పోయింది. పృథ్వీ షా (10), మార్ష్ (0), పొరేల్ (0), వార్నర్ (18) ప్రభావం చూపలేకపోవడంతో గెలుపుపై నమ్మకం ఇక్కడే సడలింది. అనంతరం కొద్ది సేపు పంత్ మెరుపు బ్యాటింగ్ క్యాపిటల్స్ అభిమానులకు ఆనందం పంచింది. తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలచిన అతను రసెల్ ఓవర్లో మరో 2 సిక్స్‌లు బాదాడు. ఆ తర్వాత వెంకటేశ్ అయ్యర్ వేసిన 12వ ఓవర్లో పంత్ బ్యాటింగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ ఓవర్లో వరుసగా 4, 6, 6, 4, 4, 4తో అతను 28 పరుగులు రాబట్టడం విశేషం. అయితే తర్వాతి ఓవర్లోనే అతను వెనుదిరగడంతో ఢిల్లీ మిగతా ఆట లాంఛనమే అయింది. స్టబ్స్ కూడా కొంత పోరాడినా లాభం లేకపోయింది.

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ × పంజాబ్
వేదిక: అహ్మదాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	3	3	0	6	2.518
రాజస్తాన్	3	3	0	6	1.249
చెన్నై	3	2	1	4	0.976
లక్నో	3	2	1	4	0.483
గుజరాత్	3	2	1	4	-0.738
హైదరాబాద్	3	1	2	2	0.204
పంజాబ్	3	1	2	2	-0.337
బెంగళూరు	4	1	3	2	-0.876
ఢిల్లీ	4	1	3	2	-1.347
ముంబై	3	0	3	0	-1.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్


స్టబ్స్, పంత్

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) స్టబ్స్ (బి) నోర్జే 18; నరైన్ (సి) పంత్ (బి) మార్ష్ 85; రఘువంశీ (సి) ఇషాంత్ (బి) నోర్జే 54; రసెల్ (బి) ఇషాంత్ 41; శ్రేయస్ అయ్యర్ (సి) స్టబ్స్ (బి) అహ్మద్ 18; రింకూ (సి) వార్నర్ (బి) నోర్జే 26; వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 5; రమణ్‌దీప్ (సి) పృథ్వీ షా (బి) ఇషాంత్ 2; స్టార్క్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 272. వికెట్ల పతనం:** 1-60, 2-164, 3-176, 4-232, 5-264, 6-264, 7-266. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-43-1, ఇషాంత్ శర్మ 3-0-43-2, నోర్జే 4-0-59-3, సలామ్ 3-0-47-0, సుమీత్ 2-0-19-0, అక్షర్ 1-0-18-0, మార్ష్ 3-0-37-1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (బి) స్టార్క్ 18; పృథ్వీ షా (సి) వరుణ్ (బి) వైభవ్ 10; మార్ష్ (సి) రమణ్‌దీప్ (బి) స్టార్క్ 0; పొరేల్ (సి) నరైన్ (బి) వైభవ్ 0; పంత్ (సి) శ్రేయస్ (బి) వరుణ్ 55; స్టబ్స్ (సి) స్టార్క్ (బి) వరుణ్ 54; అక్షర్ (సి) (సబ్) పాండే (బి) వరుణ్ 0; సుమీత్ (సి) (సబ్) పాండే (బి) నరైన్ 7; సలామ్ (సి) సాల్ట్ (బి) వైభవ్ 1; నోర్జే (సి) శ్రేయస్ (బి) రసెల్ 4; ఇషాంత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (17.2 ఓవర్లలో ఆలౌట్) 166. వికెట్ల పతనం:** 1-21, 2-26, 3-27, 4-33, 5-126, 6-126, 7-159, 8-159, 9-161, 10-166. **బౌలింగ్:** స్టార్క్ 3-0-25-2, వైభవ్ 4-0-27-3, రసెల్ 1.2-0-14-1, నరైన్ 4-0-29-1, వరుణ్ చక్రవర్తి 4-0-33-3, వెంకటేశ్ 1-0-28-0.

సినిమా


● రామ్‌చరణ్, అమితాబ్ బచ్చన్

తాతా... మనవడు?


బాలీవుడ్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ తెలుగు సినిమాలకు వరుసగా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తున్న అమితాబ్ తాజాగా మరో తెలుగు మూవీలో నటించేందుకు సుముఖత వ్యక్తం చేశారని ఫిల్మ్ నగర్ టాక్. అది కూడా హీరో రామ్‌చరణ్‌కి తాతయ్య పాత్ర అని భోగట్టా. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో 'ఆర్‌సీ 16' (వర్కింగ్ టైటిల్) చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ అతి త్వరలోనే ప్రారంభం కానుంది. తాత-మనవడు కాన్సెప్ట్ నేపథ్యంలో రూపొందనున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ తాత పాత్ర కోసం అమితాబ్ బచ్చన్‌ని సంప్రదించారట మేకర్స్. 'ఆర్‌సీ 16' కథ, తన పాత్ర నచ్చడంతో ఈ క్యారెక్టర్ చేసేందుకు అమితాబ్ అంగీకరించారని తెలుస్తోంది. అయితే దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


● 'దిల్' రాజు, శిరీష్, మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ, పరశురామ్

అహంకారం అనుకున్నా సరే...

- విజయ్ దేవరకొండ

''నా సినిమా వంద కోట్ల రూపాయల వసూళ్లు సాధించాలనే నా కల నా నాలుగో సినిమా 'గీత గోవిందం'తో నిజమైంది. ఆ తర్వాత అలాంటి మూవీ నాకు దక్కలేదు. అనంతరం నేను నటించిన మరో సినిమా రెండు వందల కోట్ల వసూళ్లు సాధిస్తుందని చెప్పాను... కానీ, సాధించలేదు. కానీ ఎవరు ఎన్ని అనుకున్నా రెండు వందల కోట్ల రూపాయల వసూళ్ల సినిమా చేస్తాను. ఇది బలుపు, అహంకారం అనుకున్నా సరే.. కానీ ఇది నా మీద నాకున్న నమ్మకం, విశ్వాసం. ఇక ఈ సమ్మర్‌కు మా టీమ్ నుంచి మీకు ఇస్తున్న చిన్న గిఫ్ట్ 'ఫ్యామిలీ స్టార్'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ మూవీ రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో 'దిల్' రాజు మాట్లాడుతూ- ''మన కుటుంబంలోని భావోద్వేగాలతో రూపొందిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'' అన్నారు. ''మా సినిమా కథలోని భావోద్వేగాలకు అందరూ కనెక్ట్ అవుతారు'' అన్నారు పరశురామ్ పెట్ల.


● రజనీకాంత్

రజనీకాంత్ కళుగు?

రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ ఓ సినిమా నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా టైటిల్‌ను ఈ నెల 22న అధికారికంగా ప్రకటించనున్నారు మేకర్స్. అయితే తాజాగా ఈ సినిమా టైటిల్ ఇదేనంటూ పలు పేర్లు కోలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాకు 'కళుగు' (తెలుగులో 'గద్ద' అని అర్థం) అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. మరి... ఇదే టైటిల్ ఖరారు అవుతుందా? లేక మరో టైటిల్ ఫిక్స్ అవుతుందా అనేది తెలియాలంటే ఈ నెల 22 వరకు ఆగాల్సిందే. ఈ చిత్రం షూటింగ్ జూన్ చివర్లో లేదా జూలై మొదటి వారంలో ప్రారంభం కానుందని తెలిసింది. గోల్డ్ స్మగ్లింగ్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్.

మా సినిమా దమ్ బిర్యానీలా ఉంటుంది

- కోన వెంకట్


● కోన వెంకట్, అంజలి, శ్రీనివాస్ రెడ్డి

''నా 50వ సినిమా ప్రత్యేకంగా ఉండాలనుకున్నాను. 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రంతో అది నెరవేరింది. కామెడీ, హారర్ ఎలిమెంట్స్ మిక్స్ చేసి చేసిన సినిమా ఇది. మా మూవీ ట్రైలర్ బాగా వచ్చింది. ట్రైలర్ కంటే సినిమా వంద రెట్లు బాగుంటుంది'' అని హీరోయిన్ అంజలి అన్నారు. ఆమె లీడ్ రోల్‌లో నటించిన 'గీతాంజలి' (2014)కి సీక్వెల్‌గా రూపొందిన సినిమా 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. శివ తుర్లపాటి దర్శకత్వం వహించారు. అంజలి, అలీ, శ్రీనివాస్ రెడ్డి, 'సత్యం' రాజేశ్, సత్య, 'షకలక' శంకర్, బ్రహ్మాజీ ముఖ్య తారలుగా నటించారు. ఎంవీవీ సినిమాస్‌తో కలిసి కోన ఫిల్మ్స్ కార్పొరేషన్‌పై కోన వెంకట్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుకలో కోన వెంకట్ మాట్లాడుతూ- ''ట్రైలర్‌లో చూసింది కొంతే... సినిమా దమ్ బిర్యానీలా ఉంటుంది'' అన్నారు. ''గీతాంజలి మళ్లీ వచ్చింది' ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుంది. సినిమా అంతకు మించి ఉంటుంది'' అన్నారు శివ తుర్లపాటి.

అందమైన ప్రేమకథ


● ఎస్తేర్, విక్రమ్ సహిదేవ్, సందీప్ కిషన్

'సినిమా చూపిస్త మావ, నేను లోకల్, ధమాకా' వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన త్రినాథరావు నక్కిన నిర్మాతగా మారిన సంగతి తెలిసిందే. త్రినాథరావు నక్కిన నెరేటివ్స్ ప్రొడక్షన్‌లో రూపొందనున్న రెండో సినిమా బుధవారం ప్రారంభమైంది. విక్రమ్ సహిదేవ్ లగడపాటి హీరోగా నటిస్తున్న ఈ మూవీలో 'దృశ్యం' ఫేమ్ ఎస్తేర్ అనిల్ హీరోయిన్. వంశీకృష్ణ మళ్ల దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత శరత్ మరార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో సందీప్ కిషన్ క్లాప్ కొట్టారు. హీరో సుమంత్ గౌరవ దర్శకత్వం వహించగా, త్రినాథరావు, నాయుడు కలిసి దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందజేశారు. అనంతరం త్రినాథరావు మాట్లాడుతూ- ''సినిమా చూపిస్త మావ' తర్వాత మళ్లీ ఈ సినిమాకి నేను కథ రాశాను. ఇది కల్ట్ లవ్ స్టోరీ. ఓ టౌన్‌లో జరిగే అందమైన ప్రేమ కథ'' అన్నారు. ''త్రినాథరావుగారు ప్రేమించి రాసుకున్న కథని నా చేతిలో పెట్టారు. నన్ను నమ్మి చాన్స్ ఇచ్చిన ఆయనకి రుణపడి ఉంటాను'' అన్నారు వంశీకృష్ణ మళ్ల.


● శ్రీదేవి
● బోనీ కపూర్

శ్రీదేవి బయోపిక్‌కు అనుమతి ఇవ్వను

- బోనీ కపూర్

ప్రముఖ దివంగత నటి శ్రీదేవి బయోపిక్ గురించి బాలీవుడ్‌లో అప్పుడప్పుడు వార్తలు వినిపిస్తూనే ఉంటాయి. కాగా శ్రీదేవి బయోపిక్ గురించి ఆమె భర్త, నిర్మాత బోనీ కపూర్ తాజాగా స్పందించారు. ''శ్రీదేవి చాలా ప్రైవేట్ పర్సన్. ఆమె జీవితం కూడా ప్రైవేట్‌గానే ఉండాలి. అందుకే నేను బతికి ఉన్నంతవరకు శ్రీదేవి బయోపిక్‌ను తెరకెక్కించేందుకు అనుమతి ఇవ్వను'' అంటూ ఓ ఆంగ్ల మీడియాతో బోనీ కపూర్ మాట్లాడినట్లుగా బాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. అజయ్ దేవగన్ హీరోగా నటించిన స్పోర్ట్స్ డ్రామా 'మైదాన్'కు బోనీ కపూర్ ఓ నిర్మాత. ఈ నెల 10న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా శ్రీదేవి బయోపిక్ ప్రస్తావన వచ్చినప్పుడు బోనీ పై విధంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే... 2018 ఫిబ్రవరి 24న శ్రీదేవి దుబాయ్‌లో మరణించిన సంగతి తెలిసిందే.

పొలిటికల్ డ్రామా


● విరించి వర్మ, రాకేశ్, రవీందర్ రెడ్డి

రాకేశ్ వర్రే, రియా సుమన్, 'ఛత్రపతి' శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'జితేందర్ రెడ్డి'. విరించి వర్మ దర్శకత్వంలో ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో ముదుగంటి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ- ''1980 కాలంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా పొలిటికల్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజులాంటి వాళ్ల చరిత్ర తెలుసుకోవడం ఎంత ముఖ్యమో జితేందర్ రెడ్డి గురించి తెలుసుకోవడం కూడా అలాంటిదే'' అన్నారు. ''కొంతకాలం గ్యాప్ తర్వాత 'జితేందర్ రెడ్డి' లాంటి ఒక మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను'' అన్నారు విరించి వర్మ.

సీక్రెట్ వార్స్‌కు చాన్స్ ఇవ్వండి

- దర్శకుడు శ్యాముల్ రైమి



హాలీవుడ్ సూపర్ డూపర్‌హిట్ సూపర్ హీరో ఫ్రాంచైజీ 'అవెంజర్స్'. ఈ ఫ్రాంచైజీ నుంచి తాజాగా 'అవెంజర్స్: సీక్రెట్ వార్స్' సినిమా రానుంది. అయితే ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ తనకు దక్కితే బాగుంటుందని దర్శక-నిర్మాత, రచయిత శ్యాముల్ ఎమ్ రైమి చేసిన వ్యాఖ్యలు హాలీవుడ్‌లో చర్చనీయాంశమయ్యాయి. ఇక దర్శకుడిగా 'ది ఈవిల్ డెడ్', 'ది ఈవిల్ డెడ్ 2', 'స్పైడర్ మేన్', 'స్పైడర్ మేన్ 2', 'స్పైడర్ మేన్ 3' వంటి సినిమాలను తెరకెక్కించారు శ్యాముల్. మరి.. 'అవెంజర్స్: సీక్రెట్ వార్స్' చిత్రానికి దర్శకత్వం వహించే చాన్స్ శ్యాముల్ కోరుకున్నట్లు ఆయనకు దక్కుతుందా? అనేది చూడాలి. మరోవైపు 'అవెంజర్స్: సీక్రెట్ వార్స్' సినిమాలోని ప్రధాన తారాగణాన్ని ఇంకా ప్రకటించలేదు మార్వెల్ సంస్థ. అయితే టామ్ హాలండ్, క్రిస్ హెమ్‌వర్త్, ఆంథోనీ మాకీ లీడ్ రోల్స్‌లో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది.

సినిమాల్లోనే ఉంటాను


● సూర్యతేజ

ప్రముఖ పబ్లిసిటీ డిజైనర్ ధని ఏలే తనయుడు సూర్య తేజ ఏలే హీరోగా పరిచయమవుతున్న సినిమా 'భరత నాట్యం'. కేవీఆర్ మహేంద్ర దర్శకత్వంలో పాయల్ సరాఫ్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సూర్యతేజ మాట్లాడుతూ - ''చిన్నప్పట్నుంచి ఫిల్మ్ డైరెక్టర్ కావాలనుకునేవాణ్ని. వినయ్ వర్మ గారి దగ్గర యాక్టింగ్ కోర్స్ చేశాను. అన్నపూర్ణలో ఫిల్మ్ కోర్స్ చేశాను. మెల్లిగా రైటింగ్ పై ఆసక్తి పెరిగి, కథలు రాయడం ప్రారంభించాను. 'భరతనాట్యం'కు నేనే రైటర్‌ని. సో.. వ్యక్తిగతంగా ఫీలైన కొన్ని స్ట్రగుల్స్‌ను ఈ సినిమాలో కామికల్‌గా చెప్పే ప్రయత్నం చేశాను. ఓ మనిషి షార్ట్‌కట్‌లోకి వెళితే ఏం జరుగుతుంది? అన్నదే ఈ చిత్రకథ. నాకు పెయింటింగ్, ఎడిటింగ్‌లపైనా అవగాహన ఉంది. రైటర్, ఎడిటర్, యాక్టర్ అని కాదు.. ఏదో రూపంలో సినిమాల్లోనే ఉండాలనుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు.

సాక్షి బిజినెస్
గురువారం
4-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	27	73,877
నిఫ్టీ ▽	19	22,435

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,321	△	47
డోజోన్స్	39,217	△	47
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,937	△	2
డాక్స్	18,368	△	84
షాంఘై	3,069	▽	6
నికాయ్	39,452	▽	387

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	69,364	△	403
బంగారం (99.5 స్వచ్ఛత)	69,086	△	402
వెండి (కిలో)	77,594	△	1,467

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.97	83.99
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.44	105.98
€	యూరో	ఎస్‌బీఐ	88.42	90.77
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.41	55.63
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.25	55.16
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.34	64.02
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.34	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.82	23.60
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	12.48

టాప్-10లో ముకేశ్ అంబానీ

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ మరోసారి ప్రపంచ కుబేరుల జాబితాలో చోటు సాధించారు. 2024 ఏడాదికి ఫోర్బ్స్ టాప్-10 బిలియనీర్లలో 9వ ర్యాంకును పొందారు. 116 బిలియన్ డాలర్ల సంపదతో 66 ఏళ్ల ముకేశ్ టాప్-9గా నిలిచారు. 2023లో ముకేశ్ సంపద 83.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది. కాగా.. దేశీయంగా సంపదలో టాప్-2గా నిలుస్తున్న గౌతమ్ అదానీ 84 బిలియన్ డాలర్లతో ప్రపంచంలో 17వ ర్యాంకును అందుకున్నారు. యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణల కారణంగా 2023లో అదానీ సంపద 47.2 బిలియన్ డాలర్లకు క్షీణించిన సంగతి తెలిసిందే. హిండెన్‌బర్గ్ ఆరోపణలను తోసిపుచ్చిన నేపథ్యంలో అదానీ గ్రూప్ తిరిగి బలపడింది. ఇక 2022లో అదానీ 90 బిలియన్ డాలర్ల నెట్‌వర్త్‌ను సాధించడం ప్రస్తావించదగ్గ అంశం!

ప్రపంచ బిలియనీర్లలో మళ్లీ చోటు



జాబితా ఇలా

ఫోర్బ్స్ 2024 బిలియనీర్ల జాబితాలో 2,781 మంది వ్యక్తులు చోటు సాధించారు. గతేడాది జాబితాతో పోలిస్తే 141 మందికి అదనంగా చోటు లభించింది. 2023తో పోలిస్తే కుబేరుల ఉమ్మడి సంపద 2 లక్షల కోట్ల డాలర్లు పెరిగి 14.2 ట్రిలియన్ డాలర్లను తాకింది. సరికొత్త రికార్డ్ నమోదైన 2021తో పోలిస్తే 1.1 లక్షల కోట్ల డాలర్లు జత కలసింది. ఫ్యాషన్స్, కాస్మెటిక్స్ దిగ్గజం ఎల్‌వీఎంహెచ్‌కు చెందిన బెర్నార్డ్ ఆర్నాల్ట్ 233 బిలియన్ డాలర్లతో టాప్ ర్యాంకును, 195 బిలియన్ డాలర్లతో ఎలన్ మస్క్ రెండో ర్యాంకునూ కొల్లగొట్టారు. 177 బిలియన్ డాలర్లతో ఫేస్‌బుక్ జుకర్‌బర్గ్ టాప్-3గా నిలిచారు.

మార్కెట్లోకి టయోటా అర్బన్ క్రూజర్ టైజర్

ధర రూ.7.73 లక్షల నుంచి ప్రారంభం



కారు ఆవిష్కరణ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) తాజాగా మార్కెట్లోకి ఎంట్రీ లెవెల్ ఎస్‌యూవీ 'అర్బన్ క్రూజర్ టైజర్'ను విడుదల చేసింది. దీని ధర రూ. 7.73 లక్షల నుంచి రూ. 13.03 లక్షల వరకు (ఎక్స్-షోరూమ్) ఉంటుంది. ఇది మారుతీ సుజుకీకి చెందిన ఫ్రాంక్స్‌కి టీకేఎం వెర్షన్‌గా ఉంటుంది. టైజర్ పెట్రోల్, ఈ-సీఎన్‌జీ ఆప్షన్లలో లభిస్తుంది. ప్రీమియం ఇంటీరియర్స్, కీ లెస్ ఎంట్రీ, 360 వ్యూ కెమెరా, 9 అంగుళాల హెచ్‌డీ స్మార్ట్‌ప్లే, యాంటీ-థెఫ్ట్ సెక్యూరిటీ సిస్టమ్ తదితర ఫీచర్లు ఉన్నాయి. రూ. 11,000తో టైజర్‌ను బుక్ చేసుకోవచ్చు. మే నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయి. మరింత మంది కస్టమర్లకు చేరువయ్యేందుకు ఈ మోడల్ తమకు ఉపయోగపడగలదని కంపెనీ డిప్యూటీ ఎండీ తడాషి అసాజుమా తెలిపారు. కస్టమర్లు చిన్న కార్ల నుంచి క్రమంగా పెద్ద కార్ల వైపు మళ్లుతున్నారని, అందుకే మరిన్ని కొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టేందుకు తాము ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

పునరుత్పాదక విద్యుత్‌లో అదానీ గ్రీన్ ఎనర్జీ రికార్డు

దేశంలో తొలిసారిగా 10 వేల మెగావాట్ల సామర్థ్యం



న్యూఢిల్లీ: దేశీయంగా 10,000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సాధించిన తొలి కంపెనీగా తమ సంస్థ నిల్చిందని అదానీ గ్రీన్ ఎనర్జీ (ఏజీఈఎల్) తెలిపింది. గుజరాత్‌లోని ఖావ్డా సోలార్ పార్క్‌లో 2,000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంటు ఏర్పాటు ద్వారా దీన్ని సాధించినట్లు సంస్థ వివరించింది. ప్రస్తుతం కంపెనీ పోర్ట్‌ఫోలియోలో 7,393 మెగావాట్ల సౌర విద్యుత్, 1,401 మెగావాట్ల పవన విద్యుత్, 2,140 మెగావాట్ల విండ్-సోలార్ హైబ్రిడ్ ప్లాంట్లు (మొత్తం 10,934 మెగావాట్ల) ఉన్నాయి. 2030 నాటికల్లా 45 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలని కంపెనీ నిర్దేశించుకుంది.

దేశీయంగా తొలి వాణిజ్య క్రూడాయిల్ స్టోరేజీ

కర్ణాటకలోని పాదూర్‌లో నిర్మాణం ● బిడ్లను ఆహ్వానించిన ఐఎస్‌పీఆర్ఎల్



న్యూఢిల్లీ: క్రూడాయిల్ సరఫరాలో ఒడిదుడుకులు ఏవైనా తలెత్తితే సమర్థంగా ఎదుర్కొనేందుకు దేశీయంగా తొలి వాణిజ్యపరమైన వ్యూహాత్మక ముడిచమురు స్టోరేజీ యూనిట్ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. కర్ణాటకలోని పాదూర్‌లో 2.5 మిలియన్ టన్నుల నిల్వ సామర్థ్యంతో భూగర్భంలో ముడిచమురు నిల్వ కోసం స్టోరేజీని నిర్మించేందుకు (పాదూర్ 2) ఇండియన్ స్ట్రాటెజిక్ పెట్రోలియం రిజర్వ్ (ఐఎస్‌పీఆర్ఎల్) బిడ్లను ఆహ్వానించింది. బిడ్ల దాఖలుకు ఏప్రిల్ 22 ఆఖరు తేదీ కాగా, జూన్ 27 నాటికి ప్రాజెక్టును కేటాయిస్తారు. దీనికి సంబంధించిన టెండర్ డాక్యుమెంట్ల ప్రకారం ఇది ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) ప్రాతిపదికన ఉంటుంది. ప్రైవేట్ పార్టీలు స్టోరేజీని డిజైన్ చేయడం, నిర్మించడం, ఫైనాన్స్ చేయడం, నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. పాదూర్-2 స్టోరేజీని ఆపరేటరు ఏ ఆయిల్ కంపెనీకైనా లీజుకివ్వచ్చు. అందులో చమురుని నిల్వ చేసుకునే కంపెనీలు దాన్ని దేశీ రిఫైనర్లకు విక్రయించుకోవచ్చు. అయితే, అత్యవసర పరిస్థితుల్లో మాత్రం నిల్వలను ముందుగా ఉపయోగించుకునేందుకు భారత ప్రభుత్వానికి హక్కులు ఉంటాయి. ఐఎస్‌పీఆర్ఎల్ తొలి దశలో విశాఖపట్నంతో పాటు మంగళూరు, పాదూర్‌లో 5.33 మిలియన్ టన్నుల నిల్వ సామర్థ్యంతో వ్యూహాత్మక స్టోరేజీ యూనిట్లను ప్రభుత్వ వ్యయంతో ఏర్పాటు చేసింది. రెండో దశలో భాగంగా అండర్‌గ్రౌండ్‌లో రూ. 5,514 కోట్ల వ్యయంతో వాణిజ్య, వ్యూహాత్మక పెట్రోలియం స్టోరేజీ యూనిట్‌ను ప్రతిపాదిస్తోంది.

ఒడిదుడుకుల ట్రేడింగ్

- మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల ప్రభావం
- స్వల్ప నష్టాల ముగింపు
- బ్యాంకింగ్, ఆటో షేర్లకు నష్టాలు

ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు బుధవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఇంట్రాడేలో 611 పాయింట్ల పరిధిలో ట్రేడైన సెన్సెక్స్ చివరికి 27 పాయింట్లు నష్టపోయి 73,877 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఇంట్రాడేలో 107 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 19 పాయింట్లు కోల్పోయి 22,435 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు ట్రేడింగ్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఆర్‌బీఐ ద్రవ్య సమీక్ష సమావేశ ప్రారంభం, యూఎస్ చైర్మన్ ప్రసంగం నేపథ్యంలో అప్రమత్తత చోటు చేసుకుంది. బ్యాంకింగ్, ఐటీ, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఐటీ, మెటల్, ఆయిల్ అండ్‌గ్యాస్, విద్యుత్ షేర్లు రాణించాయి. బీఎస్ఈల మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.61%, 1.18% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,214 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,102 కోట్ల షేర్లను కొన్నారు.



- ఎస్ఆర్ఎం కాంట్రాక్టర్స్ షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.210)తో పోలిస్తే 7% ప్రీమియంతో రూ.225 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ అస్థిరతలోనూ ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ట్రేడింగ్‌లో అప్పర్ సర్క్యూట్ తాకింది. చివరికి 12.50% లాభంతో రూ.236 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.542 కోట్లుగా నమోదైంది.
- దేశీయంగా 10,000 మెగావాట్ల (మె.వా.) పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సాధించిన తొలి కంపెనీగా అవతరించడంతో అదానీ గ్రీన్ ఎనర్జీ (ఏజీఈఎల్) షేరు 5% ఎగసి 618 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది.

ఎన్ఎస్ఈలో కొత్తగా 4 సూచీలు

ఎఫ్అండ్ఓ, నగదులో ఈ నెల 8 నుంచి షురూ



నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎన్ఎస్ఈ) తాజాగా నగదు విభాగంతోపాటు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్అండ్ఓ)లో నాలుగు ఇండెక్సులను కొత్తగా ప్రవేశపెడుతోంది. నిఫ్టీ టాటా గ్రూప్ 25 శాతం క్యాప్, నిఫ్టీ500 మల్టీక్యాప్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ 50:30:20, నిఫ్టీ500 మల్టీక్యాప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 50:30:20, నిఫ్టీ మిడ్‌స్మాల్ హెల్త్‌కేర్ పేరుతో కొత్త సూచీలను రూపొందించింది. ఇవి ఈ నెల 8 నుంచి అమల్లోకి రానున్నాయి. నిఫ్టీ500 మల్టీక్యాప్ ఇండియా ఇండెక్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్, సన్ ఫార్మా, టాటా మోటార్స్ కీలకంగా నిలవనున్నాయి. ఇన్‌ఫ్రా ఇండెక్స్‌లో ఎల్అండ్‌టీ, ఆర్ఐఎల్, భారతీ ఎయిర్‌టెల్ ప్రాధాన్యత వహించనున్నాయి.

భారత్‌లో మోటరోలా ఎడ్జ్ 50 ప్రో



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మోటరోలా భారత్‌లో ఎడ్జ్ 50 ప్రో స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. ప్రపంచంలో తొలి ట్రూ కలర్ కెమెరా, 3డీ కర్వ్‌డ్ డిస్‌ప్లే ఫోన్ ఇదేనని కంపెనీ చెబుతోంది. 6.7 అంగుళాల 1.5కే సూపర్ హెచ్‌డీ పీఓఎల్ఈడీ డిస్‌ప్లే, ఆన్‌డ్రాయిడ్ 14 ఓఎస్, 30 ఎక్స్ హైబ్రిడ్ జూమ్, 3 ఎక్స్ ఆప్టికల్ జూమ్‌తో 50 ఎంపీ ప్రైమరీ ఏఐ కెమెరా, టర్బో పవర్ 50 వాట్ వైర్‌లెస్ చార్జింగ్, 125 వాట్ టర్బోపవర్ వైర్డ్ చార్జింగ్ వంటి హంగులు ఉన్నాయి. ధర రూ.27,999 నుంచి ప్రారంభం.

కెనరా బ్యాంక్ నుంచి సరికొత్త సేవలు



హైదరాబాద్: కెనరా బ్యాంక్ పలు కొత్త ఉత్పత్తులు, సర్వీసులు ప్రారంభించింది. 'కెనరా హీల్' పేరుతో వినూత్న హెల్త్ ప్రాడక్ట్ ప్రవేశపెట్టింది. ఆసుపత్రుల్లో చికిత్సలకు బీమా క్లెయిమ్ పూర్తిగా రాని సందర్భాల్లో 'కెనరా హీల్' ద్వారా రుణ సహాయం అందించనుంది. మహిళల కోసం 'కెనరా ఏంజెల్' అనే పేరుతో కస్టమైజ్డ్ సేవింగ్స్ ఖాతాను ప్రవేశపెట్టింది. ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులకు ఆన్‌లైన్ ద్వారా తక్షణ రుణ సదుపాయానికి 'కెనరా ఎస్‌హెచ్‌జీ ఈ-మనీ' తీసుకొచ్చింది. అలాగే ప్రీ-అప్రూవ్డ్ వ్యక్తిగత రుణాలకు 'కెనరా రెడీక్యాష్'; ఆన్‌లైన్ టర్మ్ డిపాజిట్ రుణాలకు 'కెనరా మైమనీ'; అవాంతరాలు లేని చెల్లింపులకు 'కెనరా యూపీఐ 123పే ఏఎస్ఐ' సేవలు ప్రారంభించింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ సీఈఓ రాజేష్ బన్సాల్, కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-4-2024 ఫామ్ ధర...

విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403-00
విజయవాడ	403-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.15

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

జీటీఆర్ఈ, బెంగళూరులో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీ పోస్టులు

బెంగళూరులోని డీఆర్‌డీవోకి చెందిన గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (జీటీఆర్ఈ)లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 150
» **పోస్టుల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీ(ఇంజనీరింగ్)-75, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీ(నాన్ ఇంజనీరింగ్)-30, డిప్లొమా అప్రెంటిస్ ట్రైనీ-20, ఐటీఐ అప్రెంటిస్ ట్రైనీ-25.
» **విభాగాలు:** మెకానికల్/ప్రొడక్షన్/ఇండస్ట్రియల్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్ /ఏరోనాటికల్/ఏయిరో స్పేస్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ /ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ /ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/టెలికాం ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ సైన్స్-టెక్నాలజీ ఇంజనీరింగ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, బీఈ, బీటెక్, డిప్లొమా(ఇంజనీరింగ్), బీకాం, బీఎస్సీ, బీఏ, బీసీఏ, బీబీఏ(నాన్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 18 నుంచి 37 ఏళ్ల మించకూడదు.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000, ఐటీఐ అప్రెంటిస్‌కు రూ.7000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.04.2024
» **వెబ్‌సైట్:** www.drdo.gov.in/drdo

ఐఐఐటీడీఎం, కాంచీపురంలో ఎండీఈఎస్‌లో ప్రవేశాలు

కాంచీపురం(తమిళనాడు)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్(ఐఐఐటీడీఎం)-జూలై 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ-మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్/డిజైన్/ఆర్కిటెక్చర్ విభాగాల్లో డిగ్రీతో పాటు సీఈఈడీ స్కోరు తప్పనిసరిగా ఉండాలి.
» **ఎంపిక విధానం:** సీఈఈడీ స్కోరు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** పీహెచ్‌డీ-15.04.2024. ఎం.డిజైన్-30.04.2024.
» **ఆన్‌లైన్ ఇంటర్వ్యూ తేది:** 06.05.2024.
» **వెబ్‌సైట్:** www.iiitdm.ac.in

సీమ్యాట్-2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(సీమ్యాట్)-2024 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్(సీబీటీ). ప్రశ్నాపత్రం 400 మార్కులకు ఉంటుంది. 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు ఉంటాయి. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ కాంప్రెహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 3 గంటలు. నెగిటివ్ మార్కులు ఉంటాయి. ప్రతి సమాధానానికి ఒక్కో మార్కు చొప్పున తగ్గిస్తారు. ప్రశ్నాపత్రం ఆంగ్లమాధ్యమంలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.04.2024
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 19.04.2024 నుంచి 21.04.2024 వరకు
» **పరీక్ష తేది:** మే, 2024
» **వెబ్‌సైట్:** https://cmat.nta.nic.in


ఐడీఆర్‌బీటీలో పీజీడీబీటీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ(ఐడీఆర్‌బీటీ).. పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ(పీజీడీబీటీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** 60శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ లేదా మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** డైరెక్ట్ అభ్యర్థులకు గేట్ /క్యాట్ /జీమ్యాట్ /జీఆర్ఈ /సీమ్యాట్/గ్జాట్ /మ్యాట్/ఏటీఎంఏ స్కోర్, షార్ట్‌లిస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు. ఇతరులకు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2024
» **వెబ్‌సైట్:** https://www.idrbt.ac.in

సెబీలో కొలువు.. లక్షకుపైగా వేతనం!

స్టాక్ ఎక్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా.. సంక్షిప్తంగా సెబీ. స్టాక్ మార్కెట్ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, నియంత్రణ చర్యలు చేపట్టే సంస్థ.. సెబీ. సాధారణ పరిపాలన విభాగం మొదలు రీసెర్చ్ వరకూ.. పలు విభాగాల్లో నిపుణుల నియామకాలకు సిద్ధమవుతోంది. తాజాగా ఆఫీసర్ గ్రేడ్-ఎ అసిస్టెంట్ మేనేజర్ పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కొలువు సొంతం చేసుకుంటే.. నెలకు రూ.1.11 లక్షల వేతనం లభిస్తుంది! ఈ నేపథ్యంలో.. సెబీ అసిస్టెంట్ మేనేజర్ పోస్ట్‌ల సమాచారం, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, సిలబస్ అంశాలు తదితర వివరాలు..



» 97 అసిస్టెంట్ మేనేజర్ పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ
» ఎంపికైతే నెలకు రూ.1.11 లక్షల వేతనం

మొత్తం 97 పోస్టులు

సెబీ తాజా నోటిఫికేషన్ ప్రకారం-మొత్తం ఆరు విభాగాల్లో 97 అసిస్టెంట్ మేనేజర్ పోస్ట్‌లను భర్తీ చేయనుంది. వీటిల్లో జనరల్ విభాగంలో 62 పోస్టులు, లీగల్-5 పోస్టులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ -24 పోస్టులు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-2 పోస్టులు, రీసెర్చ్-2 పోస్టులు, అధికార భాష (అఫిషియల్ లాంగ్వేజ్)-2 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి సంబంధిత సబ్జెక్టులలో పీజీ/బీటెక్/బీఏ/బీకాం/ బీఎస్సీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 2024, మార్చి 31 నాటికి 30 ఏళ్లలోపు ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

నెలకు రూ.1.11 లక్షల వేతనం

మూడు దశల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసుకుని.. నియామకం ఖరారు చేసుకున్న వారికి ప్రారంభంలోనే వసతి సదుపాయంతోపాటు నెలకు రూ.1.11 లక్షల వేతనం అందుతుంది. వసతి సదుపాయం లేకపోతే నెలకు రూ.1,49,500 వేతనం అందిస్తారు. వీటితోపాటు ఇతర అలవెన్స్‌లు కూడా లభిస్తాయి.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఆయా విభాగాల్లో అసిస్టెంట్ మేనేజర్ పోస్ట్‌ల భర్తీకి మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. అవి.. ఫేజ్-1(ప్రిలిమినరీ రాత పరీక్ష), ఫేజ్-2(మెయిన్ రాత పరీక్ష), పర్సనల్ ఇంటర్వ్యూ.

ఫేజ్-1 పరీక్ష

ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్ష (ఫేజ్-1.. 200 మార్కులు)లో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1 మొత్తం 100 మార్కులకు గంట వ్యవధిలో నిర్వహిస్తారు. ఇందులో జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పేపర్-2లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విభాగానికి సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 50 ప్రశ్నలతో 100 మార్కులు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం ఒక గంట నలభై నిమిషాలు.

ఫేజ్-2 ఇలా

ఫేజ్-1లో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు పది మందిని చొప్పున ఎంపిక చేసి ఫేజ్-2 పరీక్ష నిర్వహిస్తారు. ఫేజ్-2 పరీక్ష కూడా రెండు పేపర్లుగా ఉంటుంది. పేపర్-1: ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్ (100 మార్కులు). ఇందులో ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్, ప్రెసిస్ రైటింగ్ ఉంటాయి. పేపర్-2ను ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ఎంచుకున్న స్పెషలైజేషన్ నుంచి 70 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు (70 మార్కులు), అదే విధంగా మూడు డిస్క్రిప్టివ్ ప్రశ్నలు (ఒక్కో ప్రశ్నకు 10 మార్కులు) అడుగుతారు.

తుది దశ పర్సనల్ ఇంటర్వ్యూ

ఫేజ్-2లో కూడా విజయం సాధిస్తే నిర్దేశిత కటాఫ్ నిబంధనల ప్రకారం-అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసి తుది దశలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూలో అకడమిక్ నేపథ్యం, ప్రొఫెషనల్ ఎక్స్‌పీరియన్స్, స్టాక్ మార్కెట్ కార్యకలాపాలపై ప్రశ్నలు ఉంటాయి.

వెయిటేజీ విధానం

పర్సనల్ ఇంటర్వ్యూ కూడా పూర్తయిన తర్వాత.. నియామకాలు ఖరారు చేసే క్రమంలో వెయిటేజీ విధానం పాటిస్తారు. ఫేజ్-2 రాత పరీక్షలో పొందిన మార్కులకు 85 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులకు 15 శాతం వెయిటేజీ కల్పిస్తారు. దీనికి అనుగుణంగా తుది జాబితా రూపొందించి నియామకాలు ఖరారు చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** 2024, ఏప్రిల్ 13
- **ఫేజ్-1 రాత పరీక్ష:** జూన్ మొదటి వారంలో నిర్వహించే అవకాశం.
- **వివరాలకు వెబ్‌సైట్:** www.sebi.gov.in/sebiweb/about/AboutAction.do?doVacancies=yes

రాత పరీక్షలో సక్సెస్ ఇలా

జనరల్ అవేర్‌నెస్

కరెంట్ అఫైర్స్, జీకేతోపాటు ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో మార్పులు, స్టాక్ మార్కెట్ కార్యకలాపాలు, విధి విధానాలు, నూతన నిబంధనలు వంటి అంశాల గురించి తెలుసుకోవాలి. స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన టెర్మినాలజీపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా బాగా ప్రాక్టీస్ చేస్తే.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

రీజనింగ్

రీజనింగ్ ప్రిపరేషన్‌లో అభ్యర్థులు సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

ఫేజ్-1, ఫేజ్-2లలో అభ్యర్థులు ఎంచుకున్న విభాగంలో ప్రశ్నలు అడుగుతారు. తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్, దానికి సంబంధించి బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను చదవాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్

ఫేజ్-2లో పేపర్-1గా ఉండే ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో రాణించడానికి అభ్యర్థులు ఇంగ్లిష్ కాంప్రహెన్షన్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్‌లలో నైపుణ్యం కోసం ఇంగ్లిష్ దిన పత్రికల ఎడిటోరియల్స్‌ను చదవాలి. వాటి సారాంశంతో సొంతంగా వ్యాసాలు రాసే నైపుణ్యం పెంచుకోవాలి. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పర్సనల్, బిజినెస్ లెటర్ల తీరు, పంక్చుయేషన్స్, లెటర్ స్వరూపం(బాడీ ఆఫ్ ద లెటర్)పై పూర్తి అవగాహన పొందాలి.

క్లుప్తంగా...

అనధికార అడ్మిషన్లపై చర్యలు: శ్రుతి ఓజా



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు జూనియర్ కాలేజీలు అనధికారికంగా విద్యార్థులను చేర్చుకుంటే చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రుతి ఓజా తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్‌ను ఇంటర్ బోర్డు ఇంత వరకూ విడుదల చేయలేదని, అనుబంధ గుర్తింపు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అకడమిక్ క్యాలెండర్‌ను అధికారిక వెబ్‌సైట్ (tsbie.cgg.gov.in)లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అనుబంధ గుర్తింపు ఉన్న కాలేజీల్లోనే విద్యార్థులను చేర్పాలని తల్లిదండ్రులకు ఆమె సూచించారు.

నరెడ్కో తెలంగాణ అధ్యక్షుడిగా విజయ్‌సాయి



సాక్షి, హైదరాబాద్: నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) తెలంగాణ నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా విజయ్ సాయి మేక, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్లుగా కాశీ ప్రసాద్ దామెర, లాయస్ కిరణ్, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు.

ఎయిర్‌పోర్టులో గతేడాది 132 కేజీల బంగారం పట్టివేత

మొత్తం 247 కేసులు..31 మంది అరెస్ట్



ఓ ప్రయాణికుడు చెప్పులో పెట్టుకుని తీసుకొచ్చిన బంగారం

శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 2023–24 ఏడాది మొత్తంలో 132 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. గతేడాది 247 బంగారం అక్రమ రవాణా కేసులు నమోదు చేసి మొత్తం 31 మందిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. అరబ్ దేశాలతో పాటు ఆఫ్రికా, బ్యాంకాక్, సింగపూర్ తదితర దేశాల నుంచి బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చి పట్టుబడ్డారు. బంగారం అక్రమ రవాణాపై పటిష్ట నిఘాను ఏర్పాటు చేయడంతో మార్చి నెలలో సైతం 27 కేసుల్లో మొత్తం 12 కేజీలు స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు.

8న జేఏఓ, ఎస్ఏఓ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 8న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఇప్పటికే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించింది. అభ్యర్థులు నిర్దేశించిన తేదీలో తప్పనిసరిగాహాజరుకావాలని, మరో అవకాశం ఉండదని స్పష్టం చేసింది.

ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్‌లో గ్లోబల్ లీడర్‌గా నారాయణ

సాక్షి, హైదరాబాద్: నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గెరార్డ్ కేఓ నీల్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్–2024లో నారాయణ విద్యార్థులు సత్తాచాటారు. సైన్స్ ప్రాజెక్టుల్లో వరల్డ్ నంబర్‌వన్ స్థానంలో 2 సెలక్షన్స్ నారాయణ విద్యార్థులు దక్కించుకున్నారని ఆ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ సింధూర నారాయణ, శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వరల్డ్ నంబర్ 2 స్థానంలో 5, వరల్డ్ నంబర్ 3 స్థానంలో 7 సెలక్షన్స్ పాటు 20 హానరబుల్ ప్రైజ్‌లను నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వెల్లడించారు. మొత్తంగా 34 ప్రాజెక్టుల్లో విజయకేతనం ఎగురవేసినట్లు పేర్కొన్నారు. 11 ఏళ్లుగా అద్భుత ఫలితాలు సాధిస్తూ ఇప్పటివరకు 334కు పైగా ప్రాజెక్టులు గెలుచుకుని వరల్డ్ నెంబర్‌వన్‌గా నారాయణ నిరూపించుకుందని వారు తెలిపారు. ఘనవిజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునీత్ అభినందించారు.

ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్‌లో చాంపియన్‌గా శ్రీచైతన్య

సాక్షి, హైదరాబాద్: అమెరికా ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్–2024లో శ్రీచైతన్య వరుసగా 11వ సంవత్సరం వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది. ఇందులో ప్రపంచంలోని 28కి పైగా దేశాలు పాల్గొనగా శ్రీచైతన్య విద్యార్థులు నంబర్‌వన్ స్థానంలో నిలిచినట్లు శ్రీచైతన్య డైరెక్టర్ సీమ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాంటెస్ట్‌లో 3 నగదు అవార్డులను ఎన్ఎస్ఎస్ ప్రకటించగా.. అందులో రెండు నగదు అవార్డులను వరుసగా రెండో సంవత్సరం శ్రీచైతన్య విద్యార్థులు సాధించారన్నారు. అలాగే వరల్డ్ ఫస్ట్ ప్రైజ్–7 ప్రాజెక్టులు, వరల్డ్ సెకండ్ ప్రైజ్–11 ప్రాజెక్టులు, వరల్డ్ థర్డ్ ప్రైజ్–15 ప్రాజెక్టులు, హానరబుల్ మెన్షన్స్–29 ప్రాజెక్టులు కలిపి మొత్తం విన్నింగ్ ప్రాజెక్టులు–62 ఒక్క శ్రీచైతన్య మాత్రమే సాధించిందని వివరించారు. ఈ విన్నింగ్ ప్రాజెక్టుల్లో 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొని విజయం సాధించారని ఆమె పేర్కొన్నారు.





ఈ అంధకారం నుంచి స్వాతంత్య్రం ఎప్పుడు?

స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా కొన్ని గిరిజన గ్రామాలు విద్యుత్ సౌకర్యానికి నోచుకోలేదు. దీంతో ఆ పల్లెలు ఏళ్ల తరబడి అంధకారంలోనే మగ్గుతున్నాయి. ఆర్థిక స్తోమత ఉన్న కొన్ని గిరిజన కుటుంబాలు ఒక ఫ్యాన్ తిరిగేలా, ట్యూబ్‌లైట్ వెలిగేలా సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాయి. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కమట్‌వాడ పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామమైన జెండాగూడ దుస్థితి ఇది.

తాంసి/సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

9 అడుగుల్లో బోరు.. కరెంటు లేకున్నా 20 ఏళ్లుగా నీరు

ఆదిలాబాద్ జిల్లాలో ఓ రైతు చేనులో ఆగని జలధార..

2005లో వేసిన బోరు.. మండే ఎండల్లోనూ నిరంతరాయంగా ప్రవాహం

సాక్షి, ఆదిలాబాద్: మండుతున్న ఎండలతో రాష్ట్రంలో నీటి సంక్షోభం తీవ్రమవుతోంది. చెరువులు ఎండిపోతున్నాయి. పంటలకు నీరందక చేలలో బీటలు కనిపిస్తున్నాయి. మరో వైపు తాగునీటి సమస్య కూడా జఠిలమవుతోంది. భూగర్భ జలాలు అంతకంతకూ అడుగంటిపోతున్నాయి. అయితే ఇలాంటి పరిస్థితుల్లోనూ ఆదిలాబాద్ జిల్లా బేల మండలం దుబ్బగూడ (ఎస్)లోని ఓ గిరిజన రైతు పంట చేనులో మాత్రం బోరు నుంచి జలం ఉబికి వస్తూనే ఉంది. విచిత్రం ఏమిటంటే అసలు ఈ బోరుకు కరెంటు కనెక్షనే లేదు. దాదాపు 20 ఏళ్లుగా సహజంగా నీళ్లు ఇలా వస్తూనే ఉన్నాయి.




బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు

2005 నుంచి కొనసాగుతున్న ధార..

గిరిజన రైతు టేకం తుకారాంకు 26 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆయన ముగ్గురు కుమారులతో కలిసి దీన్ని సాగుచేస్తున్నాడు. 2005లో తుకారాం చేనులో బోరు వేయించాడు. అప్పుడు 9 అడుగులకే నీళ్లు ఉబికి వచ్చాయి. కరెంటు కనెక్షన్ ఇవ్వాల్సిన అవసరం లేకుండానే ఆ జలధార ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రస్తుతం 13 ఎకరాల్లో జొన్న, గోధుమ పంటలు పండిస్తున్నాడు. వీటికి నిరంతరాయంగా బోరు నుంచి వచ్చే నీరే అందిస్తున్నాడు.

ఆర్టిసియన్ బావి కారణంగానే..



దీన్ని భూగర్భ జలశాస్త్రం ప్రకారం ఆర్టిసియన్ బావి అంటారు. దుబ్బగూడ (ఎస్)కు సమీపంలో గుట్ట ఉంది. వర్షం కురిసినప్పుడు ఆ గుట్ట ప్రాంతంలో జలం రీచార్జ్ అవుతుంది. అక్కడి నుంచి నిలువుగా ఉన్నటువంటి పొర దిగువన గుట్ట దిగిన తర్వాత తుకారాం చేనులో నుంచి వెళ్తుంది. పైపొర గుట్ట పైభాగం నుంచి మొదలు కాగా చివరి పొర తుకారాం చేనును దాటి వెళ్తోంది. దుబ్బగూడలో ఒక లేయర్‌లో భూగర్భ జలాలు పైవరకు ఉంటాయి. మధ్య ప్రాంతంలో ఎవరైనా బోరు వేసినప్పుడు ఈ పొరను తాకడంతో నీళ్లు ఉబికి వస్తున్నాయి. ఒక ట్యూబ్‌కు మధ్యలో ఎక్కడైనా పంచర్ పడ్డప్పుడు గాలి, నీరు ప్రెషర్‌తో బయటకు వచ్చినట్లే ఇక్కడ కూడా పైపొర, చివరి పొర మధ్యన బోరువేసినప్పుడు నీటికి బయటకు వెళ్లే మార్గం ఏర్పడింది. గుట్టకు సమీపంలో ఉండే ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఇలాంటి పరిస్థితి కనిపిస్తుంది. ఆదిలాబాద్ రూరల్ మండలం బోరింగ్‌గూడలో కూడా ఇలాగే నీళ్లు ఉబికి వస్తాయి. **-టి. పుల్లారావు, అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్ట్, ఆదిలాబాద్**

సాక్షి డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డికి సంవాహన అవార్డు

ఘనంగా పీఆర్‌సీఐ వ్యవస్థాపక దినోత్సవాలు



సంవాహన అవార్డు అందుకుంటున్న సాక్షి డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి

సనత్‌నగర్: పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) 20వ వ్యవస్థాపక దినోత్సవాలు బుధవారం బేగంపేటలోని హోటల్ ది ప్లాజాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై ప్యానెల్ చర్చలు జరిగాయి. 'పీఆర్‌ను పునరుద్ధరించడం: డిజిటల్ ఆధిపత్య యుగంలో సాంప్రదాయ మీడియాను సమగ్ర పరచడం', 'న్యూఏజ్ డిజిటల్ కమ్యూనికేషన్స్ ఎ పర్‌స్పెక్టివ్' అంశాలపై సుదీర్ఘ చర్చలు కొనసాగాయి. అనంతరం పబ్లిక్ రిలేషన్స్ రంగంలో అత్యుత్తమ నిపుణులైన తొమ్మిది మందికి సంవాహన అవార్డులను ప్రదానం చేశారు. అలాగే పీఆర్‌సీఐ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇదే వేదికపై చాణక్య మ్యాగజైన్ ప్రత్యేక సంచికను విడుదల చేశారు. ఈ వేడుకలకు హాజరైన ఇండియన్ క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్‌మిశ్రా మాట్లాడుతూ, డిజిటల్ మీడియా ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా సంబంధాల రంగంలో ఉన్నవారు ఎప్పటికప్పుడు తమ ప్రతిభకు పదునుపెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు విరాహత్ అలీ, తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ అనూప్‌రెడ్డిలు మాట్లాడుతూ పబ్లిక్ రిలేషన్స్ రంగంలో అంకితభావం, నిబద్ధతతో పనిచేసినప్పుడే విశ్వసనీయత ఉంటుందన్నారు. పీఆర్‌సీఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ షకీల్ అహ్మద్ మాట్లాడుతూ, 20 ఏళ్ల ప్రస్థానంలో పీఆర్‌సీఐ ఎన్నో మైలురాళ్లను అధిగమించిందని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌సీఐ చీఫ్ మెంటార్ ఎమెరిటస్ ఎంబీ జయరామ్, జాతీయ అధ్యక్షురాలు గీతాశంకర్, ఆర్‌టీ కుమార్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

సంవాహన అవార్డులు అందుకున్నది వీరే..

కేఆర్‌పీ రెడ్డి (డైరెక్టర్, సాక్షి), సీహెచ్ రాకేశ్ (సీపీఆర్ఓ, సౌత్ సెంట్రల్ రైల్వే), జయప్రకాశ్ (జనరల్ మేనేజర్, కార్పొరేట్ కమ్యూనికేషన్ ఎన్ఎండీసీ), అనురాధ కిషోర్ (జనరల్ మేనేజర్, ఆర్‌కే స్వామి అడ్వర్టయిజింగ్), హేమంత్ అగర్వాల్ (సీఎండీ, అసోసియేటెడ్ అడ్వర్టయిజింగ్), అనూజ్ గుడివాడ (సింగర్), డాక్టర్ నాగేశ్వరరావు (బ్యూరో చీఫ్, వార్త), మంజులత కళానిధి (సీనియర్ జర్నలిస్ట్), డాక్టర్ సయ్యద్ ఫాజిల్ హుస్సేన్ పర్వేజ్ (మీడియా ప్లస్ ఫౌండర్)

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- రెండో విడత 12వ తేదీ వరకు
- ఇంజనీరింగ్ తర్వాతే బీఆర్క్
- 319 నగరాల్లో పరీక్ష
- తెలంగాణలో హైదరాబాద్ సహా 11 నగరాలు, పట్టణాల్లో
- ఒక్క నిమిషం నిబంధనఅమలు

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్) రెండో విడత గురువారం నుంచి దేశవ్యాప్తంగా మొదలుకానుంది. దీని కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే అడ్మిట్ కార్డులను విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలోనూ పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష జరుగుతుందని అధికార వర్గాలు తెలిపాయి. జేఈఈ మెయిన్స్ తొలి విడత జనవరి 25న జరిగింది. ఫలితాలను కూడా వెల్లడించారు. ఈసారి జరిగే రెండో విడత పరీక్షకు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు లక్ష మంది హాజరయ్యే వీలుంది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది జేఈఈ రెండు విడతల పరీక్షలకు 11 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తొలి విడతలో అర్హత సాధించని వారితో పాటు, మంచి ర్యాంకుకు అవకాశం లేని వారు కూడా ఈ దఫా పరీక్షకు హాజరవుతున్నారు. గతంలో బీఆర్క్(బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్ట్) పరీక్షను ముందే నిర్వహించే వారు. ఈసారి ఈ పరీక్షను ఇంజనీరింగ్ జేఈఈ తర్వాత నిర్వహిస్తున్నారు.

రాష్ట్రంలోని 11 నగరాలు, పట్టణాల్లోని కేంద్రాల్లో

జేఈఈ మెయిన్స్–2 పరీక్ష ఈనెల4వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ జరుగుతుంది. 12న మాత్రం బీఆర్క్, మిగతా రోజుల్లో ఇంజనీరింగ్ జేఈఈ మెయిన్స్ ఉంటుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, రెండో షిఫ్ట్ సాయంత్రం 3 నుంచి 6 వరకూ పరీక్ష జరుగుతుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరు. రెండు గంటల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఎన్టీఏ సూచించింది. దేశవ్యాప్తంగా 319 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 11 నగరాలు, పట్టణాల్లోని కేంద్రాల్లో పరీక్ష జరుగుతుంది. కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, సిద్దిపేట, వరంగల్, సూర్యాపేట, హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని కేంద్రాల్లో పరీక్షలను నిర్వహిస్తారు.

40 ప్రశ్నలకు సరైన జవాబిస్తే అర్హత: జేఈఈ మెయిన్స్ పరీక్షలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ పేపర్ల నుంచి 75 ప్రశ్నలిస్తారు. ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు. తప్పుగా ఆన్సర్ చేస్తే 1 నెగెటివ్ మార్క్ ఉంటుంది. గత పేపర్లను బట్టి చూస్తే విద్యార్థులు మొత్తంగా 40 ప్రశ్నలకు సరైన జవాబులు ఇవ్వగలిగితే మెయిన్స్ అర్హత సాధిస్తారని ప్రముఖ గణిత శాస్త్ర నిపుణులు ఎంఎస్ రావు తెలిపారు. 60 ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు ఇస్తే మంచి ర్యాంకు వస్తుందన్నారు. కొన్నేళ్లుగా మేథ్స్ పేపర్ కఠినంగానే ఉంటోందని, సుదీర్ఘ ప్రశ్నలకు జవాబు రాసేప్పుడు సమయం వృథా కాకుండా చూసుకోవాలని సూచించారు.

'జన జాతర'కు ప్రియాంక



తుక్కుగూడ సభకు రాక

- ఎక్కువ స్థానాల్లో ఆమెతో ప్రచారం చేయించే యోచనలో టీపీసీసీ
- మెదక్‌తో పాటు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో పర్యటనలకు ప్లాన్
- రాహుల్‌తో పాటు కొన్ని సభలకు హాజరు కానున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ
- తుక్కుగూడ సభ నుంచే ఏఐసీసీ జంగ్ సైరన్

సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నారు. ఇందిరాగాంధీ గతంలో ప్రాతినిధ్యం వహించిన మెదక్ లోక్‌సభ స్థానంతో పాటు పార్టీకి విజయావకాశాలున్న పలు చోట్ల ఆమె చురుగ్గా ప్రచారం నిర్వహించే అవకాశాలున్నాయని గాంధీ భవన్ వర్గాలు వెల్లడించాయి. ఈసారి ఎన్నికల్లో తెలంగాణ పరిధిలో ఆమె సేవలు వినియోగించుకోవాలని ఏఐసీసీ స్థాయిలో నిర్ణయించిన కారణంగానే ఈనెల 6వ తేదీన తుక్కుగూడలో జరగనున్న 'జనజాతర' సభకు హాజరు కానున్నట్లు సమాచారం. తొలుత ఈ సభకు రాహుల్‌గాంధీ, మల్లికార్జు న ఖర్గే మాత్రమే రావాలని నిర్ణయించినా ప్రియాంకను కూడా పంపాలని ఏఐసీసీ నిర్ణయించింది. తుక్కుగూడ సభతో పాటు లోక్‌సభ ఎన్నికల ప్రచార షెడ్యూల్‌ను ఏఐసీసీతో సమ న్వయం చేసే బాధ్యతలను టీపీసీసీ ముఖ్య నేతలకు అప్పగించినట్టు తెలుస్తోంది.

మేనిఫెస్టో.. మరుసటి రోజే

తుక్కుగూడ సభను టీపీసీసీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దేశ వ్యాప్తంగా జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం ఈనెల ఐదో తేదీన మేనిఫెస్టో విడుదల చేసిన మరుసటి రోజే తుక్కుగూడలో సభ జరుగుతుండడం, సభకు రాహుల్, ప్రియాంక, ఖర్గే తదితర ముఖ్యులు హాజరు కానున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టాలని భావిస్తోంది. భారీ జనసందోహం మధ్య లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ గడ్డ నుంచే ఏఐసీసీ జంగ్ సైరన్ మోగిస్తుందని టీపీసీసీ వర్గాలు చెపుతున్నాయి. ఈ సభలో పార్టీ మేనిఫెస్టోతో పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలుచేయనున్న ఐదు గ్యారంటీలను తెలుగులో విడుదల చేయనున్నారు.

అచ్చొచ్చిన చోట.. పది లక్షల మందితో

తుక్కుగూడలోని 60 ఎకరాల విశాలమైన మైదానంలో జన జాతర బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. మైదానం పక్కనే వాహనాల పార్కింగ్ కోసం 300 ఎకరాల స్థలాన్ని అందుబాటులో ఉంచారు. ఈ సభకు కనీసం పదిలక్షల మంది హాజరవుతారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు, జహీరాబాద్ నుంచి భద్రాచలం వరకు పెద్ద ఎత్తున పార్టీ కేడర్ తరలివచ్చేలా ఎక్కడికక్కడ ఏర్పాట్లుచేస్తున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు ఈ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో కూడా తుక్కుగూడ నుంచే రేవంత్ నేతృత్వంలో టీపీసీసీ ఎన్నికల సమర శంఖాన్ని పూరించింది. తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా గత ఏడాది సెప్టెంబర్ 17న ఇక్కడ నిర్వహించిన సభకు సోనియాగాంధీ హాజరై ఆరు గ్యారంటీలను ప్రకటించారు. విజయభేరి పేరుతో సభ నిర్వహించిన ఈ ప్రాంతం కలిసివచ్చిందని, తెలంగాణలో అధికారంలోకి తెచ్చిన ప్రారంభ సభ ప్రాంతాన్నే లోక్‌సభ ఎన్నికల కోసం ఎంచుకున్నామని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సభ స్ఫూర్తితోనే దేశంలో పదేళ్ల నియంతృత్వ, అప్రజాస్వామిక బీజేపీ పాలనకు తెరదించుతామని చెబుతున్నాయి.

ఆసక్తి రేపుతున్న రేవంత్ వ్యాఖ్యలు

గత ఎన్నికలకు ముందు తుక్కుగూడలో నిర్వహించిన సభలోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చి తీరుతుందని అప్పటి పీసీసీ అధ్య క్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. డిసెంబర్ 9న కొలువుదీరే ప్రజా ప్రభుత్వ ప్రమాణ స్వీకారానికి అందరూ ఆహ్వానితులేనని చెప్పుకొచ్చారు. ఈనెల 6న జరిగే సభ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించేందుకు రెండురోజుల కిందట తుక్కుగూడకు వచ్చిన సీఎం.. జూన్ 9న ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ప్రకటించారు. దీంతో తుక్కుగూడ వేదికగా రేవంత్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.

బీఫాం రెడీ.. రూ. 76వేలు అకౌంట్‌లో వేయండి

- కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థులకు సైబర్ నేరగాళ్ల ఝలక్
- గాంధీభవన్ నుంచే అభ్యర్థుల వివరాలు తీసుకున్న కేటుగాళ్లు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు రాజకీయాల్లోకి కూడా చొరబడుతున్నారు. ఎక్కడ అవకాశముంటే అక్కడ డబ్బులు లాక్కోవడమే లక్ష్యంగా పని చేసే ఈ సైబర్ నేరగాళ్లకు ఈసారి కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థులు టార్గెట్ అయ్యారు. ఏఐసీసీ అధికారికంగా ప్రకటించిన పలువురు లోక్‌సభ అభ్యర్థులకు ఫోన్లు చేసి డబ్బులు దండుకునేందుకు ప్రయత్నించారు. తాము ఏఐసీసీ నుంచి మాట్లాడుతున్నామని, మీ బీ–ఫాం రెడీ అయిందని, రూ.76 వేలు తమకు పంపితే బీఫాం పంపిస్తామని ఫోన్లు చేశారు. ఇలాంటి ఫోన్లు అందుకున్న కొందరు అభ్యర్థులు లైట్ తీసుకోగా, వరంగల్ అభ్యర్థి కడియం కావ్య అప్రమత్తమై గాంధీభవన్‌కు ఫోన్ చేసి విషయం తెలుసుకున్నారు. తన తండ్రి కడియం శ్రీహరితో మాట్లాడిన ఆమె, గాంధీభవన్‌లో వాకబు చేసి అసలు విషయం తెలుసుకుని డబ్బులు పంపలేదని సమాచారం. కొసమెరుపేమిటంటే... ఈ అభ్యర్థుల వివరాలన్నింటినీ సైబర్ నేరగాళ్లు గాంధీభవన్ నుంచే తీసుకున్నారట. గాంధీభవన్‌కు ఫోన్ చేసి తాము ఏఐసీసీ నుంచి మాట్లాడుతున్నామని, అభ్యర్థుల వివరాలు, వారి ఫోన్ నెంబర్లు తమకు పంపాలని కోరడంతో నిజమేననుకున్న గాంధీభవన్ సిబ్బంది వారి వివరాలను పంపించారు. ఆ వివరాల మేరకు సైబర్ నేరగాళ్లు కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థులకు టచ్‌లోకి వెళ్లి ఝలక్ ఇచ్చేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు.

ఇదేంటో తెలుసా? తెలియదు కదూ..

లీఫీ సీ డ్రాగన్..



సీ హార్స్ తెలుసు కదా.. దానికి కాస్త దగ్గరి చుట్టం. మన దగ్గర కనిపించదు. ఆస్ట్రేలియా సముద్ర జలాల్లో ఉంటుంది. కొంచెం అరుదైనది. సముద్రంలో దీన్ని గుర్తించడం కష్టం. చూశారుగా.. ఒళ్లంతా ఆకుల్లా ఎలా ఉన్నాయో.. ఇది ఈదుతున్నప్పుడు చూసినోళ్లంతా ఏదో సముద్రపు నాచు తేలుతోంది అని అనుకుంటారట. పైగా.. ఇవి ఫొటోకు పోజిచ్చినట్లుగా ఇలా పోట్రెయిట్ తీయడం కష్టమట. ఈ చిత్రాన్ని స్కాట్ అనే అండర్ వాటర్ ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించారు.

డ్రగ్స్ వ్యాప్తి ప్రపంచం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య: డీజీపీ రవిగుప్తా



సాక్షి,హైదరాబాద్: ప్రపంచ దేశాలన్నీ ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య డ్రగ్స్ వ్యాప్తి అని డీజీపీ రవిగుప్తా పేర్కొన్నారు. దీన్ని నిరోధించేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీఎస్‌నాబ్) తీవ్రంగా శ్రమిస్తోందన్నారు. మాదక ద్రవ్యాల కేసులను పక్కాగా పరిశోధించేందుకు పోలీసు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బందికి పోలీసు శాఖ నిర్వహించిన స్వల్పకాల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రూపొందించిన 25 కంపల్సరీ ఇన్వెస్టిగేషన్ టెంప్లేట్స్ అండ్ 25 మాండేటరీ సీడీ ఫైల్ డాక్యుమెంట్స్ ఇన్ ఎన్‌డీపీఎస్ యాక్ట్–1985 పుస్తకాన్ని డీజీపీ ఆవిష్కరించారు. టీఎస్‌నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లా కేటగిరీ పోస్టులకు 1:3 నిష్పత్తి !

▶ మొదటి పేజీ తరువాయి

సమాచారం. ఈ పద్ధతిలో ఎక్కువ మంది అభ్యర్థులను ఎంపిక చేయడంతో అన్ని పోస్టులను భర్తీ చేయవచ్చని కమిషన్ భావిస్తోంది. ఇక జోనల్, మల్టీజోనల్ స్థాయి ఉద్యోగాలను మాత్రం 1:2 నిష్పత్తిలోనే భర్తీ చేస్తారు. ప్రస్తుతం ఈ అంశాలపై మథనం చేస్తున్న కమిషన్ అతి త్వరలో నిర్ణయం తీసుకొని ఆమేరకు అమలు చేయనున్నట్టు తెలిసింది.

ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మరింత వేగవంతం: టీఎస్‌పీఎస్సీ ద్వారా చేపట్టిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మరింత వేగవంతమైంది. పెండింగ్‌లో ఉన్న అర్హత పరీక్షల తేదీలను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఇప్పటివరకు నిర్వహించిన అర్హత పరీక్షల్లో మెజారిటీ పరీక్షలకు 'కీ'లు, జవాబుపత్రాల 'కీ', మెజారిటీ పరీక్షలకుగాను జనరల్ ర్యాంకింగ్ లిస్ట్(జీఆర్ఎల్)లను కూడా కమిషన్ విడుదల చేసింది. జీఆర్ఎల్‌కు సంబంధించి ఇప్పుడు ప్రాథమిక ఎంపిక జాబితాను విడుదల చేయాల్సి ఉంది. దీనికోసం అంతర్గత ప్రక్రియను అధికారులు వేగవంతం చేసినట్టు సమాచారం. ప్రాథమిక ఎంపిక జాబితా విషయంలో టీఎస్‌పీఎస్సీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రాథమిక ఎంపిక జాబితా ప్రకటన, ఆ తర్వాత ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ, చివరగా తుది జాబితాల ప్రకటన చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకుంటోంది. ప్రస్తుతం జిల్లాస్థాయి, జోనల్‌స్థాయి, మల్టీజోనల్ స్థాయి ఉద్యోగాలను భర్తీ చేస్తుండగా... ఇప్పటివరకు తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ), తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామకాల బోర్డు(టీఎస్ఎల్‌పీఆర్‌బీ), తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఎంహెచ్ఎస్ఆర్‌బీ)లు ప్రాథమిక జాబితాల ఎంపికలో 1:2 నిష్పత్తిని నిర్ధారించుకుని ఉద్యోగాల భర్తీ పూర్తి చేశాయి. దాదాపు 33వేల ఉద్యోగాలను ఇదే పద్ధతిలో భర్తీ చేశారు. నోటిఫికేషన్‌లో నిర్దేశించిన పోస్టులు, భర్తీ ప్రక్రియ పరిశీలిస్తే దాదాపు 15శాతం కొలువులు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. ఒక్కో అభ్యర్థికి రెండు, అంతకంటే ఎక్కువ ఉద్యోగాలు రావడం, అన్ని రకాల పోస్టులకు సంబంధించి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావడం, ప్రాధాన్యత క్రమంలో నచ్చిన కొలువు ఎంచుకోవడం, సరైన అభ్యర్థులు లేకపోవడం లాంటి కారణాలతో ఇలా మిగిలిపోయినట్టు అధికారవర్గాలు భావిస్తున్నాయి. దీంతో అర్హుల ఎంపికకు 1:3 నిష్పత్తిని అనుసరించాలని నిర్ణయించారు.



తిరుమలగిరి.. ధాన్యపు సిరి

తిరుమలగిరి (తుంగతుర్తి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం 32,860 బస్తాల ధాన్యం వచ్చింది. ఇది ప్రస్తుత యాసంగి సీజన్‌లోనే అత్యధికమని మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. గరిష్టంగా క్వింటాకు రూ.2 వేలు, కనిష్టంగా రూ.1,650 ధర పలికినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్‌కు భారీగా ధాన్యం రావడంతో గురువారం మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు చెప్పారు. ఈ నెల 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ సెలవు ఉందని, తిరిగి వ్యవసాయ మార్కెట్ 6న యథావిధిగా పని చేస్తుందని శ్రీధర్ వెల్లడించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.